ఫిబ్రవరి 2020

రూ. 20

# చైతన్యం

## సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక



ఘనంగా 71 వ గణతంత్ర దిన వేడుకలు


రిపబ్లిక్ డే వేడుకల ముఖ్య అతిథి బ్రెజిల్
అధ్యక్షుడితో భారత రాష్ట్రపతి, ప్రధాని


రిపబ్లిక్ డే పెరేడ్ లో సారధ్యం వహించిన
మహిళ కెప్టెన్ తానియా షెర్గిల్




# చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

సంపుటి -9 ఫిబ్రవరి 2020 సంచిక - 5


## ఈ సంచికలో

### ధారావాహికములు:


పూరి జగన్నాధస్వామి వైభవం 8

ప్రేమంటే ఇంతే 31

గడిలో దాగిన వైజ్ఞానిక నుడి 36

తెలుగు పద్య రత్నాలు 37

మా ఊరి నందుల కథ 42

ప్రహేళిక 50


### ప్రత్యేక ఆకర్షణలు


సంపాదకీయం 4

అభిప్రాయ వేదిక 5

పద్మ భూషణ్ పురస్కారాలు 6

కలుష హరం - మాఘం 14

చెప్పడమే నా ధర్మం 20

శ్రీసూక్తం 22

ఆరవ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి 25

పసుపు, పారాణి, తాంబూలం 29

బ్రహ్మ వరం 39

నాగరాజు రామస్వామి 44

కారణ జన్ముడు 46



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

అధికారుల మధ్య నలిగిపోతున్న ఆంధ్ర మాత
గందరగోళంలో ప్రజలు.

అధికార, ధన దాహంతో ఉన్న రాజకీయ నాయకులు కుల మత లింగ, ప్రాంతీయ వివక్షలతో రాజకీయం చేస్తూ ప్రజలకు ద్రోహం చేయడంలో కూడా ప్రజలనే పావులుగా వాడుకుంటూ తామే గొప్ప అనే భావన అందరిలోనూ కలిగించడానికి ప్రయత్నం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటుంన్నారని కొందరు వాపోతున్నారు. తమ రక్తాన్ని చిందించి, ఎంతో శ్రమ కొడ్చి ప్రజలు కూడబెట్టిన కొందరి సొమ్ము ను, అధికారులు తమ సొంత సొమ్ములా రాష్ట్రంలోని మిగిలిన ప్రజలలో కొందరికి పేదవారు అంటూ రకరకాలుగా ఎర చూపి దానం చేయడం ఎంత వరకూ సమంజసం? అని, కొన్ని వర్గాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆర్థిక అసమానతలను రూపుమాడడం అంటే రాష్ట్రం అభివృద్ధి చెందే పనులు చేప ట్టి లేని వారికి విద్య ఉపాధి అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించాలే కానీ మా కష్టాన్ని ఊరికే ఇచ్చి, వారిని ఎందుకు సోమరిపోతులు లాగా, తాగుబోతులు లాగ, తయారయ్యేటట్లు వ్యసనాలకు గురి చేస్తున్నారు? అని కొందరి భావన. ఒక కుటుంబం వృద్ధి లోకి వచ్చి ఆ కుటుంబంలోని పిల్లలు సంస్కారంతో పెరుగు తూ ఉన్నత స్థితికి చేరారంటే కారణం ఆ పిల్లల తల్లితండ్రులు క్రమశిక్షణతో తీర్చి దిద్దారని ఆ పిల్లలని చూడగానే తేట తెల్లమవుతుంది. అలాగే ఒక స్కూల్ విద్యార్థులను చూడగానే ఆ పాఠశాల లేదా కళాశాల యొక్క గురువుల గొప్పదనంగా తెలుస్తుంది. ఇక మరి రాష్ట్రం లేదా దేశం గొప్పగా ఉండాలంటే దానిని పరిపాలించే నాయకుల మీద ఆధారపడి ఉంటుంది. అలాంటప్పుడు వారే అభివృద్ధి కి బాటలు వెయ్య కుండా ప్రజల సమయాన్ని, సొమ్మును వృధా చేస్తూ ఎంతో మంది ప్రజలు ఆర్థిక , ఆరోగ్య, మానసిక ఇబ్బందులకు లోనవుతున్నారు. పల్లెలు పట్టణాలు అనే భేదం లేకుండా ప్రతీ గ్రామంలో ను పట్టణం లోను విద్య, వైద్యం , ఆరోగ్యం వంటి అన్ని సదుపాయాలూ కల్పించ గలిగితే ఈ రోజు పల్లెలు ఖాళీ అయ్యే పరిస్థితి వచ్చేది కాదు,పల్లెటూళ్ళు బోసి పోయాయి పట్టణాలు అంగుళం ఖాళీ లేకుండా ఉన్నా యి కదా ! అనేది ప్రజల వాదన. ఓట్లు సంపాదించడం కోసం వినియోగించే తెలివి తేటలు, సమయం, సొమ్ములు, ప్రజల అభివృద్ధికి పాటుపడితే బావుంటుందనేది అందరి వాదన. కొందరు స్వార్థపరులైన ప్రజల అండ దండలతో రాజకీయ నాయకులు తాము అభివృద్ధి చెందుతూ, రాష్ట్ర లేదా దేశ అభివృద్ధి కుంటు పడడానికి కూడా కారకులవుతుంటే తప్పెవరిది? ప్రజలంతా నిస్వార్థంగా ఆలోచించి, కలిసి కట్టు గా, గుట్టుగా ఉండి , విష పూరితంగా, స్వార్థ పూరితంగా చేస్తున్న పరిపాలకులను నిలదీసిన రోజు కానీ దేశం బాగుపడదు అనే విషయం అందరికీ తెలుసు. కానీ వీరిని దేశ భక్తితో, నిస్వార్థంగా నడిపే సరియైన నాయకుడే ప్రజలకు అవసరం అనడంలో ఎటువంటి సందేహం లేదు. పేరుకే ప్రజా స్వామ్యంగా నడిపి- స్తూ, తమ తమ బలా బలాలతో అహంకారాలతో రాష్ట్ర అధికార ప్రతిపక్షాలు ఎవరికి తోచినట్లు వారు వ్యవ- హరిస్తుంటే , కేంద్రం ఏమి చేస్తోంది? దొంగలు పడి ఖాళీ చేసిన ఇల్లు చూడానికి పోలీసులు వచ్చినట్లుగా వస్తారా? లేక అధర్మం లో ప్రజలంతా అన్యాయమై పోయాక శ్రీ కృష్ణుడిలా ప్రత్యక్ష మవుతారా? ఇటు ఆంధ్ర, తెలంగాణాలు రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఇన్నాళ్ళయినా ఇంకా ఆంధ్రప్రదేశ్ లో ప్రజలు అసమానత- లతో, అడుగడుగనా అభివృద్ధికి ఆటంకాలు జరుగుతూ ఉంటే, రెండు రాష్ట్రాలుగా విడిపోయి ఇన్నాళ్ళ- యినా ఆ రాష్ట్రం బాగుపడే దెప్పుడు? ప్రజలు సుఖ శాంతులతో ఉండేది ఎప్పుడు?తొందరగా పరిష్కరించక పోతే, ఆంధ్ర రాజధానిని ఇంకా ఎక్కడెక్కడికి మారుస్తారో ? ప్రజలకు అర్థం కావడం లేదు.

ప్రజలారా ! మన రాష్ట్ర అభివృద్ధి జరుగుతోందా?లేదా? అని చూసుకుంటూ సరిదిద్దుకోవలసిన బాధ్యత మన అందరిదీ అని మరచిపోవద్దు.

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

1. కొత్త సంవత్సరంలో ప్రకాశవంతమైన సూర్యుడి టైటిల్ పేజీలాగా చైతన్యం కుడా ప్రకాశవంతంగా ఉండాలని కోరుకుంటున్నాం. డా. పోచిన పెద్ది మురళీకృష్ణ గారు పూరి జగన్నాథ వైభవంలో మార్కండేయ కథ బాగా వ్రాసారు. అలాగే ధనుర్మాసం సందర్భంగా కొత్త రామానందం గారువ్రాసిన గోదా దేవి కథ బావుంది.

శ్రీ రమణారావు , శ్రీ సుభాష్ --- పూనా . శ్రీమతి సరోజ, శ్రీ రమేష్ --- కొత్తగూడెం. శ్రీమతి పల్లవి, శ్రీమతి బారతి --- కాకినాడ.

2. భువనచంద్ర గారు సూచించినట్లు అనేక రూపాలలోని భగవంతుడు ఒక్కడే, అంటూ భక్తుడు -- భగవంతుడు కథ ఆలోచింప చేసేదిగా చాలా అద్భుతంగా ఉంది.శ్రీమతి పి. సత్యవాణి గారు గొల్లపూడి మారుతీ రావు గారు గురించి ఎన్నో విషయాలు తెలియ జేశారు . నుజంగా వారు బహుముఖ ప్రజ్ఞాసాలే.

శ్రీమతి ఉష, శ్రీమతి విజయ ---అనంతపూర్. శ్రీమతి వాణి , శ్రీమతి రమణీలత ---- రాయపూర్ . శ్రీ సుబ్రహ్మణ్యం, శ్రీ కనకారావు, శ్రీమతి అనసూయ --- సర్పవరం.

3. కొత్త సంవత్సరంలో ఏం చేద్దాం అంటూ భారతి గారు మంచి సూచనలు ఇచ్చారు. అలాగే పాలెపు బుచ్చిరాజు గారు రాష్ట్రపతుల గురించి ప్రతీ నెల వ్రాస్తూ ఈ నెల ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ గురించి తెలియని ఎన్నో విషయాలు తెలియ జేశారు.

శ్రీమతి లీల, శ్రీమతి సావిత్రి, శ్రీ వేణు ----- పెద్దాపురం. శ్రీ రవి గోపాల్, శ్రీ సుధాకర్, శ్రీమతి అను ---- రాజమండ్రి. శ్రీ సత్యం, శ్రీమతి సుమ, శ్రీమతి పల్లవి ---- పూనా.

4. వేమూరి వెంకటేశ్వర రావు గారు వ్రాస్తున్న గణితంలో ప్రత్యేకతలు చాలా ఇంట్రిస్ట్ గా ఉంటోంది. అయిపోతోం డానే నిజంగా చాలా బాధ కలిగింది. ఇంద్రగంటి సుబ్బారావు గారు వ్రాస్తున్న ప్రేమంటే ఇంతే లో సామాజిక విషయాలను చెబుతూనే ప్రేమ కథ బాగా వ్రాస్తున్నారు.

శ్రీమతి రోజా, శ్రీమతి లీలావతి, శ్రీ ప్రభాకర్ ----- సికింద్రాబాదు.శ్రీమతి పార్వతి, శ్రీ కమలేష్, శ్రీమతి సుమ ----- ఏలూరు. శ్రీ సుధీర్, శ్రీమతి కమల ---- కడప.

5. శ్రీమతి చాగంటి కృష్ణ కుమారిగారు అందిస్తున్న వైజ్ఞానిక నుడి చాలా విజ్ఞానదాయకంగా, ఆలోచింప చేసేదిగా ఉంటోంది. ఆర్. దంతుర్తి శర్మ గారు ధూర్జటి వ్రాసిన కాళహస్తీశ్వర శతకంలోని పద్యంతో పాటు,- దాని వివరణ కుడా ఇచ్చారు. చాలా బావుంది.

శ్రీ కరుణాకర్, శ్రీ సుబ్బారావు, శ్రీమతి సరోజ ---- హైదరాబాదు. శ్రీమతి చిన్ని, శ్రీ ప్రకాష్, శ్రీమతి విజయ --- నెల్లూరు. శ్రీ మోహనరావు, శ్రీ మధు ------ బొంబాయి.

6. శ్రీమతి ఆదూరి హైమవతి గారు ఎవరి ప్రతేకత వారిది అంటూ ఇతరులతో పోల్చుకుని తక్కువ చేసుకోకూడదు అనే కథ బాగా వ్రాసారు. నందుల ప్రభాకర శాస్త్రిగారు మా ఊరి ఆత్మీయ కథను చాలా ఇంట్రెస్ట్ గా వ్రాస్తున్నారు. మాతెలుగు తల్లికి మల్లెపూదండ పాట ఇప్పటికీ ఎన్ని సార్లు విన్నా వినాలనిపించే గొప్ప పాట. ఆ పాటను సుందరంబాడి శంకరాచారి గారు ఎంతబాగా వ్రాసారో , టంగుటూరి సూర్యకుమారిగారు అంత బాగా పాడారు, అంత అందంగా ఉన్నారు.

శ్రీమతి సుధ, శ్రీ రమణ్, శ్రీ శ్రీను , శ్రీ చిదానందం --- వరంగల్. శ్రీ రాజశేఖర్,శ్రీమతి లక్ష్మి, శ్రీమతి గాయత్రి ---- కడప. శ్రీ సతీష్ కుమార్, శ్రీ విశ్వం ---- పాడేరు.

7. ఎలక్ట్రాన్ గారు రోజు రోజుకీ పెరిగిపోతున్న మాన భంగాలు గురించి బాగా విశ్లేషించారు. ఇటువంటి విశ్లేషణాత్మక రచనలు ప్రస్తుత సమాజంలో చాలా అవసరం. జవాబు చెప్పగలరా ? అంటూ ఇస్తున్న ప్రహేళిక రకరకాలుగా ఇస్తున్నారు . చాలా హుషారుగా అనిపిస్తుంది. తిరిగి మీకు జవాబు పంపేదాన్నికి బద్ధకిస్తున్నాను.

శ్రీమతి రుక్మిణి, శ్రీమతి అరుణ, శ్రీ వెంకట్ --- తణుకు. శ్రీ సుందర రావు , శ్రీ రామమూర్తి, శ్రీమతి సుందరి - భీమవరం. శ్రీమతి భారతి, --- రాజోలు.

8. గంగిరెద్దు, తెలుగు మహా సభలు, గోదావరి జలాల ఫోటోలతో కలర్ ఫుల్ గా పత్రిక మొత్తం చాలా బావుంది. మానస సరోవరం వీడియో అప్పుడే అయిపోయిందా అనిపిస్తోంది. మరలా వేరే ఏదైనా పెట్టమని విజ్ఞప్తి.

శ్రీ రంగ , శ్రీ ఫణి , శ్రీమతి సుజాత ---- ఖాజీపేట. శ్రీ వాసు, శ్రీ మతిమణి ---- హైదరాబాదు.

# పద్మ భూషణ్ పురస్కారాలు 2020



శ్రీ ఎమ్ (ముంతాజ్ ఆలీ)



కీ.శే. సయ్యద్ మువాజం ఆలీ




శ్రీ ముజఫర్ హుసేన్ బేగ్



శ్రీ అజయ్ చక్రవర్తి



శ్రీ మనోజ్ దాస్




శ్రీ బాలకృష్ణ దోషి



శ్రీమతి కృష్ణమ్మాల్ జగన్నాథన్



శ్రీ ఎస్ సి జమీర్



శ్రీ అనిల్ ప్రకాష్ జోషి

# పద్మ భూషణ్ పురస్కారాలు 2020



శ్రీమతి సేరింగ్ లోండేల్



శ్రీ ఆనంద్ మహేంద్ర



కీ.శే. నీలకంఠ ఆర్ మాధవమీనన్



కీ.శే. మనోహర్ జి. ప్రభు పారీకర్



శ్రీ జగదీశ్ సేఠ్



కుమారి పి.వి.సింధు



శ్రీ వేణు శ్రీనివాసన్



# పూరి జగన్నాధ స్వామి వైభవం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

**పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది. కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.**

**స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్త్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందడి.**

**- సంపాదకురాలు**

వారిలో ఒక వైష్ణవుడు వారిని చూసి జాలి పడి, “పురుషోత్తమ క్షేత్రంలో ఉన్న జగన్నాధుని దర్శించుకున్నట్లయితే మీ పాపాలు నశించిపోతాయి”

ఇది స్కాందపురాణంలోని జైమిని ఋషి సంవాదము అను నాలుగవ అధ్యాయం సమాప్తం.

జైమిని ఋషి సంవాదము-2

అంబరీషుడు, పుండరీకుడు తమ దుర్గుణాలను విడిచి పెట్టి, పురుషోత్తమ క్షేత్రానికి చేరుకొని,పుష్కరిణిలో స్నానం చేసి, స్వామి సన్నిధి చేరి, కళ్ళు మూసుకొని ప్రార్ధించారు. సాష్టాంగ నమస్కారం చేసారు. స్వామి దర్శనం కోసం ఎదురు చూసారు. వారు ఎంత ప్ర యత్నించినా స్వామి దర్శ నం లభించలేదు. ( 1- 3)

వారు నిరాహారులై మూడురోజులు అక్కడే ఉండి, స్వామిని ప్రార్ధించారు. నాలుగవ రోజు మూడవ జామున ఒక జ్యోతిని చూసారు. ( 4 – 5)

పుండరీకుడు, అంబరీషుడు, తిరిగి మూడు రోజులు అక్కడే ఉండి ఉపవాసం చేస్తూ స్వామిని ప్రార్ధించారు. ఏడవ రోజు మధ్య భాగంలో స్వామి దివ్య దర్శనం లభించింది. ( 5 – 6)

స్వామి శంఖము, చక్రము, గద, ధరించి ఉన్నాడు దివ్యాభరణాలు ధరించి ఉన్నాడు. రత్నపాదుకలపై స్వామి పాదాలు ఉన్నాయి.ఎడమవైపున లక్ష్మీదేవి ఉంది. కొంతమంది స్త్రీలు బెత్తాలు పట్టుకొని ఉన్నారు.

కొందరు చామరాలు పట్టుకొని వీస్తున్నారు. గంధపు నూనితో దీపాలు వెలిగించారు. ఒక స్త్రీ రత్నమయ మైన గొడుగు పట్టుకొంది. ఒక స్త్రీ కృష్ణాగరు ధూపాన్ని వేస్తోంది. దేవతలు స్వామిని స్తుతిస్తున్నారు. నారదా

దులు పాటలు పాడుతున్నారు. గంధర్వులు శ్రద్ధ గా వింటున్నారు. ఈ విధంగా దివ్య మైన లీలా వైభవంతో ఉన్న స్వామిని పుండరీక, అంబరీషులు చూసారు. "జగత్తుకు ఆధారమైన వాడు,సృష్టి స్థితి లయలకు కారణమైన వాడు, చావు పుట్టుకలు లేని వాడు, నిత్యా నంద స్వరూపుడు, చిన్మాత్రుడు, జగదాధీసుడు, పరాత్పరుడు అగు నిన్ను ఏవిధంగా తెలుసుకో గలము?. దుష్టమార్గంలో ప్రవర్తించి, నిన్ను శరణు కోరి వచ్చిన నన్ను రక్షించు. ( 7- 20 )

దీనులపైనా, అనాధులపైన దయ చూపు వాడవు, అన్నిటికి మూల కర్తవు, మోక్షాన్ని ఇచ్చు వాడవు, ధర్మార్ధ మోక్షాన్ని ఇచ్చు వాడవు, నీకంటె అధికులు ఎవరు లేరు. యజ్ఞములకు భిన్న, భిన్న, ఫలితాలు ఇస్తావు, నిన్ను చేరడానికి భక్తియే మార్గం.

స్వామి నీ పాదాలయందు భక్తి ఉండునట్లు అనుగ్ర హించు. భవ సాగరాన్ని దాటుకొనే భక్తి మార్గాన్ని చూపించు.

నేను అల్పసుఖాలను కోరుకోవటం లేదు.నీ పద కమలాలను ప్రార్ధిస్తున్నాను. నన్నుఅనుగ్ర హించు" అని పుండరీకుడు పురుషోత్తముని ప్రార్ధించాడు.( 21- 36 )

" ఓ! దేవా! అనుగ్రహించు. నీవు సర్వాత్మ కుడవు, తత్వాలన్నిటికి అతీతుడవు. ఈ ప్రపంచాన్ని నీవు సృష్టించావు. నీ పాదాలనుండి పుట్టిన గంగ మూడు లోకాలను పావనం చేస్తోంది. నీ నామం పాతకాలను నశింప చేస్తోంది. శుభాలను కలిగిస్తోంది. సర్వ సిద్ధులు కలుగుతాయి. ఈవిషయం తెలుసుకో లేక అజ్ఞానులు నిన్ను వెదుకుచున్నారు.

ఓ దేవా! నీ పాదాలనుండి పుట్టిన గంగ తాపత్ర యాలు పోగొడుతున్నాయి. పురుషార్ధాలన్ని నీ పాదా లయందు లభిస్తున్నాయి. బ్రహ్మాది దేవతలు నీ అనుగ్ర హం వలన తమ తమ శక్తులను పొందుచున్నారు. వేదాలు అనేక మార్గాలు చూపిస్తున్నాయి. అయినా నీపై ఉన్న భకి ఒక్కటే సరయిన మార్గము. అని అంబరీషుడు ప్రార్ధించాడు.( 37 – 49)

అంబరీష, పుండరీకులు తమ స్వప్నావస్థను విడిచిపెట్టి,మానుష భావాన్ని పొందారు.నా రాయణుని పక్క న బలరాముని చూసారు. బలరామునికి ఏడు పడగలు ఉన్నాయి. కైలాస పర్వతం వలె ఎత్తుగా ఉన్నాడు. పద్మాలవంటి కన్నులు ఉన్నాయి. శంఖ చక్ర గదా పద్మం ధరించి ఉన్నాడు. ప్రార్ధించిన వారి పాపాలు నశింప చేస్తున్నాడు.( 50 – 58 )

శ్రీకృష్ణ బలరాముల మధ్య సుభద్ర ఉంది. ఆమె ఎర్రగా ఉంది.దేవతలు నమస్క రిస్తున్నారు. నారాయణుని హృదయంపై లక్ష్మీ దేవి ఉంది.( 59-64)

ఈవిధంగా నారాయణుడు నాలుగు రూపాలను పొంది బ్రహ్మ తీర్థానికి సమీపంలో ఉన్న వటవృక్షం మూల దారు రూపంలో అవతరించారు. (65 – 77)

అనేక వృక్షాలు, పర్వతాలతో నిండి ఉన్న ఈప్రాంతం ఉత్కల దేశంలో ( ఒరిస్సా) ఉంది. ఋషికుల్య, స్వర్ణ రేఖ అను నదుల దక్షిణ సముద్రంలో కలుస్తున్నాయి. ఈ మధ్య ఉన్న ప్రాంతం ఉత్కల దేశం.

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండం లోని పురు షోత్ ్త మ క్షేత్ర మాహాత్మ్యం లోని జైమిని ఋషి సంవాదం అను ఐదవ అధ్యాయం,ఆరవ అధ్యాయం సమాప్తం.

## 7 వ అధ్యాయం

## జైమిని ఋషి సంవాదం - 3

" మహర్షి!ఇంద్రద్యుమ్న మహారాజు ఏకాలం వాడు

ఏ దేశాన్ని పరిపాలించాడు. పురుషోత్తమ క్షేత్రానికి ఎలా వచ్చాడు. కొయ్యబొమ్మలు ఎలా చేసారో చెప్పండి?" అని మహర్షులు జైమినిని అడిగారు.

జైమిని మహర్షి ఈ విధంగా చెబుతున్నారు. ఇంద్ర ద్యుమ్నుడు కృతయుగానికి చెందిన వాడు.సూర్య వంశంలో జన్మించాడు. సత్యవాది, సదాచార పరాయణుడు, దానశీలి, సాత్వికుడు,న్యాయంగా రాజ్యాన్ని పరిపాలించేవాడు, ప్రజలను కన్నబిడ్డల వలె చూసు కొనేవాడు. అవంతి నగరాన్ని పాలింతచేవాడు.(1-14)

విష్ణుభక్తుడైన ఇంద్రద్యుమ్నుడు విద్వాంసుల తోను,తీర్థయాత్ర లు చేసినవారితోను,జ్యోతిష్కులతోను సమావేసంఏర్పాటుచేసి"ఈచర్మచక్షువులతోభగవంతుని దర్శించుకోగల క్షేత్రం ఏదైనా భూమండలం మీద ఉందా?" అని అడిగాడు.( 15- 19)

ఆ సభలో ఉన్న ఒక యోగి లేచి " రాజా! నేను అనేక తీర్థయాత్రలు చేసాను. ఓఢ్రదేశంలో నీలాచల పర్వతం ఉంది. ఆ పర్వత లోయలో కల్పవృక్షం ఉంది. ఆ చెట్టు నీడలో బ్రహ్మ హత్యాది దోషాలు పోగొట్టే శక్తి ఉంది. ఆ చెట్టుకి ఎడమవైపున " రోహిణము" అను ఒక కుండం ఉంది. ఆ సరస్సులో స్నానం చేస్తే ముక్తి లభిస్తుంది. దానికి తూర్పుదిక్కున స్వామి విగ్రహం ఉంది. రోహిణి కుండంలో స్నానం చేసి, స్వామిని అర్చించినట్లయిన అశ్వమేధ యాగం చేసిన ఫలితం కలుగుతుంది.అక్కడ శబర దీపకము అను ఆశ్రమం ఉంది. శబరుల ఇళ్లు ఉన్నాయి. అక్కడకు దగ్గరలో ఉన్న పురుషోత్తముని సేవించి, వ్రతాన్ని ఆచరించి, అక్కడే వనవాసం చేయాలి. ఆ స్వామిని సేవించడానికి దేవతలు వస్తూ ఉంటారు. దేవతల దగ్గర నుండి సుగంధం వ్యాపిస్తుంది.ఒక కాకి అక్కడ మరణించి, మోక్షాన్ని పొందింది.ఈ సన్నివేశాన్ని చూసి, నేను జ్ఞానాన్ని పొందాను. ఈ విషయాని విష్ణు భక్తుడవైన నీకు తెలియబరచడానికి వచ్చాను." అని చెప్పి, ఆ సన్యాసి అంతర్ధాన మయ్యాడు.20-41

" బ్రాహ్మణోత్త ములారా! ఆ పురుషోత్త ముని దర్శించుకొని మోక్షాన్ని పొందాలని అనుకుంటున్నాను

తగిన ఏర్పాట్లు చేయండి" అని ఇంద్రద్యుమ్నుడు సభ లొని బ్రాహ్మణులను కోరాడు. ( 42- 44)

“ రాజా! నీవు కోరినట్లుగా ఏర్పాటు చేస్తాను.నా తమ్ముడయిన” విద్యాపతి” పురుషోత్తమ క్షేత్రానికి వెళ్లి, స్వామి ఉన్నప్రదేశాన్ని చూసి, మన నివాసానికి తగిన ప్రదేశా చూసి వస్తాడు. అప్పుడు మనం బయలుదేరి వెడదాం” అని కులబ్రాహ్మణుడు విన్న వించాడు. రాజుఅంగీకరించి నాటి సభను ముగించాడు

విద్యాపతి తగిన ముహూర్తం చూసుకొని నీలా చల పర్వతానికి బయలుదేరాడు. “ నా జన్మ ధన్య మయింది. సర్వ పాప హారి అయిన జగన్నాధుని చూడ గలుగుతున్నాను. భవ బంధాలును పోగొట్టు చక్రపాణిని చూడగలుగుతున్నాను. వేద,పురాణాలు చూడలేనినారాయణుని చూడగలుగుతున్నాను.ఇంత వరకుచూడనిరూపంలోజగన్నాధునదర్శించుకుంటాను” అని ఆలోచిస్తూ విద్యాపతి రథంపై చాల దూరం ప్రయాణం చేసాడు. ( 45- 68)

సాయంసమయం అయింది. బ్రాహ్మణుడు రథం దిగి సంధ్యావిధులు నిర్వహించుకొన్నాడు. కొండలు, కోనలు దాటుకొని ఒంటిమామిడి ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ కొంతమంది వైష్ణవ భక్తులను చూసాడు. ( 69 – 75)

విద్యాపతి రదాంపతి రథాన్ని దిగివైష్ణవులకు సాష్టాంగ నమస్కారం చేసాడు. ఆయనకు సర్వత్రా విష్ణుమూర్తి కనబడుతున్నాడు. అచలాచల పర్వతం కనబడింది. స్వామి నివాసమైన అచలాచల పర్వత శిఖరం ఎక్కాడు.చుట్టూ పరిశీలించాడు. ఎక్కడా స్వామి జాడ కనబడలేదు. అక్కడే దర్భలపరుచుకొని పడుకున్నాడు. కొండ పక్క నుండి మాటలు విన బడుతున్నాయి. మాటలు వినబడుతున్న వైపు బయలు దేరి ప్రయాణ మయ్యాడు. ( 76 – 82 )

సబర దీపకము అను పల్లెను చూసాడు. ఆ పల్లె లో శబరులు నివసిస్తున్నారు.అక్కడేపురుషోత్తమ క్షేత్రం ఉంది. గదాధరుడైన పురుషోత్తముని చూసి, వినయంగా వంగి నమస్కరించాడు. విశ్వావసువు అను బోయవాడు పురుషోత్తముని అర్చించిబయటకు వస్తున్నాడు.విద్యాపతివిశ్వావసువునుసమీపించాడు. ( 83 – 88 )

“ ఓ బ్రాహ్మణుడా! ఈ అరణ్యంలోకి ఎలా వచ్చావు? నీవు బాగా అలసిపోయి ఉన్నావు. ఇక్కడ విశ్రాంతి తీసుకో” అని చెప్పి అర్ఘ్యపాద్యాలు ఏర్పాటు చేసాడు.రెండవ విష్ణువులాగ ఉన్నావు. నీకు ఏమి కావాలో చెప్పు ఇస్తాను” అని బోయవాడు ప్రార్ధించాడు

“ ఓ వైష్ణవోత్త మా! నేను వచ్చిన పని పూర్తి అయ్యే వరకు ఆహారం తీసుకోను. అవంతి పురంలో ఇంద్ర ద్యుమ్నుడుఅనుమహారాజుఉన్నారు. ఆయనకు ఈ క్షేత్ర మాహత్తు గూర్చి ఒకమహర్షిచెప్పగావినిచూచి రమ్మ నమని పంపించారు. స్వామి ఎక్కడ ఉన్నారో చూపించు. ఈ విషయం రాజుకి చెప్పేవరకు ఆహారం తీసుకోను” అని విద్యాపతి విశ్వాసువుకి చెప్పాడు. ( 89 – 99)

స్కాందపురాణంలోనివైష్ణవఖండంలోనిపురుషోత్తమ క్షేత్రమాహాత్మ్యంలో జైమిని- ఋషి సంవాదం అను ఏడవ అధ్యాయం సమాప్తం.

## 8 వ అధ్యాయం

## జైమిని ఋషి సంవాదం-3

" నాకు దురదృష్టం దాపురించింది. జనార్ధనుడు మాకు ప్రాణంతో సమానం . ఆయనగురించి చెప్పినట్లయిన అందరికి తెలిసిపోతుంది. చెప్పకపోయినచో ఈ బ్రాహ్మణుడు శపించవచ్చు.అయినా ఈ బ్రాహ్మణుడు నాకు అతిథి. ఆయన కోరికతీర్చడం నా ధర్మం" అని శబరుడు ఆలోచించి విధంగాచెప్పడంప్రారంభించాడు.

" బ్రాహ్మణోత్తమా! ఈ విషయం నేను ఇంతకు ముందు విన్నాను. ఇంద్రద్యుమ్నుడు కంటె నీవు చాల అదృష్టవంతుడవు. రాజు కన్నముందుగా నీవు స్వామిని దర్శించుకొను చున్నావు." అని చెప్పి శబరుడు బ్రాహ్మణుని చేయి పట్టుకొని తీసుకొని వెడుతున్నాడు. రెండు ముహూర్తముల కాలంలో రౌహిణము అను కుండం దగ్గరకు చేరుకున్నారు. " అక్కడ స్నానం చేసిన వారు వైకుంఠానికి చేరుకుంటా రు. దీనికి తూర్పు దిక్కున కల్పవృక్షం ఉంది. ఆ వృక్షం నీడలో నిలబడిన వారికి బ్రహ్మ హత్యాది దోషాలు పోతాయి. ఈ రెండింటికి నడుమ పొదరింటిలో జగన్నాధుడు ఉన్నాడు. ఆయనను చూసిన వెంటనే పాపాలు నశించి, సంసార బంధాలు పోతాయి. అని శబరుడు బ్రాహ్మణునికి చెప్పాడు. ( 1 – 19)

బ్రాహ్మణుడు ఆనందంతో ఆ సరస్సులో దిగి స్నానం చేసాడు. స్వామికి మనస్సులో నమస్కించి ఈ విధంగా స్తుతించాడు.

విద్యాపతి జగన్నాధుని స్తుతించుట--------

ప్రధాన పురుషాతీత సర్వ వ్యాపిన్పరాత్పరా
చరాచర పరిణామ పరమార్ధ నమో&స్తుతే
శృతి స్మృతి పురాణేతిహాస ప్రతి పాదితైః
కర్మభి స్త్వం సమారాధ్య ఏకేన జగత్పతే
త్వత్త ఏతజ్జగత్సర్వం సంపద్యతేవిభో
త్వదాధారమిదం దేవ త్వ యైవ పరిపాల్య తే
కల్పాంతే సంహృతం సర్వం త్వ త్కుక్షౌ సావకాశకమ్
సుఖం వసతి సర్వాత్మా న్నంతర్యామి న్నమోస్తుతే
నమస్తే దేవదేవాయ త్రయీ రూపాయ తే నమః
చంద్ర సూర్యాది రూపేణ జగద్భాసయతే సదా
సర్వతీర్థ మయీ గంగా యస్య పాదాబ్జ సంగమాత్
పునాతి సకలాంల్లోకాం స్త స్మై పావయతే నమః

హవీంషి మంత్ర పూతాని సమ్య గ్ద త్తాని వహ్నిషు

పరిణామ కృతే తుభ్యం జగజ్జీవయతే నమః

యదంశ ముపజీవంతి జగంత్యానంద రూపిణః

సర్వ కల్మష హీనాయ తస్మై బ్రహ్మాత్మ నే నమః

బహుపాదాక్షి శిర్షాస్య బాహవే సర్వ జిష్ణవే

సర్వ జీవ స్వరూపాయ నమస్తే సర్వ రూపిణే

నమస్తే కమలాకాంత నమస్తే కమలాసన

నమః కమలపత్రాక్ష త్రాహి మాం పురుషోత్తమ

అసార సంసార పరిభ్ర మేణ నిపీడ్య మానం రోగ శోకైః

మాముద్ధ రాస్మాద్భ వ దుఃఖ జాతాత్పాదాబ్జ యోస్తే

శరణం ప్రసన్నం. ( 20 – 33)


స్వామి నీవు అతీతుడవు, సర్వ వ్యాపకుడవు, నీవొక్కడివే ఆరాధింపదగిన వాడవు, విశ్వసృష్టి స్థితి లయలకు కారకుడవు, వేదమూర్తివి, లోకాలకు కాంతినిచ్చు వాడవు. నీ పాదాలనుండి పుట్టిన గంగ లోకాలను పావనం చేస్తోంది. హవిస్సులు సమ ర్పించబడుతున్నాయి.లోకాలకుఆనందాన్నిచ్చువాడా నీవే బ్రహ్మాత్మవు, నిర్మల స్వరూపుడవు, సమస్త రూపుడవు, లక్ష్మీదేవికి ఇష్టుడైన వాడవు, కమల నివాసుడవు, కమలాక్షుడవు, అటువంటి నీకు నమస్కాము. భవసాగరంనుండి రక్షించు. నీ పాదాలను ఆశ్రయించిన నన్ను రక్షించు" అని విద్యాపతి జగన్నాధుని ప్రార్ధించాడు. (33 - 46)

(ఇంకా వుంది)

## పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన తెలుగు తేజాలు




శ్రీ శ్రీభాష్యం విజయ సారధి ( సాహిత్య రంగం)



శ్రీ చింతల్ వెంకటరెడ్డి (వ్యవసాయం)



శ్రీ యడ్ల గోపాలరావు (కళలు)



శ్రీ దాళవాయి చలపతి-రావు (కళలు)

# కలుషహరం -మాఘం



## కొత్త రామానందం

చంద్రుడు 'మఖ' నక్షత్రంతో కూడుకున్న మాసం మాఘమాసం. మఘం అంటే యజ్ఞం. యజ్ఞ యాగాది క్రతువులకు ఈ మాఘమాసం శ్రేష్ఠమైన మాసంగా భావిస్తారు. యజ్ఞాలకు అధిపతి దైవం ఇంద్రుడు. ఆయనకు మఘవుడు అనే పేరు కూడా వుంది. ఇది శిశిర ఋతు మాసం. ఈ మాసంలో చెట్లు ఆకులు రాల్చే కాలం. వసంత ఋతువు ప్రారంభ లక్షణాలు తొలి సారిగా పొడసూపేది ఈ మాసం లోనే. దానికి నాందిగా వసంతపంచమి లేదా శ్రీ పంచమి వచ్చేది ఈ మాసంలోనే. అదే రోజు విద్యా ప్రధాత్రి అయిన సరస్వతీదేవి జయంతి కూడా. మాఘమాసం ముఖ్యంగా ఆరోగ్యప్రదమైన, ఆరోగ్య ప్రధానమైన మాసం. కార్తీక మాసంలో దీపానికి ప్రాముఖ్యతనిస్తే, మాఘ మాసంలో స్నానానికి ప్రాధాన్యమివ్వబడింది. ముఖ్యంగా మాఘమాసంలో వచ్చే ఆదివారాలు అత్యంత మహిమాన్వితమైనవి.

మాఘమాసలో సూర్యోదయానికి ముందు చాలా చోట్ల చెరువులు, నదులు, కాలువలవద్ద మాత్రమే కాక సముద్రాలలో కూడా మాఘస్నానం చేసే భక్తులు కనిపిస్తుంటారు. మాఘపురాణాన్ని ఈ మాసంలో నిత్య పారాయణ చేస్తుంటారు. ఈ మాఘమాసం ఎన్నో పర్వదినాలకు నెలవు. మాఘశుద్ధ పంచమిని శ్రీపంచమిగా (ది.30-1-2020), వసంత పంచమిగా పరిగణిస్తారు. రతీమన్మథులను పూజించే మహో-



త్సవంగా ఈ పంచమిని కొందరు పండితులు పరిగణిస్తారు.

దక్షిణాయణంలో నేలకొరిగినా దేవతా ప్రీతికరమైన ఉత్తరాయణం వరకు ప్రాణాలు నిలుపుకున్న భీష్ముడు, విష్ణుమూర్తికి పరమ ప్రీతికరమైన శుద్ధ ఏకాదశి నాడు నిర్యాణం చెందాడు. కురువంశ మూలకారకుడైన భీష్మాచార్యులకు పరమపదాన్ని కల్పించిన పవిత్రమైన రోజు ఈ మాసం లోనే.


విశ్వకర్మ దేవశిల్పి. దేవతలకు కావలసిన అస్త్ర శస్త్ర ఆయుధ వాహన విమానాదులు, భవనాలు, నగరాలు నిర్మించి ఇచ్చిన వాస్తు శిల్పి ప్రపంచ మానవాళికి నిత్యం ఉపయోగపడే సాంకేతిక విద్యకు గురువైన విశ్వకర్మ జయంతి (మాఘ శుద్ధ త్రయోదశి) ఈ మాసంలోనే వస్తుంది. మాఘమాఘి అనగా మాఘ శుద్ధ పూర్ణిమ. ఆ రోజున సింధూ నది స్నానం పరమ పవిత్రం అని సనాతన విశ్వాసం. గంగానదిలో కానీ, త్రివేణీ సంగమంలో కానీ ప్రవహించే నదులలో గానీ, సరస్సులలో గానీ స్నానమాచరిస్తే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు లభిస్తాయని శాస్త్ర వచనం. సతీదేవి జన్మదినం మాఘ పూర్ణిమ గానే పురాణాలు చెబుతున్నాయి.

విభూతి (అనగా ఐశ్వర్యం) ధరించే పరమ శివుడు లోకకల్యాణార్థం హాలాహల భక్షణం చేసిన లోకోపకార పర్వదినమైన మహాశివరాత్రి (మాఘ బహుళ

చతుర్దశి) కూడా ఈ మాసంలోనే వస్తుంది. ఇన్ని ప్రశస్తమైన దినాలున్న ఈ మాఘమాసం నిజంగా మాఘమే. పవిత్ర స్నానాలకూ, భగవత్ చింతనకూ నెలవైన విశిష్టమాసం మాఘం.

'సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ' మన సౌర కుటుంబంలోని నడిచే ప్రాణులకు, నడవలేని ప్రాణులకు సూర్యుడే ఆత్మ అని ఋగ్వేదం, యజుర్వేదం ఉపదేశిస్తున్నాయి. ప్రపంచంలో జీవకోటికి ప్రాణ శక్తి ప్రసాదించే ప్రభాకరుడు ప్రత్యక్ష దైవం. సకల దేవతల ఓజస్సును, శక్తి సామర్థ్యాన్ని, అంశను, అనుగ్రహాన్ని తనలో కలుపుకొని తనను ఆరాధించేవారిని తగురీతిలో తరింపజేసే ఆదిత్యుని ఆరాధించడం మన యొక్క సంస్కృతి.

సూర్యభగవానుడు చరాచర జగత్తుకు ఆత్మ అయినవాడు. సూర్యుడు లేనిదే జగస్థితి సక్రమంగా ఉండదు. యితడు సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మ. మానవాళిని ప్రతి నిత్యం పలకరించి, అందరి మనసులలోని అజ్ఞానపు చీకటిని తొలగించుకోమని చెపుతూ, తన వెలుగు కిరణాలతో స్పర్శతో అందరినీ పునీతుల్ని చేసే పరంధాముడు సూర్యభగవానుడు. ఆయన సర్వ కర్మలకు సాక్షి. జీవనదాత.ఆరోగ్యప్రదాత. అందుకే ఆయనను అందరూ ప్రత్యక్ష దైవం అని కూడా అంటారు. భారతీయులు ఉదయం, మధ్యాహ్నం, సాయం




వేళల్లో అర్ఘ్యం వదిలి ఆరాధిస్తారు. సంధ్యావందనం సూర్యారాధనను తెలియజేస్తుంది. సూర్యుని వేడి కిరణాలకు సాగరం, సరస్సులు, నదులు, తటాకాలు మొదలైన వాటిలో నీరు ఆవిరై మేఘాలవుతాయి. ఆ మేఘాలకు చల్లగాలి సోకగానే వర్షం కురుస్తుంది. ఈ వర్షం కారణంగానే అందరికీ భుజించేందుకు ఆహారం, తాగేందుకు నీరు లభిస్తాయి. సూర్యుడే లేకపోతే ఈ జగతిలో ఎవరికీ అన్నపానీయాలుండవు. అందుకే సూర్యుడిని సకల జీవులకు ప్రాణదాతగా చెప్తారు. 'సహస్ర గుణము త్రష్టు మాదత్తేహి రసం రవి:' - సూర్యుడు భూమి నుంచి గ్రహించిన నీటిని వెయ్యిరెట్లుగా చేసి భూమిపై వర్షం కురిపిస్తాడు. ప్రజలకు సుఖశాంతులు ప్రసాదిస్తాడు.

ఆయన గతి తప్పని నిరంతర గమనశీలి. సమయపాలనకు చక్కని నిర్వచనంగా చెప్పదగినవాడు సూర్యభగవానుడు. సూర్య అనే పదానికి ప్రేరేపించేది అని అర్థం. చరాచర జగత్తంతా ప్రేరణ పొందేది తమ తమ కర్తవ్యాలను నిరాటంకంగా నిర్వహించే శక్తిని గ్రహించేదీ సూర్యుడి ఉనికి ప్రత్యక్షంగా ఉన్నప్పుడే. అందుకే సూర్యుడిని కర్మసాక్షి అని పిలుస్తారు. ఇతని జన్మతిథి మాఘ శుక్ల సప్తమి. ఈ రోజు ఆకాశంలో నక్షత్రాలు రథాకారం దాల్చుతాయి. కాబట్టి దీనికి రథ సప్తమి అని పేరు వచ్చిందని ఋగ్వేదంలోని మహాశౌరం చెబుతుంది. సూర్యుడు జన్మించడమే కాకుండా భూమికి మొట్టమొదటి సారిగా దర్శనమిచ్చి రథాన్ని అధిరోహించాడని పురాణాలు చెబుతున్నాయి. ప్రాణకోటికి చలి తొలగించి, నూతన ఉత్తేజాన్ని నింపే సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలిపే పండుగ రథ సప్తమి.

కర్మసాక్షి అయిన సూర్యుడి జన్మ వృత్తాంతం భవిష్య పురాణంలో ఉంది. దక్ష ప్రజాపతి కుమార్తె అయిన అదితికి, కశ్యప మహర్షికీ మాఘ శుద్ధ సప్తమినాడు జన్మించాడు సూర్యుడు. పుడుతూనే సహస్రకిరణాలతో వచ్చాడట. ఆయన అధిరోహించిన రథంలో పద్మంలో కూర్చుని ప్రయాణి-

స్తాడట. ఋతువులు మారడానికి సూర్యభ్రమణమే కారణం. సూర్యుని రథం బంగారు రథం. దానికి ఒకటే చక్రం. ఆ చక్రానికి ఆరు ఆకులు. ఆకులు ఆరు ఋతువులు, ఏడు గుఱ్ఱాలు ఏడు కిరణాలు, గరుత్మంతుని సోదరుడైన అనూరునిచే నడపబడుచున్నది. సూర్యునికి చిత్ర రథుడనే పేరుంది. ఆయన రథం శీఘ్ర గమనం కలది. ఆ అశ్వములు సప్త ఛందస్సులు, సప్త స్వరములు, ఏడు రంగుల సమాహారం. ఆయన పయనించేది సప్తద్వీప, సప్త సముద్ర పర్యంతం. కాబట్టే సూర్యుణ్ణి సప్తలోక ప్రదీపుడిగా వేదాలు స్తుతిస్తున్నాయి. ఏడు కిరణాలు కాదు, అనంత కిరణాలు ప్రసారమవుతున్నాయి. మన మాంస నేత్రాలకు కనపడేవి మాత్రమే ఏడు. అతినీల లోహితాది కిరణాలు అద్భుదాల కొద్దీ లెక్కించడానికి వీలుకాకుండా ఉంటాయి.

దూరంగా ఉంటే నక్షత్రం, సమీపంలో ఉంటే సూర్యుడు అని అర్థం. కోట్లకొలది మానవులలో ప్రతివాడికి ఒక సొంత పేరున్నట్టు, కోట్లాది సూర్యులలో మన సూర్యునికి 'వివస్వాన్' అని పేరు. అందుకే గీతలో భగవానుడు 'ఇమం వివస్వతే యోగం ప్రోక్త సహ మవ్యయం' అని సూర్యునికి మొదట ఈ యోగాన్ని చెప్పాను అని అనకుండా వివస్వంతునికి చెప్పాను అని అన్నాడు. ఆ 'వివస్వత్' తత్త్వం లోంచి 'వైవస్వత'




అనే తత్త్వం ఆవిర్భవించింది. లోక నిర్వాహణ ప్రభావాల్లో అది ఒకటి. మానవ శరీర రూప నిర్మాణానికి ఆ వైవస్వత-మనుతత్త్వమే మూలం. కనుక ప్రస్తుత మన్వంతరాన్ని వైవస్వత మన్వంతరమంటారు. రథ సప్తమి నాడే మన్వంతర ప్రారంభరావిర్భావ దినం కూడా. ఈ వైవస్వత మను తత్త్వావిర్భావం ఇప్పటికి సుమారుగా 12 కోట్ల సంవత్సరాలకు పూర్వం జరిగింది. రథం అంటే మన కంటికి కనబడే సూర్యగోళమే.

'ఆరోగ్యం భాస్కరాధిచ్ఛేత్' అని మనుస్మృతి చెప్తోంది. జాతకంలో సూర్యగ్రహ దోషం, ఉదర నేత్ర, దంత, ఉష్ణ, శరీర దోషాలు, రక్తశుద్ధి లోపించుట, రక్తపోటు మొదలైన వాటి నివారణకు ఎర్రని కెంపు, మాణిక్యము, ఎర్రని కమలములతో సూర్యారాధన చేసి, మేలిమి బంగారు దానం, సూర్య విగ్రహం తయారు చేసి పూజించి, ఆవు నెయ్యితో తడిపి, మహా సౌర మంత్ర హోమం చేస్తే రాజయోగం, రాజకీయాలలో ఓటమి, పదవీచ్యుతి, కీర్తిహాని దుష్ఫలితాలను రథసప్తమి వ్రతం తప్పక నివారిస్తుంది. సూర్యుడి లేత ఎండ కిరణాలు శరీరాన్ని తాకితే తేజస్సు పెరుగుతుందని ఆయుర్వేదం చెపుతుంది. అందుకోసమే ప్రతిరోజూ ఆదిత్య హృదయం చదవటం, సంధ్యావందనం ఆచరించడం, సూర్యనమస్కారాలు చేయడం, అర్ఘ్య ప్రదానం ఇవ్వడం లాంటివి సూర్యుడి ఎదురుగా నిలబడి చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఏదో మిషతో నీరెండలో నిలబడటం ఆరోగ్యప్రదమంటున్న విజ్ఞాన శాస్త్రం ఈ విషయాన్ని బలపరుస్తుంది. విదేశీయులు సైతం సూర్య స్నానం పేరుతో నీరెండలో నిలబడటం ఆంతర్యం ఇదే.

సూర్య నమస్కారములు

సూర్యోదయ సమయంలోనూ, సూర్యాస్తమయ సమయంలోనూ చేయటం మంచిది. సూర్యుని వైపు ముఖం ఉంచి నిలబడి సూర్యనమస్కారాలు చేయటం వల్ల మనసుకు, శరీరానికి లాభం ఉంటుంది. సూర్యనమస్కారం అలవాటు జీవితానికి ఒక క్రమ-శిక్షణ నేర్పుతుంది. ఉదయం సూర్యోదయ సమయానికి నిద్ర లేస్తారు. సూర్యనమస్కారాలు చేయటం వల్ల మెదడు పనితీరు మెరుగవటం, ఊపిరితిత్తు-లు సాగే గుణం ద్వారా రక్త శుద్ధి బాగుంటుంది. గుండె పనితీరు మెరుగవుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే చేసే ఈ నమస్కా-రం మనకు ప్రశాంతతనిస్తుంది. తద్వారా కోపతాపాలు తగ్గిపోతా-యి. రక్తపోటుకు గురికానివ్వ-దు. మనసులో స్థిరత్వం పెరు-గుతుంది. మనసు మీద ఒత్తిడి తగ్గిస్తుంది. రోజూ పావుగంట సేపు సూర్యనమస్కారాలకు కేటాయించ గలిగిన వారి శారీరక మానసిక ఆరోగ్యాలు రెండూ లభిస్తాయి. మానవ శరీరంలో ప్రధాన నాడులలో ఒకటైన సూ-ర్యనాడి - విజ్ఞాన శాస్త్ర పరంగా సూర్యునికీ నాడీశాస్త్రానికీ గల సంబంధం తెలుపుతుంది.

సూర్యుని ఆరాధించినవారికి తక్షణం రోగాలు నశించి ఆరోగ్యం కలుగుతుంది. 'వ్యాధి వినాశాయ క్షిప్రం భాస్కరాయ నమో నమః'. అందుకే నమస్కార ప్రియుడైన భానునికి నమస్కారములు చేసి




ఎందరో ఆరోగ్యవంతులయ్యారు. మయూరుడనే మహాకవి తనకు వచ్చిన కుష్ఠు రోగాన్ని మాన్పు-కోవడానికి సూర్యుని స్తుతిస్తూ సూర్య శతకం రచించి దినకరుని కృపతో స్వస్థత చెందాడు. సూర్యు-నికి గల 12 నామాలను ఉదయం స్నానానంతరం పఠించి నమస్క-రించడం ద్వారా సకల శుభాలు లభిస్తాయి.

సూర్యుడు ఉదయం బ్రహ్మ స్వరూపుడు, మధ్యాహ్నం శివస్వ-రూపుడు, సాయంకాలం విష్ణు స్వరూపుడు. అలాగే ఆయన ఉదయం ఋగ్వేద స్వరూపుడు, మధ్యాహ్నం యజుర్వేద స్వరూపు-డు, సాయంకాలం సామవేద స్వ-రూపుడు కనుక సూర్యుడు 'త్రివేద మయుడు' అని పురాణాలు వర్ణించాయి. గాయత్రీ మంత్రాధి-దేవత సూర్యుడు, గాయత్రీ మం-త్రంతోనే సూర్యునికి అర్ఘ్యమిచ్చి కొలుస్తారు.

రథసప్తమి నాడు ఆచరించవల-సినవి:

- ఏడు జిల్లేడు ఆకులలో రేగు పళ్ళు పెట్టి, తలమీద భుజాల-మీద పెట్టుకుని స్నానం చేయాలి. అలా చేస్తే ఉత్తమగతులు లభి-స్తాయి.
- ప్రమిదలో దీపం వెలిగించి నదిలో కాని, చెరువులో కాని వి-డిచిపెట్టాలి.
-ఇంటిముందు రథం ముగ్గు

వేయాలి.

-పిడకలపై కొత్త బియ్యంతో పాయసం చేసి నైవేద్యం పెట్టాలి. చిక్కుడు కాయలను వెదురు పుల్లలతో చతురస్రం అయ్యేటట్టుగా గుచ్చి, దాని మధ్య చిక్కుడు ఆకు పరచి, ఆ ఆకులో పొంగలి పెట్టి సూర్యుడికి నివేదన చేయాలి. దానధర్మాలు చేయాలి.

- ఆరోజున స్వామికి నివేదించిన ప్రసాదాన్ని మాత్రమే భుజించి రాత్రి జాగారం చేయాలి.

-మర్నాడు స్నానమాచరించి సూర్యునికి అర్ఘ్యమివ్వాలి.

సూర్యుని భక్తితో ఆరాధించి ఆయన అనుగ్రహం పొందినవారు:

1) దూర్వాసముని ఆశీస్సులతో సూర్యుని ప్రార్థించి కుంతీదేవి కర్ణునికి జన్మనిచ్చింది.

2) సత్రాజిత్తు సూర్యునారాధించి ఆయన దయతో శమంతకమణిని పొంది సంపన్నుడయ్యాడు.

3) యాజ్ఞవల్క్యునకు, ఆంజనేయస్వామికి విద్యలను ప్రసాదించిన గురువు సూర్యుడు.

4) రామాయణ కాలంలో శ్రీరాముడు సూర్యుని ఆదిత్యహృదయంతో స్తుతించి లంకేశ్వరుడు అయిన రావణుని సంహరించాడు.

5) ధర్మరాజు అరణ్యవాస సమయాన సూర్యభగవానుని స్తుతించి అక్షయపాత్రను పొందాడు. ఆహారాన్ని లోటులేకుండా అందరకూ వితరణ చేసేవాడు.



6) పురుషోత్తమ చక్రవర్తి సూర్యభగవానుని ఆశీస్సులతో ప్రపంచ విజేత అయిన అలెగ్జాండర్ ను ఓడించాడు.

7) ప్రస్కన్వుడనే మహర్షి, భద్రేశ్వరుడనే రాజు సూర్యుని ఆరాధించి తమ రోగాలనుంచి విముక్తులయ్యారు.

8) గుప్తులు, శాలలకాయనులు, చాళుక్యులు సూర్యార్చన చేసి తరించారు.

9) కృష్ణుని కుమారుడు సాంబునికి కుష్ఠురోగం వస్తే సూర్యుని ఆరాధించాడు. ఆరోగ్యవంతుడయ్యాడు.

మన పాపపుణ్యాలకు ప్రత్యక్షకర్మసాక్షి సూర్యనారాయణమూర్తే. ఆయన కృప పొందేందుకు ప్రథమంగా పుణ్యకార్యాలు చేయాలి. పాపకర్మల్ని పూర్తిగా విడనాడాలి. రోజూ కొన్ని నిముషాలైనా చేతులు జోడించి ప్రభాత వేళలో బాలభానుని రూపంలో దర్శించి హృదయపూర్వకంగా భక్తి ప్రపత్తులతో ద్వాదశ నామాలు లేదా ఆదిత్యహృదయంతో స్తుతించి జపిస్తే ఆరోగ్యం లభిస్తుంది అంటారు విజ్ఞులు.

ఏ దేశమైనా సూర్యారాధనకీ, ప్రకృతి తత్వాన్ని పూజించడానికీ సంక్రాంతిని జరుపుకుంటారు. ప్రకృతిలో లభించే సంపదనీ, విజ్ఞానాన్నీ వినియోగించుకుంటూ మన జీవితాన్ని చక్కదిద్దుకోవడమే పండుగల పరమార్థం. రథసప్తమి ఆదివారం నాడు వచ్చినా లేదా షష్టితో కూడిన సప్తమి (తిథిద్వయం) కలిసిరావడం వల్ల రథసప్తమి అత్యంత శ్రేష్ఠమయినది. ఆరోజున చేసే స్నానాలు, వ్రతాలు, సూర్యుడుకి చేసే పూజలు, చేసే దానాలు అర్చనాదులు అధిక ఫలాన్నిస్తాయి.

శ్రీ సూర్యభగవానుని ఆలయాలు చాలా ముఖ్యమైనవి ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలో కోణార్క దేవాలయం, తమిళనాడులో సూర్యనార్ కోవెల, ఆంధ్రప్రదేశ్ లో అరసవల్లి దేవాలయాలు ప్రాచీనమైనవి. అశేష భక్తులు

నిత్యం ఈ ఆలయాలని దర్శించి స్వామి అనుగ్రహం పొందుతారు.

ఇవికాక ఆంధ్రప్రదేశ్ లో వేదనారాయణ ఆలయం చిత్తూరు జిల్లా నాగులాపురం గ్రామంలో) వేదనారాయణుడైన సూర్యకిరణాలు ప్రతి ఏటా మార్చి 25,26,27 తేదీలలో సంధ్యా సమయంలో స్వామివారిపై పడతాయి. కృష్ణా జిల్లాలో సాగరతీరాన ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మర్నాటి నుంచి వరుసగా 21 రోజులపాటు సూర్యకిరణాలు మహాశివుని ఫాలభాగంపై ప్రసరించడం ఒక ప్రత్యేకత. కృష్ణానది పరివాహక పవిత్ర స్థలం, గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులిపర్రులో నిర్మితమైన నరేంద్రస్వామి శివాలయం దానికి ఎదురుగా వరదరాజస్వామి ఆలయాలు ఉన్నాయి. సంక్రాంతినాడు సూర్యోదయ కిరణాలు నరేంద్రస్వామి ఫాలభాగాన, సూర్యాస్తమయ కాంతులు వరదరాజస్వామి పాదాల వద్ద ప్రతిఫలిస్తాయి. పెదగంజాం భావనారాయణ స్వామి దేవాలయంలో ఏటా మార్చి 6 నుంచి 16 లోపు, అక్టోబరు మొదటివారంలో భావన్నారాయణునిపై సూర్యకిరణాలు ప్రసరించే దృశ్యం అద్భుతంగా ఉంటుంది. అదేవిధంగా చిత్తూరు జిల్లా ఉంగనూరు శ్రీ మాణిక్య వరదరాజస్వామి ఆలయంలో రథసప్తమి రోజున సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు రాజగోపురం నుంచి ప్రసరించి స్వామివారి పాదాలపై పడతాయి.




"ఓం నమో భగవతే సూర్యాయ"

**అరసవల్లి దేవాలయ ప్రాశస్త్యం:**

ఇచ్చట ఆలయంలోని భాస్కరుణ్ణి పూజించినవారు అన్ని కష్టాలు తొలగి హర్షంతో వెళతారు కాబట్టి ఒకప్పుడు ఈ ఊరిని హర్షవల్లి అనేవారని, కాలక్రమేణా హర్షవల్లి అరసవల్లిగా మారిందనీ ప్రతీతి. ఈ ఆలయాన్ని దేవేంద్రుడు నిర్మించి, అందులో సూర్యదేవుని ప్రతిష్ఠించారని స్థలపురాణం చెబుతోంది. 16 వ శతాబ్దంలో షేక్ మహమ్మద్ ఖాన్ ఆలయాన్ని ధ్వంసం చేయబోగా, ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఉద్యోగి సీతారామస్వామి ఎవరికీ తెలియకుండా మూలవిరాట్ ని బావిలో పడేశారట. క్రీ.శ. 1778 లో బావిలోని మూలవిరాట్ ను కనుగొని, బయటకు తీసి, ఆలయాన్ని పునర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఇచ్చటి ఆలయ విమాన గోపురాన్ని ఓఢ్ర (ఒడిశా) సాంప్రదాయంలో నిర్మించారు.

ఆలయంలో ఉషా, పద్మిని, ఛాయాదేవి సమేతంగా సూర్యనారాయణస్వామి తన అభయముద్రతో భక్తులకు అభయమిస్తుంటే సనకసనందులు ఛత్రచామరాలతో సేవ చేస్తూంటారు. వేలాది భక్తులు రోజూ స్వామిని దర్శనం చేసుకుంటూ ఉంటారు. ఉత్తరాయణ, దక్షిణాయణ మార్పుల్లో ఏటా మార్చి 9 నుంచి 12 తారీకులలో, అక్టోబరు నెల ఒకటి నుంచి నాల్గవ తారీకులలో స్వామివారి ధ్రువమూర్తిపై ఆదిత్యుని తొలికిరణాలు ప్రసరించే దృశ్యం చూడడానికి భారీగా భక్తులు తరలివస్తారు. అరసవల్లి క్షేత్రాన్ని ఆరోగ్యక్షేత్రంగా పిలుస్తారు. స్థానికులు ప్రత్యేకించి కంటివ్యాధులు, బొల్లి, కుష్టు వ్యాధులతో పాటు ఇతర మానసిక శారీరక రోగాలనుండి విముక్తి కోసం బాధిత భక్తులు ఇక్కడకొచ్చి స్వామివారిని కొలుస్తారు.

ఈ పుణ్యక్షేత్రం శ్రీకాకుళం పట్టణానికి ఆనుకొని ఉన్నది. ఇచ్చటి నుంచి నేరుగా శ్రీకూర్మం కూడా వెళ్ళవచ్చును.

ది. 1-2-2020 న రథసప్తమి.

# చెప్పడమే నా ధర్మం

## భువనచంద్ర



'చలి' మహారాజు అవసాన దశలో వున్నారు. రాజవైద్యులందరూ పెదవి విరిచారు. బంధువులందరూ విషణ్ణవదనాలతో నిద్రాహారాలు మానేసి దేవుడ్ని ప్రార్థిస్తున్నారు.

మరోపక్క 'సింహ'గారి మంత్రులూ సలహాదారులూ గుమిగూడి సింహగారికి సలహాలిస్తున్నారు. కొందరు రాజ్యాంగ నిపుణులతోనూ సంప్రదిస్తున్నారు.

'సింహాని మనం ఇప్పుడు ఎదుర్కోలేము. నిన్నటి వరకూ సైలెంట్ గా వున్నా, ఇప్పుడు విజృంభిస్తాడు. అతడ్ని ఓడించి మనం రాజ్యం చేస్తున్నామని పీకల్దాకా కోపం వుంది. అంతేకాక ఇప్పుడు అతని బలగం పెరిగింది. ఇబ్బడి ముబ్బడిగా ధనమూ పెంచుకున్నాడు. రాజ్యపరిస్థితి డోలాయమానంగా ఉంది' 'కరి' మహారాజుగారి తండ్రి 'హస్తి'నాయకులవారికి వివరించాడు మంత్రి కమ్ రక్షణ శాఖాధ్యక్షుడూ అయిన గజానన్.

'గజేంద్రుని పిలిపించండి' నిట్టూర్చి అన్నాడు హస్తినాయకులవారు. ఆయన వయోవృద్ధుడు. కరి ఆయన కొడుకే.

"బాబుగారికి ఇవేం పట్టవు. యువరాజావారిది అతి తీవ్ర స్వభావం. అతి వృష్టి-అనావృష్టి టైపు. ఆయన్ని అదుపు చెయ్యాలంటే ముందు వివాహం చెయ్యాలి. అయినా యీ పరిస్థితుల్లో......."ఆగాడు గజానన్.

"పిలిపించండి. అలాగే పిల్లని కూడా వెతకండి. మహారాజు ఉండగానే కల్యాణం చెయ్యడం మంచిది" గంభీరంగా అన్నారు హస్తినాయకులు.

******

యువరాజు స్వదేశానికి వచ్చారు. విదేశీయుల శిక్షణలో వారు అనేక విషయాల్లో ఆరితేరారు.

"ఇంతమంది దేవుళ్ళెందుకూ? ఇన్ని దేవాలయాలూ, ఇన్ని వేలమంది పూజార్లూ, ఇన్నిన్ని ప్రసాదాలూ పాలూ పెరుగూ నెయ్యీ తేనే వ్యర్థం కావడాలూ, అసలీ వ్యవహారం ఎందుకూ? ఎందుకు సాగనివ్వాలీ" వస్తూనే చికాగ్గా అన్నారు.

"అదికాదు యువరాజా... మీరు చదువు నేర్చిన దేశం పరిస్థితులూ పద్ధతులూ వేరు. ఇక్కడి పరిస్థితి వేరు. ఇక్కడివాళ్ళు నమ్మేది దైవాన్నీ, ధర్మాన్నీ. అక్కడివాళ్ల లాగా డబ్బునీ అధికారాన్నీ కాదు. ఘనత వహించిన మీ వంశీయులందరూ..." యువరాజు పెట్టిన చికాకు మొహాన్ని చూసి మధ్యలోనే ఆపేశాడు గజానన్.

"నాన్సెన్స్. అందుకే మనం ఇలా వున్నాం. ముందు నాకు పట్టాభిషేకం కానివ్వండి. దేశాన్ని ఎలా మారుస్తానో మీరే చూద్దురుగాని.! అన్నట్టు నేను ఆల్ రెడీ పెళ్లి చేసుకునే వచ్చాను. నాకూ మా ఆవిడకీ తగిన భవనాన్ని చూడండి" కటువుగా అన్నాడు యువరాజు గజేంద్ర.

"తమరి తండ్రిగారు ఆల్ రెడీ ఓ మహా భవనాన్ని మీకోసం సిద్ధం చేసివుంచారు. తమరు దాన్ని చూసి...." మధ్యలోనే ఆపాడు గజానన్.

"సాయంత్రానికల్లా మార్పులూ చేర్పులూ చెబుతాం. అర్జంటుగా మాకు తగినట్టు మార్పించండి" కొత్త భవనాన్ని చూడ్డానికి శ్రీమతితో కలిసి వెంటనే బయల్దేరాడు గజేంద్ర.

"ఇదేమి దూకుడ్రా బాబూ.... మంచం మీద వున్న తండ్రినీ, బకెట్ సిద్ధంగా పెట్టుకున్న ముసలి తాతనీ కూడా పలకరించకుండా బయల్దేరాడు. ఖర్మ..ఖర్మ.." తలపట్టుకున్నాడు గజానన్.

'కరిమహారాజు' కొంచెం

కోలుకున్నారు. కానీ, కుమారరత్నం గారి మెంటాలిటీ ఆయనకీ అసలు అర్థం కావడంలేదు.

"నువ్వేం ఖంగారు పడకు కరీ, చిన్నప్పుడు నువ్వూ అంతే... మహా దూకుడు" నవ్వారు హస్తి-నాయకులు.

దండకారణ్యం మహా సందడిగా వుంది. ఏమైనా సరే గెలవాలనే పట్టుదలతో వున్నారు కరిమహారాజు. ఓడించి తీరాలన్న ఉబలాటంలో వున్నారు సింహాగారు. నెలరోజుల్లో ఎన్నికలనగా సడెన్ గా బాత్రూమ్ లో జారిపడి హరీ అన్నారు కరిమహారాజు.

"అస్సలు వర్రీ కావద్దు. సానుభూతి ఓట్లు 'చిరపుంజి'లో వర్షంలా మనకే పడతాయి." ధీమాగా అన్నారు గజేంద్రులవారు.

"రాజు పోగానే యువరాజుకేగా పట్టాభిషేకం జరగాలీ? ఇదేం వింత... యీ ఎన్నికలేమిటీ ఓట్లేమిటీ?" విచిత్రంగా మొహంపెట్టి అన్నారు యువరాణీవారు.

"ఇక్కడి కథ వేరులే. ఎవరు గెలిస్తే వారే రాజులు... వారి పుత్రులూ పుత్రికలూ యువరాజు/యువరాణీలు. ఒక్కసారి గెలిస్తే తరతరాలూ రాజవంశీయులు గానే మిగుల్తాం" సందేహం తీర్చాడు యువరాజు.

******

ఏనుగులకీ సింహాలకీ మధ్యలో నక్కలూ జింకలూ కుందేళ్ళు కూడా దూరి జాతి కుల వర్గాలు సృష్టించి అడవిస్వామ్యాన్ని అవహేళన చేశాయి. చీలికలు తెచ్చి పాలకులకి మూడు చెరువుల నీరు తాగించాయి.

'సింహా' గారు చిత్రమైనవారు. వారెప్పుడూ నవ్వరు. నవ్వించరు. ఏడ్పించను కూడా ఏడ్పించరు. జనాల్ని ప్రేరేపిస్తారు. కావాలంటే 'జూలు' విదిలిస్తానని హడలగొడతారు.

నక్కజిత్తులవల్లా, కుందేళ్ళ బలగం వల్లా, తోడేలు రాజకీయాలవల్లా 'సింహా'గారు అత్తెసరు ఓట్లతో సింహాసనాన్ని దక్కించుకున్నారు.

ఇక సింహాగారి బలగం విజృంభించింది. 'కావల్సినంత మెక్కు-మిగిలింది జేబులో కుక్కు. మళ్ళీ వస్తుందో రాదో లక్కు' అని వీరవిహారం చేశారు.

"అయ్యా యువరాజావారూ, ఆనాడే నామాట వినుంటే మీరు మాజీలయ్యేవారు కారుగదా!" విరక్తిగా అన్నారు గజానన్ గారు గజేంద్రతో.

ముందు మహాగురువుల్ని పిలిపించి సకల మర్యాదలూ చేయించండి. ఓడిపోవడం తప్పుకాదు. గెలవడానికి ఏంచెయ్యాలో నాకు తెలుసు అడవి మూలమూలలా తిరుగుతా. సింహాగాడ్ని గద్దె దింపుతా" ప్రతిజ్ఞ చేశారు గజేంద్ర.

గజేంద్రులవారి పథకం పారింది అనేదాని కంటే, సింహాగారి పంజాలో పట్టు సడలింది అనడం సత్యాతిసత్యం. సింహా చిత్తుగా ఓడి గజేంద్రుడికి తలవంచారు.

******

మహాగురువులు మాన్యులయ్యారు.... అదీ పాలు పొంగినంతసేపే. ఎన్నికల వేడి చల్లారగానే గురువులకి ఉద్వాసన చెప్పారు గజేంద్ర.

"అదేం?" అన్న గజానన్ తో, "మీరెక్కడి మంత్రులండీ, విఘ్నేశ్వరపూజ, అదే, వినాయక చవితి పూజ కాగానే విఘ్నేశ్వరుడికి స్వస్తి వాచకం పలికి సాగనంపమూ? ఇదీ అంతే, మీరు కూడా ఇక విశ్రాంతి తీసుకోండి. వయసు మళ్ళిందిగా" అన్నారు మహారాజు పదవి కెగబాకిన గజేంద్ర.

సరికొత్త ఉత్తర్వులు మొదలయ్యాయి. రోజుకో మహావృక్షం కూలుతోంది. మహా వృద్ధ మాజీ మహారాజు హస్తినాయకులవారు గజేంద్రగారిని పిలిపించారు.

"నాయనా, నీ బలాన్ని చూపించడం కోసం నీ బలిష్టమైన తొండంతో రోజుకో వ్యవస్థని వృక్షాల్లా కూల్చేస్తే ఎలా? అడవి ఎడారిగా మారిపోతుంది. అడవే ఎడారిగా మారితే నీ పరిస్థితి ఏమిటో ఆలోచించావా? నీ బలాన్ని ఆల్ రెడీ నిరూపించుకున్నావు. నువ్విప్పుడు చెయ్యాల్సింది నీ రాజ్యాన్ని బలోపేతం చెయ్యడమే గానీ, బలప్రదర్శన కాదు. చెప్పడమే నా ధర్మం. వినకపోతే నీ ఖర్మం" అని నిట్టూర్చారు.

ఇహ ఘనత వహించిన దండకారణ్యం, దండకారణ్యంగా మిగిలివుంటుందా లేక 'దండగారణ్యం' గా మారుతుందా ఇది నిర్ణయించేది కాలమే.

మళ్ళీ కలుద్దాం,

నమస్సులతో

భువనచంద్ర

# శ్రీసూక్తం

## పాలకుర్తి రామమూర్తి

శ్రీ సూక్తం అనేది ఒక్క హైందవ మతానికి సంబంధించిన పూజా పద్ధతులలో పఠించే మంత్ర పాఠంగా మాత్రమే చూస్తే, అది అంతవరకే పరిమితమౌతుంది. కాని దాని అంతర్యాన్ని తరచి చూస్తే... వ్యక్తి సమష్టిగా మారేందుకు కావలసిన పరిణామక్రమానికి సంబంధించిన విధానం కనిపిస్తుంది. అక్షరాలకే పరిమితమైతే మన ఎదుగుదల అక్షరం కాలేదు. ఎప్పుడైతే అక్షరాల అంతరంగాన్ని చదవగలుగుతామో జీవిత సాఫల్యానికి అవసరమైన సత్యాన్ని అర్థంచేసుకోగలుగుతాము. అందుకే చదవడం పైపై అక్షరాలను కాదు, Between the lines, under the lines, above the lines and below the lines చదవాలి అని అంటారు. It is not the letter of the law but the spirit the law is important.

నిజానికి శ్రీ సూక్తమనేది It is a process of learning AWARENESS అంటే ఆత్మతత్త్వ పరిమితులను పూర్తిగా అర్థం చేసుకునేందుకు ఉపకరించేది శ్రీ సూక్తం. It helps in the journey towards personnel excellence.వ్యక్తిత్వ పరిమితులను అభిగమించే ప్రయాణంలో సహాయపడేది. It is a catalyst in the process of achieving super consciousness. అనంత చైతన్యస్థాయిని పొందే విధానంలో ఉత్ప్రేరకంగా పనిచేసేది. That means... to connect with people at heart, mind, thought and sprit level. యావత్తు ప్రజానీకాన్ని (సృష్టిని) మనస్సు, హృదయం,




ఆలోచన, ఆత్మ స్థాయిలలో ఒకటిగా చేసేది.

దానిని సాధించాలన్నా, అర్థం చేసుకోవాలన్నా, మనలో సహజ ప్రకృతి సహజ జ్ఞానంగా, సహజ జ్ఞానం తెలివిగా, తెలివి యెఱుకగా పరివర్తన చెందాలి. అలా పరివర్తన చెందాలి అంటే పఠించే శ్రీ సూక్తంపై ధ్యానం చేయాల్సి ఉంటుంది. ఆ ధ్యానమే మెడిటేషన్ అంటాము లేదా యోగ నిద్రగా కూడా చెప్పుకుంటాము. దాని వల్ల సాధకునిలో క్రమంగా AWAKE-NESS జాగృతిపొందడం, ALERTNESSపూర్తి సన్నద్ధతను కలిగియుండడం, AWARE-NESS, పరిపూర్ణమైన అత్యున్నత చైతన్యస్థితిని కలిగియుండడం జరుగుతుంది. అదే విముక్త స్థితి లేదా మోక్షం.

ఈ పరిణామ క్రమం భౌతిక జీవితంలో ఉపయుక్తమౌతుంది, ఆధ్యాత్మిక ప్రయాణంలో సహకరిస్తుంది.

ఋగ్వేదాథర్వణ వేదాలలో చెప్పబడిన ఈ సూక్తం అగ్నిని ప్రార్థించడంతో ఆరంభమవుతుంది కనుక, దీనికి అగ్ని శ్రీ సూక్తం అనే మరొక పేరు ఉన్నది. ఫలశ్రుతితో కలిపి 16 మంత్రాలు ఉన్న ఈ శ్రీసూక్తం పంచదశిగా, షోడశిగా కూడా చెప్పబడింది.

శ్రీ అంటే.. ఐశ్వర్యము, శోభ, ఉపకరణము, సరస్వతి, బుద్ధి, వృద్ధి, సంపద, కీర్తి, లక్ష్మి,



విషము, (శబ్ద రత్నాకరం)

సూక్తి అంటే మంచి మాట.. (సు ఉక్తి) శ్రీ సూక్తము అంటే అత్యున్నత మైన లక్ష్యాన్ని చేరేందుకు ఉపకరణంగా పనిచేసే మంచి మాట... అని చెప్పుకోవాలి.

అణిమాది అష్ట సిద్ధులను పొందడం ఐశ్వర్యముగా చెప్పుకుం టాము. అదే మానవ జీవన గమనంలో సమున్నత లక్ష్యం. ఆ ఐశ్వర్య సాధనయే జీవితానికి నిజమైన శోభ నిస్తుంది... ఆ లక్ష్య సాధనా ప్రయత్నంలో అవసరమయ్యే ఉపకరణము సరస్వతి అంటే విద్య. (సరస్ అంటే ప్రవహించేది. విద్యయే జ్ఞాన రూపంలో ప్రవహిస్తుంది). దానిని నిర్వహించుకునేది బుద్ధి. అది సరైన మార్గంలో నడిస్తే వృద్ధి. దాని వల్ల సంపద పెరుగుతుంది. సంపద భౌతిక జీవనంలో కీర్తిని చేకూరుస్తుంది, ఆధ్యాత్మిక జీవనంలో లక్ష్మిని ప్రసాదిస్తుంది..

లక్ష్మియే జనన మరణ చక్ర బంధన విముక్తి. అదే విద్య అవిద్యగా మారి దుర్మార్గంలో నడిపిస్తే అదే విషమౌతుంది. పతనానికి దారి తీస్తుంది.

కత్తిపై సాము లాంటి ఆ ప్రయాణంలో నిచ్చెనలు ఉంటాయి, పాములూ ఉంటాయి. పాముల నోటికి చిక్కకుండా అప్రమత్తంగా లక్ష్యాన్ని చేరేందుకు, ఇంతకు పూర్వం ఆ మార్గంలో పయనించిన అనుభవ శాలురైన, యోగ్యులైన గురువుల మార్గదర్శన అవసరమవుతుంది. అలాంటి వారు చెప్పే మాటయే సూక్తి (సు ఉక్తి).

ఇప్పుడు శ్రీ సూక్తము అంటే.. ఉన్న స్థితినుండి ఉన్నత స్థితిని చేరే క్రమంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తూ, ఉపకరణాలను సరిగా ఉపయోగిస్తూ, పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ, విషతుల్యమైన ప్రలోభాలకు లొంగకుండా ముందుకు సాగేందుకు అవసరమైన మంచి మాటనే శ్రీసూక్తం అనవచ్చు.

ఐశ్వర్యాన్ని సాధారణంగా డబ్బు రూపంలో కొలవడం మనకు అలవాటయింది. కాని కుటుంబ బంధాలను, సామాజిక సంబంధాలను, "నేనెవ్వరనే ఆత్మతత్త్వ మూలాలను" తెలుసుకోవడం, ఈ సృష్టి యావత్తూ వ్యాపించి ఉన్న ఆ పరమాత్మను అవగాహన చేసుకునే ప్రయత్నమే ఐశ్వర్య

మనే భావనను మనం అర్థం చేసుకోవడం లేదు. ఈ విశాల మైన అపరిమితమైన సృష్టితో, దానిని సృజించిన పరమాత్మతో అనుసంధానింప బడేందుకు చేసే ప్రయత్నంలో ముందుకు సాగడమే నిజానికి ఐశ్వర్యం.

ఈ సత్యాన్ని దర్శించే తపనతో తపించిన సత్యాన్వేష కులైన తాపసులు తాము దర్శిం చిన సత్యాన్ని అక్షరబద్ధం చేసి అందించిన వేద విజ్ఞానంలో ఒక చిన్న భాగం ఈ శ్రీ సూక్తం. విద్ అనే ధాతువు ద్వారా సాధింప బడిన వేదము అనే మాటకు తెలుసుకొనుట అని అర్థం. ఇది ప్రేయస్కరమూ, శ్రేయస్కరము కూడా. అంటే భౌతిక ఆధ్యాత్మిక విభాగాలలో ముందుకు నడిపించేది.

“హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజామ్, చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ మావహ”!

ఓ అగ్ని దేవా! బంగారు రంగుకలిగినదీ,హరిణిరూపంలో కనిపించేది, బంగారు వెండి ఆభరణాలతో ప్రకాశిస్తున్నదీ చంద్రుని వెన్నెల లాగా ఆహ్లాదాన్ని కలిగించేది అయిన లక్ష్మీదేవిని మమ్మావహించునట్లు చేయమని సాధకుడు ప్రార్థిస్తున్నాడు. ఇది మామూలుగా చెప్పుకునే అర్థం.

ఆకాశంలో సూర్యోద యానికి ముందు కనిపించే బాల భాస్కరుని వర్ణం లేదా రంగు... హిరణ్యవర్ణం. అదే



ఉషస్సుకు పూర్వ రూపం హిరణ్య వర్ణం. చీకటికి ఉత్తర రూపం హిరణ్యవర్ణం. బంగారు రంగుతో ఉషోదయమౌతుంది. అంటే అమ్మవారిని మొదటగా మనం ఆ రంగులో చూస్తామన్నమాట. గర్భస్థ శిషువు ప్రపంచాన్ని చూచే సమయంలో ఆ శిశువుకు తల్లి కనిపించే రూపం ఆ రూపమే. హరిణ అంటే సూర్యుడు, విష్ణువు, శివుడూ అని చెపుతారు. సూర్యుడు జ్ఞానానికి ప్రతీక, విష్ణువు ఆ జ్ఞాన వ్యాప్తికి ప్రతీక కాగా శివుడు ఆ జ్ఞానం వల్ల మనం పొందే ఆనందానికి ప్రతీక.

సాధారణంగా అగ్ని మూడు రకాలుగా ఉంటుంది. ఈ మూడురకాలఅగ్నికూడామేలిమి బంగారు రంగులోనే ఉంటుంది. యజ్ఞయా గాదులలో కనిపించే అగ్ని ఒకటి, సూర్యబింబంలో కని పించే అగ్ని రెండవది కాగా సాధకుని హృదయాకాశంలో జ్వలించే అగ్ని మూడవది.

ఉఅజ్ఞయాగాదుల రూపంలో బాహ్యార్చన లేదా ఆరాధన చేస్తూ మనస్సును సన్నద్ధం చేసుకొని పొందిన జ్ఞానాన్ని (సూర్యుడు జ్ఞానానికి ప్రతీక) హృదాకాశం లేదా దహరాకాశంలో నింపుకొని ఆ జ్వలనలో ఆత్మ సాక్షాత్కారం పొందడం సాధనలో పరాకాష్ఠ. ఆత్మ సాక్షాత్కారంలో పొందే వెలుగు హితమైనది, రమ్యమైనది, మేలు కలిగించేది, సుందరమైనది, లహరియై ప్రవ హించేది.

“హ”కారం ఆకాశానికి, “ర”కారం అగ్నికి, “ఇ” కారం నివృతి మార్గాన్ని సూచిస్తున్నాయి. ఆకాశం అంటే Space. అంతటా “ఉన్నది” ఆకాశమే. కుండలో ఉన్నది, మఠంలో ఉన్నది, ప్రపంచం అంతటా ఉన్నది, మీలో నాలో ఉన్నది ఒక్కటే అదే ఆకాశం. అందులోనే సర్వ జీవకోటి, సకల ప్రపంచమూ నిండి ఉన్నది. అగ్ని అంటే నిప్పు లేదా Fire అంటే పవిత్రీకరణ లేదా Purification. త్రికరణ శుద్ధి జరగాలి. అప్పుడు కలిగేది నివృత్తి లేదా ముక్తి లేదా Liberation. ఉషోదయంలో కనిపించే ఆ హిరణ్యవర్ణ కిరణాలు జగత్తంతా వ్యాపిస్తూ మనలోనూ సకల చరాచర సృష్టి యంతటా నిండి ఉన్న ఆ ఆదిశక్తి స్వరూపాన్ని, స్వభావాన్ని గుర్తించమని ప్రబోధి స్తున్నాయి. ఈ ప్రబోధయే వేదం.


(ఇంకా వుంది)

# ఆరవ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి

పాలెపు బుచ్చిరాజు




నీలం సంజీవ రెడ్డి 1913, మే నెల 19న ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా ఇల్లూరులో పుట్టాడు. తండ్రి పేరు చిన్నప్ప రెడ్డి. ఆయన ఒక సామాన్య వ్యవసాయదారు. దేశ భక్తుడు. స్వంతంగా వ్యవసాయం చేసుకునేవాడు. సంజీవ రెడ్డి చిన్నప్పటినుంచీ తండ్రితోనే ఉంటూ, వ్యవసాయంలో సహాయ పడుతూ ఉండేవాడు. నిరంతరం కష్టపడి శ్రమించకపోతే పూట గడవదు. చిన్నతనంలోనే తండ్రి అలా కష్టపడడం చూసిన వాడు కాబట్టే, సంజీవరెడ్డికి భావి జీవితంలో శ్రామికులంటే ప్రత్యేక అభిమానం ఏర్పడింది. సంజీవ రెడ్డి ప్రారంభ విద్య అడయార్ లోని థియోసాఫికల్ స్కూల్ లో జరిగింది. ఆయన తెలివి తేటలకి అబ్బురపడి ఆనాటి ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆయనకి పాఠాలు చెప్పేవారు. ఆటలంటే కూడా ఆయనకి ఇష్టం ఉండేది. కాని చదువు మీద ఎక్కువ శ్రద్ధ చూపడంతో ఆటల మీద దృష్టి పెట్ట లేకపోయాడు. బడిలో మాత్రం వక్తృత్వ పోటీలలో పాల్గొని బహుమతులు గెల్చుకునేవాడు. అడయార్ బడిలో పదవ తరగతి పాసయ్యాక పై చదువులకి ఆయన మద్రాసు వచ్చాడు. అక్కడ 'ఆర్ట్స్ కాలేజ్ ఆఫ్ మద్రాసు' లో ప్రవేశం తీసుకున్నాడు. అక్కడ కూడా వాద ప్రతివాద పోటీలలో ఉత్సాహంతో పాల్గొనడం వల్ల ఆయనకి ఉపన్యాసాలివ్వడం బాగా అలవడింది.



సంజీవ రెడ్డి మెట్రిక్ చదువుతున్న రోజుల్లో ఒకసారి మహాత్మా గాంధీ అనంతపురం వచ్చాడు. అప్పుడు సంజీవరెడ్డి మొదటి సారిగా గాంధీజీని చూశాడు. అంతకు ముందే ఆయన గురించి అందరూ కథలుగా చెప్పుకుంటూ ఉంటే విని ఉన్నాడు. కాని ఆయన్నిస్వయంగా చూడాలనే కోరిక ఆనాటికి తీరింది.

దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చిన గాంధీజీ భారత దేశంలో అహింసాయుత ఆందోళన, స్వదేశీ ఉద్యమం, విదేశ వస్తు బహిష్కారం గురించి ఉపన్యాసాలిస్తూ దేశం అంతా తిరుగుతున్నాడు. గాంధీజీ అనుయాయులు ఆయన్ని అనుసరిస్తూ, విదేశీ వస్తువులు ఎక్కడ దొరికితే అక్కడ వాటిని ధ్వంసం చేయడం, కాల్చి బూడిద చేయడం చేస్తున్నారు. గాంధీజీ వెళ్ళిన చోటల్లా ఆయనకి బ్రహ్మరథం పట్టుతున్నారు. ఆయన మీద ఉన్న భక్తి శ్రద్ధలతో, అనేకరకాల వస్తువులు ఆయనకి సమర్పిస్తున్నారు. గాంధీజీ వాటిని స్వీకరించి, అక్కడికక్కడే వేలం వేసి, వచ్చిన ధనాన్ని తను ప్రారంభించిన ఉద్యమాల కోసం ఖర్చు చేసేవాడు.

అలా ఆయన అనంతపురం వచ్చినప్పుడు వేలాది మంది ప్రజలు దర్శనం కోసం వచ్చారు. రకరకాల వస్తువుల్ని తెచ్చి ఆయనకి కానుకలుగా ఇచ్చారు. అలా వచ్చిన



వాటిలో మూడు వస్తువుల్ని , ఒక శాలువా, ఒక పేంటు గుడ్డ, ఒక వెండి భరిణె , గాంధీజీ వేలానికి పెట్టారు. అందరితో బాటు సంజీవ రెడ్డి కూడా ఉత్సాహంతో వేలం లో పాల్గొని పాట మొదలు పెట్టాడు. కొంత సేపటికి పాత ముగిసింది. ఆఖరిపాట సంజీవ రెడ్డిది అయింది. వెంటనే ఆ డబ్బు చెల్లించి, వస్తువుల్ని చేజిక్కించుకోవాలి. వెనకనున్న అందరూ సజ్జుఇవరెద్దిని ముందుకు తోస్తున్నారు. వెళ్లి తీసుకో మని. కాని ఆయన కాళ్ళు ముందుకు పడడం లేదు. వెనక గోల మొదలయ్యింది. సంజీవరెడ్డి పెద్ద ధర్మ సందేహంలో చిక్కుకున్నాడు. అసలు సంగతేమిటంటే, ఈయన ఆ సమయంలో విదేశీ దుస్తులు ధరించి ఉన్నాడు. వాటితో గాంధీజీ ఎదుట నిలడడానికి సిగ్గు వేసింది. అది ఎంత అవమానకరం! ఎలాగో ధైర్యం చేసి ముందుకు వెళ్లి డబ్బిచ్చి, ఆ వస్తువులు తీసుకున్నాడు. వాటిని తనతో పదిలంగా దాచుకున్నాడు. అన్నిటి కంటే ముఖ్యమైనది, సంజీవరెడ్డి అటునుంచి ఆటే ఖాదీ బండారుకి వెళ్లి తన కోసం ఖద్దరు బట్టలు కొనుక్కున్నాడు. ఆయన స్వాతంత్ర్య సంగ్రామంలో అడుగు పెట్టడానికి ఆ సంఘటన దారి తీసింది.

స ం జీ వ రె డ్డి కి తన భాషణా చాతుర్యంతో ప్రజల్ని తనవైపు ఆకర్షించుకోగల శక్తి చదువుకునే రోజుల్లోనే వికసించింది. గాంధీజీ వైపు ఆయన ఆకర్షితుడు కావడానికి గల ముఖ్య కారణం,గాంధీజీ అనుసరించే ప్రచార విధానం. ఆ మహనీయుడు ఏదైనా తను ముందు ఆచరించి చూపి, తరవాత ఇతరుల్ని ఆచరించమని బోధించేవాడు. అందువల్ల దేశం అంతా అయన చెప్పిన సూత్రాల్ని పాటించడం పరిపాటి అయింది. ఆయన పాటించిన సూత్రాలలో విధిగా గాంధీ టోపిని ధరించడం కూడా ఒకటి. అది ప్రజల్లో బాగా ప్రాచుర్యం పొందడంతో, నెమ్మదిగా పాఠశాలల్లోను, కాలేజీల్లోనూ కూడా వ్యాపించింది. దానితో బ్రిటిషు ప్రభుత్వం విద్యార్థులు గాంధీ టోపీలు దరించరాదని నిబంధన పెట్టింది. సంజీవ రెడ్డి చదువుకునే క్లాసులో ఒకనాడు ఒక విద్యార్థి గాంధీ టోపీ పెట్టుకుని క్లాసులోకి వచ్చాడు. కాలేజి అంతా పెద్ద అలజడి చెలరేగింది. ప్రిన్సిపాలు ఆ విద్యార్థిని క్లాసు నుంచి బహిష్కరించాడు. అదే క్లాసులో కూర్చున్న సంజీవరెడ్డికి ఇదంతగా నచ్చలేదు. ఏమైనా సరే, ప్రిన్సిపాలుకి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం కళాశాల విద్యార్థులంతా ఒక సమావేశం ఏర్పాటు చేశారు. దానిలో సంజీవరెడ్డి ముఖ్య పాత్ర వహించాడు. తమని ఇంతగా అవమానపరచిన ప్రిన్సిపాలుకి తగిన బుద్ధి చెప్పాలని, మర్నాడు మొత్తం కాలేజి విద్యార్థులంతా కలిసి కట్టుగా గాంధీ టోపీలు పెట్టుకుని రావాలని ఒక్కడు కూడా టోపిలేని వాడు కనిపించకూడదని వారం-

దరిని ఉద్దేశించి ప్రసంగించాడు. మర్నాడు కాలేజిలో సీను చూసి తీరాలి. లోపలి ప్రవేశించిన ప్రతి ఒక్క విద్యార్థి తలమీద గాంధీ టోపీ మెరుస్తోంది. గేటు దగ్గర ఉన్న కాపలాదారు అది చూసి బెంబేలెత్తిపోయి, పరుగు పరుగున పోయి ప్రిన్సిపాలుకి విషయం చేరవేశాడు. ఆయన బైటికి వచ్చి చూస్తే ఏముంది!! అన్నీ గాంధీ టోపీలే!. వందలాది విద్యార్థులు గాంధీ టోపీలు పెట్టుకుని లోపలి రావడం చూసి నివ్వెర పోయాడాయన. ఏం చేయాలో తోచక బుర్ర పట్టుకుని కూర్చున్నాడు. కొందరు అధ్యాపకులు కూడా వచ్చారు. ఇంతలో ప్రార్థనకి గంట మ్రోగింది. పిల్లలంతా క్రమశిక్షణతో క్యూలో నిలబడ్డారు. ఎవరూ కిక్కురు మనడం లేదు. ప్రిన్సిపాలుకి, కొందరు ఉపాధ్యాయులకి ఒళ్లంతా చెమటలు పట్టాయి. మరికొందరు బాగా జరిగిందని మనసులోనే సంతోషించారు. పిల్లల్లో ఎవరూ భయపడడం లేదు. ధైర్యంగా నిలబడ్డారు. ఈ రోజు అటో, ఇటో తేల్చుకోవాలి అన్నట్టున్నాయి వారి ముఖాలు. భారతీయ విద్యార్థులకి దేశం అన్నా, గాంధీజీ అన్నా ఎంత భక్తి ఉందో ఇవాళ తెలియజెప్పాలి అనుకున్నారు. ఐకమత్యంలో ఎంత బలం ఉందో తెలియజెప్పాలి అనుకున్నారు.

ప్రార్థన అయింది. అంతా సవ్యంగా సాగింది. ప్రినసిపాలు ఒక అడుగు ముందుకు వేసి అందరి వైపు గుర్రుగా చూశాడు. అంతా నిశ్శబ్దం! గప్ చిప్ . ఏమాత్రం కదిపినా అగ్ని పర్వతం బ్రద్దలు కావచ్చు. ఏమీ మాట్లాడకపోవడమే ఉత్తమం అనిపించింది. ఈ పరిస్థితుల్లో గాంధీ టోపీ పెట్టుకురావద్దనడం అసంభవం అనిపించిందాయనకి. అదొక పెద్ద నేరం కాదు కఠినంగా శిక్షించడానికి. ఆ రోజుకి కాలేజి అంతా గాంధీ టోపీ మయం అయింది. సంజీవరెడ్డి తాను నమ్మిన దానిని ఆచరించడమే కాకుండా, మొత్తం విద్యార్థి బృందాన్ని ప్రేరేపించ గలిగాడు. ఆ విధంగా గాంధీజీ మీద ఉన్న గౌరవాన్ని నిరూపించుకో గలిగాడు. అంతే కాక ఈ సంఘటనతో ఆయనలో ఉన్న నేతృత్వగుణాలు వికసించాయి. సహజంగానే విద్యార్థులంతా ఆయన్ని తమనాయకుడిగా భావించసాగారు.

సంజీవరెడ్డిలో ఆ రోజు గాంధీజీని కలిసినప్పుడే స్వాతంత్ర్య సమరంలో చేరి దేశసేవ చేయాలనే కోరిక అంకురించింది. ఇమ్కచాడువు మీద మనసు మల్లడం లేదు. తండ్రి మాత్రం కొడుకు పెద్ద చదువులు చదివి గొప్పవాడు కావాలని కోరుకునే వాడు. గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించిన రోజులవి. భారత దేశం అంతా అట్టుడికినట్టు ఉడికి పోతోంది. పాఠశాలల్లోను, కాలేజీల్లోను సుదీర్ఘమైన చర్చలు జరుగుతున్నాయి. విద్యార్థి లోకం అంతా ఏకమై సత్యాగ్రహంలో గాంధీజీకి చేదోడు వాదోడుగా ఉండాలని ఆక్రోశించింది. సహజంగానే ఉత్సాహవంతుడైన యువకుడిగా సంజీవరెడ్డి రంగంలోకి దూకాడు. చదువు వదిలి పెట్టి కాంగ్రెసులో చేరి, స్వదేశీ ఉద్యమంలో తానూ భాగస్తుడయ్యాడు. విషయం తెలిసి తండ్రి మొదట్లో కొంత బాధ పడ్డాడు. కాని, సంజీవరెడ్డి ప్రవర్తనని చిన్నప్పటి నుంచి తెలిసినవాడు కాబట్టి ఒకనాటికి ఇలా జరుగుతుందని ఊహించ గలిగాడు. రైతు కుటుంబంలో పుట్టినా, దేశ సేవ, సమాజాభివృద్ధికోసం పాటు పడడం కూడా నిరంతర శ్రామిక జీవనమే అని సంతోషించాడు. అవసరమైతే అందుకు జైలుకి కూడా వెళ్ళడానికి కూడా వెనుకాడని సమర్థుడు తన కొడుకు అని గర్వ పడ్డాడు. అందువల్ల సంజీవరెడ్డి దారికి అడ్డు తగలలేదు.

ఏ ముహూర్తాన తండ్రికి ఆ ఊహ వచ్చిందో! అదే నిజమయింది. ఉప్పు సత్యాగ్రహంలో అనేక మంది కార్యకర్తలతోబాటు సంజీవరెడ్డికి కూడా జైలు శిక్ష పడింది. తండ్రి మనసు క్షణకాలం పాటు చివుక్కుమన్నప్పటికీ, రాజకీయాల్లో ఇవన్నీ తప్పని సరి అని సరిపెట్టుకున్నాడు. ఎందరో మహానుభావులు ఎన్నోరకాల త్యాగాలు చేస్తున్నారు. తనకొడుకు కూడా

వారిలో ఒక భాగం అనుకుని తృప్తి పడ్డాడు. ఇలా ప్రదర్శనలని చేసేవాళ్ళని భయపెట్టడం కోసం బంధించి, కొన్నాళ్ళ తరవాత విడుదల చేసేవారు. అలా విడుదల అయివచ్చిన సంజీవ-రెడ్డి తన ఆందోళన మాత్రం విడి-చిపెట్ట లేదు. ఒక ప్రక్క ప్రైవేటుగా చదువుకుంటూనే, దేశభక్తి కార్య-క్రమాల్లో పాల్గొంటూ ఉండేవాడు. మరోసారి, 1940వ సంవత్సరం-లో సంజీవరెడ్డి జైలుకి వెళ్ళవ-లసి వచ్చింది. ఈ సారి ఆరు నెలలు శిక్ష పడింది. అప్పటికి రెడ్డికి 27 సంవత్సరాల వయసు. పెళ్లి కూడా అయింది. ఇద్దరు పిల్లలు. భార్య జైలులో ఉన్నవా-ళ్ళ గురించి చాలా వింది. ఆం-గ్లేయులు వాళ్ళని చాలా చావ-బాదుతారని, నానా యాతనలు పెడతారని, నిర్దాక్షిణ్యంగా వేధి-స్తారని పోలీసులు వాళ్ళని శత్రు-వులనే దృష్టితో చూస్తారని ఇలా రకరకాలుగా అందరూ చెప్పుకు-నేవారు. ఆమె ఆవేదనకి అంతు లేదు. అతి కష్టం మీద ఆ ఆరు నెలలు ఎలాగో గడిపి, గడువు పూర్తయిన రోజున సంజీవరెడ్డిని కలుసు కోవడానికి జైలు ద్వారం వద్దకు మామగారితో వెళ్ళింది. అప్పటికే అక్కడ చాలా మంది కాంగ్రెసు కార్యకర్తలు పూలదం-డలతో స్వాగతం పలకడానికి వేచి ఉన్నారు. అంతా ఆ ఘడియ కోసం ఆత్రంగా ఎదురు చూడ-సాగారు.

నిర్ణీతసమయానికి, జైలు ద్వారం తెరుచుకుంది. సంజీవరెడ్డి బైటికి వచ్చాడు. 'హమ్మయ్య' అని అంతా ఊపిరి పీల్చుకున్నా-రు. ఇంతలో ఇద్దరు సైనికులు హుటాహుటిన వచ్చి సంజీవరె-డ్డి చేతులకి బేడీలు వేసి తీసుకు పోయారు. అదేమిటని అడిగితే, 'మా దగ్గర వారంటు ఉంది' అన్నారు. పోలిసు మళ్ళీ సంజీ-వరెడ్డిని జైలుకి తరలించారు. వచ్చినవారు నిరాశతో వెనుదిరి-గారు.

ఈ సారి కేసులో సంజీవరెడ్డి-కి రెండేళ్ళ శిక్ష పడింది. ఈ శి-క్షాకాలంలో ఆయన్ని ప్రభుత్వం బేలూరు, అమరావతి జైళ్ళలో ఉంచింది. అదీ ఒకందుకు మంచిదే అయింది. ఎందరో ప్రముఖ స్వాధీనతా సేనాను-ల్ని చాలా కాలంగా ఈ జైళ్ళలో బంధించి ఉంచింది ప్రభుత్వం. వారితో సంజీవరెడ్డికి సత్సంబం-ధాలు ఏర్పడ్డాయి.

రెండేళ్ళ జైలు శిక్ష అనంతరం సంజీవరెడ్డి విడుదల అయ్యాడు. జైలు నుంచి తిరిగి వచ్చాక ఆయనలో భారత మాతని ఆం-గ్లేయుల బారినుండి కాపాడాలనే కాంక్ష మరింత ఎక్కువ అయింది. అప్పటికే ప్రారంభం అయిన క్విట్ ఇండియా ఉద్యమంలో అతి ఉత్సాహంతో పాల్గొన్నాడు. ఉద్య-మాన్ని సమర్థిస్తూ చేసే ప్రచారం-లో ప్రముఖ పాత్ర వహించాడు. పోలీసులు ప్రశ్నిస్తే నిజం చెప్ప-డానికి ఏమాత్రము జంక లేదు. దేశాన్ని పరాయి పాలన నుంచి విముక్తి లభించేవరకు నడుం-కట్టి పోరాడుతానని నిర్భయంగా చెప్పాడు. దేశాన్ని దోచుకుంటు-న్న బ్రిటిషువారిని పారద్రోలడ-మే తన కర్తవ్యం అని నమ్మాడు. ఫలితంగా మళ్ళీ మూడేళ్ళ పాటు జైలుకి వెళ్ళాడు. గాంధీజీకి నిజమైన అనుయాయుడిగా ధర్మ పోరాటాన్ని సాగించడానికి పూనుకున్నాడు.

న్యాయం కోసం, నిజాయితీ కోసం ప్రాణాల్ని కూడా లెక్క చేయకుండా పోరాడడం సంజీవరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించినందుకు గుర్తిం-పుగా కాంగ్రెసు ఆయన్ని అనేక అధికార పదవులతో గౌరవిం-చింది. భారత దేశపు సంవిధాన సభలో సభ్యుడిగా స్థానం కల్పిం-చింది. ఆయన ఎప్పుడూ పద-వులకోసం ప్రాకులాడ లేదు. పదవులే ఆయన్ని వెదుక్కుంటూ వచ్చేవి. ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్య మంత్రిగాను, భారతీయ కాంగ్రెసు అధ్యక్షుడుగాను, కేంద్ర ప్రభు-త్వంలో మంత్రిగాను, ఎన్నో పద-వుల్లో దేశ సేవ చేశాడు. ఆఖరికి అప్పట్లో రాజకీయాల్లో జరు-గుతున్న అల్లకల్లోలాకి విసుగు చెంది, రాజకీయ సన్యాసం చేసి స్వంత గ్రామానికి వెళ్లిపోయి, వ్యవసాయం చేసుకో సాగాడు. తరువాతి కాలంలో దేశం పిలు-పువిని, తిరిగి రాష్ట్ర పతిగా ఎన్నిక అయ్యాడు. నీతికి, నిజాయితీకి సంజీవరెడ్డి మారుపేరు.

# పసుపు, పారాణి, తాంబూలం



## వేమూరి వేంకటేశ్వరరావు

చాల రోజులబట్టి నన్ను వేధిస్తున్న ప్రశ్నలు రెండు మనస్సులో మెదిలాయి! పచ్చటి పసుపు ముద్దలో కాసింత సున్నం కలిపితే ఎర్రటి పారాణి వస్తుంది. పచ్చటి పసుపు గుండలో కాసింత సున్నం కలిపితే ఎర్రటి కుంకం వస్తుంది. ఇక్కడ జరుగుతున్న రసాయన ప్రక్రియ ఏమిటి? ఇది మొదటి ప్రశ్న. అలాగే, తమలపాకులకి సున్నం రాసి, నోట్లో పెట్టుకు నమిలితే నోరు ఎర్రబడుతుంది. ఉత్త తమలపాకులు నమిలితే నోరు ఎర్రబడదు. (అనే అనుకుంటున్నాను. ఈ అమెరికాలో ఆకుకి డాలరు చెల్లించి ప్రయోగం ఎక్కడ చెయ్యగలను?) తమలపాకులకి సున్నం రాసి, నోట్లో పెట్టుకోకుండా కల్వంలో వేసి నూరితే ఎర్రబడుతుందో లేదో కూడా తెలియదు. పసుపు కుంకంగా (పారాణిగా) మారడానికి, నోరు ఎర్రబడడానికి వెనక ఉన్న రసాయన ప్రక్రియ ఒకటేనా? ఇది రెండవ ప్రశ్న.

అంటే ఏమిటన్న మాట? పసుపులో సున్నం కలిపినప్పుడు ఏదో రసాయనిక ప్రక్రియ వల్ల కొత్త రసాయనం పుట్టి ఉండవచ్చు, ఆ కొత్త రసాయనం ఎర్రగా ఉండవచ్చు. ఇదొక సాధ్యత. కాకపోతే, పసుపు కొమ్ములలో పచ్చదనంతో పాటు ఎరుపు రంగు కూడా ప్రచ్ఛన్నంగా దాగి ఉండి ఉండవచ్చు. ఈ రెండింటిలో పసుపు రంగుకి ప్రాబల్యం ఎక్కువ ఉండడం వల్ల ఎరుపు రంగు మనకి కనబడకపోయి ఉండవచ్చు. పసుపులో సున్నం కలియగానే పసుపు రంగు ప్రాబల్యం పడిపోయి అంతర్గతంగా ఉన్న ఎరుపు రంగు బయట పడుతోందేమో? ఇది మరొక సాధ్యత.

నాకు ఈ అనుమానాలు రాడానికి మరొక కారణం ఉంది. తమలపాకులు ఆకుపచ్చగా ఉండడానికి కీలక కారణం పత్రహరితం (క్లోరోఫిల్). రక్తం ఎర్రగా ఉండడానికి కీలక కారణం రక్తచందురం (హిమోగ్లోబిన్). పత్రహరితం లో ఉన్న అణువుల అమరికని, రక్తచందురం లో ఉన్న అణువుల అమరికని, పక్క పక్కని పెట్టి చూస్తే ఒకే ఒక్క చిన్న తేడా కనిపిస్తుంది. పత్రహరితంలో మెగ్నీసియం అణువు ఉన్న స్థానంలో ఇనుము అణువుని ప్రతిక్షేపిస్తే ఎర్రటి రంగు ఉన్న రక్తచందురం వస్తుంది. ఇదే విధంగా సున్నంలో ఉన్న ఖటికం (కేల్సియం) అణువు కూడా స్థానభ్రంశం చెందడం వంటిది ఏదైనా జరుగుతోందా?

ఈ అనుమానాలు నివృత్తి చేసుకుందామని అంతర్జాలం మీద ఒక ప్రశ్న సంధించి వదిలేను. శ్రీమతి (ప్రొఫెసర్) మంథా భానుమతి నా అనుమానాల్ని పటాపంచలు చేస్తూ రెండు వాక్యాలలో సమాధానం చెప్పేరు. పసుపులో సున్నం కలిపినప్పుడు యానకం (medium) తన ఆమ్లత్వ తత్త్వాన్ని పోగొట్టుకుని క్షారత్వ తత్త్వం సంతరించుకుంటుంది కనుక రంగు మారుతుంది (మాటలు నావి, భావం ఆమెది) అన్నారు. వెంటనే క్లోరోఫిల్-హిమోగ్లోబిన్ దిశలో ఆలోచించడం మానేసేను కానీ ఆమె చెప్పిన వివరణ నా మట్టి బుర్రకి అవగాహన కాలేదు. మరొక సారి అడగడానికి మొహమాటపడి ఊరుకున్నాను - ఎప్పటికో ఒకప్పటికి అర్థం కాకపోతుందా అని.

అప్పుడు అంతర్జాలం శక్తి అర్థం అయింది. అనుకోని దిశ నుండి నాకు కావలసిన సమాధానం దొరికింది. డెట్రాయిట్ నుండి మిడతాడ మూర్తి (ఈయన అంతర్జాల రంగంలో ఒక కంపెనీ అధినేత!) ఒక లంకె పంపించేరు. అది చదివిన తరువాత సమస్య పరిష్కారం అయిందనే అనుకుం-

టున్నాను.
పసుపులో రెండు రంజక ద్రవ్యాలు (pigments) ఉంటాయిట: పసుపుపచ్చ రంగు కల క్సెంథోఫిల్ (Xanthophyll), ఎర్ర-నారింజ రంగులో ఉండే కేరోటిన్ (Carotene). వీటితోపాటు కొన్ని అంగిక ఆమ్లాలు (organic acids) కూడా ఉంటాయి. పసుపులో చిటికెడు సున్నం కలిపేసరికి ఈ ఆమ్లాలు తటస్థీకరించబడతాయి. ఈ తటస్థ వాతావరణంలో పసుపు రంగు ప్రకాశించదు; తెరచాటున ఉన్న ఎరుపు బయటకి వచ్చి ప్రకాశిస్తుంది. అదీ మూల కారణం. భానుమతి గారు ఇచ్చిన వివరణ కూడా ఇదే.
మరొక్క ప్రయోగం చేసి చూడాలి. ఎర్రగా ఉన్న పారాణిలో ఒక చుక్క నిమ్మ రసం పిండితే అది మళ్లా పచ్చగా మారుతుందా? కుతూహలం ఉన్న విద్యార్థులకి ఈ ప్రయోగం వదలి పెడుతున్నాను. మా మనవడు అర్జునుడు ఇంటికి రాగానే వాడి చేత ఈ ప్రయోగం చేయించి చూస్తాను.
పసుపు వంటి పచ్చని పదార్థాన్ని ఎర్రటి కుంకం రంగులోకి మార్చటానికి దంచుతున్న పసుపుకొమ్ములలో చిటికెడు సున్నం వెయ్యడం నా చిన్నప్పుడు చూసేను. మరి కుంకంలో సున్నం ఉంటే, అది ప్రతి రోజు పెట్టుకుంటూ ఉంటే, నుదురు దగ్గర చర్మం పొక్కదా? పసుపుని కుంకంగా మార్చడానికి తెల్లటి స్పటికాలు వాడడం కూడా చూసేను. కానీ ఆ స్పటికాల రసాయన తత్త్వం ఏమిటో నాకు తెలియదు.
పోతే, "కుంకుమ పువ్వు" కి ఆ పేరు ఎందుకు వచ్చినట్లు? ఆ "పువ్వు"ని కుంకం చెయ్యడానికి వాడతారా? కుంకంలా ఎర్రగా ఉంటుంది కనుక దానికి ఆ పేరు వచ్చి ఉంటుందా? లేక, ఎర్రగా ఉన్న కుంకాన్ని తయారు చెయ్యడానికి వాడే రసాయన పదార్థాన్ని కూడా "కుంకుమ పువ్వు" అనే పిలుస్తారా? నిఘంటువులో వెతికితే "అంబరము, అగ్నిశిఖము, కాశ్మీరజన్మము, కాశ్మీరము, కుంకుమము, గోరసము, ఘుసృణము, జాఫరా, ధీరము, పిశునము, పీతనము, బాహ్లీకము, రక్తసరోరుహము, రక్తాంగము, లోహితచందనము, వరము, వహ్నిదీపకము, వహ్నిశిఖము, వీరశతము, సంకోచపిశునము, సంకోచము, సూర్యసంజ్ఞము" మొదలైన పర్యాయ పదాలు కనిపించేయి. ఇవన్నీ saffron కి పర్యాయ పదాలేనా?
"కస్తూరీ తిలకం" అన్నారు కనుక కస్తూరిని పసుపులో కలిపితే ఎర్రగా వస్తుందా? లేక కస్తూరిని ఏకంగా బొట్టు పెట్టేసుకుంటారా?
మరి తాంబూలం సంగతి? నా అనుమానం ఏమిటంటే మన నోటిలో ఉన్న లాలాజలం క్షార లక్షణం కలిగి ఉండుంటుంది. (బజారు కెళ్లి లిట్మస్ కాగితం కొని పట్రావాలి). కనుక సున్నం రాసినా, రాయకపోయినా ఆ క్షార వాతావరణంలో తమలపాకులలో నిద్రాణంగా ఉన్న కేరొటీన్ (ఉంటుందో ఉండదో నాకు తెలియదు) లేచి వచ్చి నోటిని పండిస్తుంది. మరొక "పాసిబిలిటీ" ఏమిటంటే భార్యాభర్తల మధ్య "ప్రేమ" పెరిగినప్పుడు ఇద్దరికీ నోరు బాగా ఊరి ఆ ఊటలో పడ్డ తాంబూలం బాగా పండుతుంది … కాబోలు! (ఏదో సరదాకి రాసేను. తిట్టుకోకండి.) ■

---

### గళ్ళనుడి జనవరి 2020 సమాధానాలు

అడ్డం:
1) బ్యుటేన్
2) పెంటనోన్
5) పాతర
7) టేక్
9) అంకగణితము
12) కణసిద్ధాంతము
16) అమ్మ
17) విముఖం
18) తాటికమ్మ
19) కోసైన్

నిలువు:
1) బ్యుటనోల్
2) పాన్
3) టక్
4) పెంటేన్
6) తరంగసిద్ధాంతము
8) అంటు
10) ముడి
11) కట్టు
13) ముక్క
14) కోరండమ్
15) అమ్మమ్మ
16) ఆక
17) తావి

సరియైన జవాబు పంపినవారు:
**శ్రీ పూజారి వెంకటేష్**

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

“మామయ్యగారూ అలా వెళ్ళి పంపా నది, సన్‌డైల్ చూసి వద్దాము పదండి” అంది అనూరాధ.

“తల్లిగాడు మా ఇద్దరికీ ఓపిక లేదు, మీరిద్దరూ చూసి రండి” అన్నారు దక్షిణామూర్తి గారి భార్య. కృష్ణమోహన్, అనూరాధ కాస్సేపు ఆ రెండు ప్రదేశాలు చూసి వచ్చారు. అనూరాధకి పంపానది, ఆ కొండలు బాగా నచ్చాయి.

అన్నవరంలో తొమ్మిది గంటలకల్లా బయలుదేరి విశాఖలో కృష్ణమోహన్ ఇంటికి చేరేసరికి పన్నెండున్నర దాటింది. నరసింహారావుగారు, సుబ్బలక్ష్మిగారు ఎదురొచ్చి దక్షిణాముర్తి దంపతులని సాదరంగా ఆహ్వానించారు. తల్లి తండ్రులిద్దరినీ వారికి పరిచయం చేసాడు కృష్ణమోహన్. అలాగే అనూరాధని కూడా పరిచయం చేసాడు.

కాస్సేపు మాట్లాడుకున్న తరువాత దక్షిణాముర్తిగారి భార్యకి, సుబ్బలక్ష్మిగారికి మధ్య చుట్టరికం కలిసింది. వారికి బంగళా అంతా చూపెట్టారు నరసింహారావు దంపతులు. “తమ్ముడుగారు మీ బంగళా చాలా నచ్చింది, చాలా విశాలంగా వుంది, చిత్రమేమిటంటే ఇది రైల్వేవారి బంగళా అయినా వాస్తు ప్రకారంగా కూడా బాగుంది” అన్నారు దక్షిణాముర్తిగారు.

“అన్నయ్యగారు ఒక పని చెయ్యండి, ఇప్పుడు ఎలాగో భోజనాల సమయం గనుక భోజనం చేసి విశ్రాంతి తీసుకొని సాయంత్రం పెళ్ళివారి ఇంటికి వెళ్ళి మళ్ళీ రాత్రికి ఇక్కడికి వచ్చేయండి, రేపు ఉదయం ఏడు గంటలకే మా మనమరాలి బారసాల, మా మనమరాలిని, మా అమ్మాయి, అల్లుడిని ఆశీర్వదించి అప్పుడు పెళ్ళి వారింటికి వెళ్ళొచ్చు. మీరు ఇక్కడే వుండి ఆ పెళ్ళికి వెళ్ళి రా వచ్చు” అన్నారు నరసింహారావుగారు.

“అబ్బే వద్దండి, మీ ఇంట్లో మీరు చాలా హడావిడిలో వున్నారు” అని మొహమాటపడ్డారు దక్షిణామూర్తిగారు.

“ఏమీ పరవాలేదు, రెండిళ్ళవతల నాతోటి అధికారి కామేశ్వరరావుగారి ఇంట్లో రెండు గదులు తీసుకున్నాను, అక్కడ మీకు బస ఏర్పాటు చేస్తాను. వాళ్ళూ మన వాళ్ళే సుసర్లవారు, మీరు ఏమీ మొహమాట పడకండి. రైల్వే వారి గెస్ట్ హౌస్ కూడా తీసుకున్నాను గాని అక్కడికి రకరకాల మనుషులు వస్తారు, మీరు పెద్ద వారు ఇబ్బంది పడతారు” అని రెండవ కొడుకు చంద్రాన్ని పిలిచి “ఒరేయ్ నువ్వెళ్ళి కాముడు మామయ్య ఇంట్లో వీరికి బస ఏర్పాట్లు చేసి రా” అని పంపించారు నరసింహారావుగారు.

ఈలోపల అనూరాధ తన దొడ్డమ్మ, పెద్దనాన్నగార్లతో, వారి తరపున వచ్చిన బంధువులతో కలిసి కబుర్లు చెబుతూ కూర్చుంది, చంటి పిల్లతో ఆడుకుంది. అది చూసి దక్షిణాముర్తిగారు కృష్ణమోహన్తో “ఒరేయ్ అబ్బీ చూసావా కోడలుపిల్ల ఇక్కడికి రాగానే పార్టీ మార్చేసింది” అని నవ్వుతూ అన్నారు.

“పెద్దనాన్నగారూ ఎంతైనా మగ పెళ్ళివారి తరపున వచ్చిందిగా” అన్నాడు కృష్ణమోహన్ ఇంకా ఏడిపిస్తూ.

“అదేమీ కాదు మామయ్యగారు, చంటిపిల్లతో సమయం తెలియలేదు” అంది అనూరాధ.

“అమ్మాయ్! అన్నయ్యగారు మొహమాట పడుతున్నారు, నీ దగ్గర చనువుంది గనుక ఈ

రెండు రోజులు వారికి కావలసినవి అన్ని నువ్వు దగ్గరుండి చూసుకో ఏదైనా అవసరమైతే మోహన్కి చెప్పు, వాడు ఏర్పాటు చేస్తాడు" అని అనూరాధకి చెప్పారు నరసింహారావుగారు.

"అలాగే మామయ్యా గారు, వారి సంగతి నేను చూసుకుంటాను" అంది అనూరాధ. భోజనాలయిన తరువాత దక్షిణామూర్తి దంపతులు వారి విడిదికి వెళ్ళారు. వారితో పాటు కృష్ణమోహన్ని, అనూరాధని వెళ్ళి దిగ పెట్టి వారికి కావలసినవన్నీ ఏర్పాటు చేసి రమ్మన్నారు నరశింహారావుగారు. తిరిగి వస్తున్నపుడు "బావా రేపు సాయంత్రం నన్ను బీచ్కి తీసుకెళ్ళవా, చాలా రోజులయ్యింది బీచ్ చూసి" అని అడిగింది అనూరాధ.

"కాకినాడలో సముద్రం వుందిగా"

"సముద్రం వుంది, కానీ ఇక్కడిలా సముద్రపు ఒడ్డున కూర్చోవడానికి అవకాశము లేదుగా" (ఆ రోజుల్లో కాకినాడ బీచ్ అంత డెవలప్ అవలేదు)

"సరే అలాగే"

******

కృష్ణమోహన్, అనూరాధ తిరిగి వచ్చాక అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అమ్మా రాధ సంగీతం నేర్చుకుంటున్నాది, చాలా బాగా పాడుతుంది" అని తల్లితో చెప్పి "రాధా మా అమ్మగారికి సంగీతం అంటే చాలా ఇష్టం, అందుకని కొన్ని త్యాగరాజ కృతులు పాడవా" అని అడిగాడు కృష్ణమోహన్ .

"అలాగే తప్పకుండా పాడతాను, అత్తయ్యగారు కూడా త్యాగరాజ కీర్తనలు చాలా బాగా పాడతారని వైదేహి వదిన చెప్పింది. అత్తయ్యగారూ ప్లీజ్ ముందు మీరు పాడరా" అని వినమ్రముగా అడిగింది అనూరాధ.

"అలాగే పాడతాను ముందు నువ్వు పాడు" అన్నారు సుబ్బ లక్ష్మిగారు.

"'మనసులోని మర్మమును తెలుసుకో', 'నీ దయ రాదా', 'బంటు రీతి కొలువు'...త్యాగరాజ కీర్తనలు, "అదిగో అల్లదిగో శ్రీహరివాసము', 'కట్టెదుర వైకుం ఠము కాణాచయిన కొండ'"...అన్నమయ్య కీర్తనలు పాడి వినిపించింది అనూరాధ. అనూరాధ పాట విని సుబ్బలక్ష్మిగారు ఎంతో ప్రసన్నులయ్యారు. ఆమె కూడా చిన్నపుడు కొద్ది రోజులు సంగీతం నేర్చుకుంది, అయితే చిన్నతనంలోనే వివాహం అవడం వల్ల ఆపివేసారు. ఆమె చాలా బాగా పాడతారు, ఆ సంగీత పరిజ్ఞానం వుండబట్టే అనూరాధ పాట ఆమెకి బాగా నచ్చింది.

"అమ్మాయ్ అద్భుతం, చక్కగా పాడావు, నీ గాత్రం చాలా బాగుంది, మధ్యలో వదిలేయకుండా పూర్తిగా నేర్చుకొని సాధన చేస్తూ వుండు" అని పొగడ్తలతో ముంచెత్తారు సుబ్బలక్ష్మిగారు. నరసింహారావుగారు కూడా అనూరాధని మెచ్చుకున్నారు.

"థాంక్యూ మామయ్యగారు, అత్తయ్యగారు" అంది అనూరాధ.

ఇంతలో దక్షిణామూర్తి దంపతులు వచ్చారు.

వారిని చూసి నరసింహారావుగారు "రండి అన్నయ్యగారూ సరి అయిన సమయానికి వచ్చారు, మా ఎం. ఎస్. సుబ్బలక్ష్మి కచేరీ విందురు గాని" అన్నారు. ఆ తరువాత సుబ్బలక్ష్మిగారు 'ఎందరో మహానుభావులు', త్యాగరాజ కృతిని పాడారు. అది విన్న అనూరాధ ఈ వయసులో కూడా ఈవిడ ఎంత మధురంగా పాడారు అని ఆశ్చర్యపోయింది.

"అత్తయ్యగారూ మీ పాట ముందు నా పాట ఏమీ కాదు, అంత పెద్ద కీర్తనని మీరు చాలా సునాయసంగా, శ్రావ్యంగా పాడారు, నిజంగా అద్భుతం. మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నందుకు అన్యధా భావించకండి, నా కోసం ఉంకొక్క కీర్తన 'నగుమోము గనలేని నా జాలి తెలిసి' పాడరా ప్లీజ్" అంది. ఆ కీర్తన అయినాక "సీతమ్మా ముచ్చటగా మూడో కీర్తన 'దేవదేవం భజే' పాడు" అన్నారు నరసింహారావుగారు. ఆ కీర్తనంటే అయనకి చాలా ఇష్టం. సుబ్బలక్ష్మిగారు పాడి వినిపించారు. అనూరాధ తన సంతోషాన్ని ఆమెకి పాదాభివందనం చేసి వ్యక్తం చేసింది.

"చాలా బాగా పాడారు, నిజంగా ఎం. ఎస్. పాడినట్లే అనిపించింది" అన్నారు దక్షిణామూర్తి దంపతులు.

"మరే అవును, ఆవిడకి పోటీదారు అవకుండా ఉండటానికే సంగీతం మధ్యలో ఆపేసిం

ది" అని చమత్కారం చేసారు నరసింహారావుగారు.

"తమ్ముడుగారు మీరు ఏదో వేళాకోళానికి అలా ఆటపట్టిస్తున్నారు గాని ఆవిడ పాట ఎంత ఇష్టం లేకపోతే 'దేవ దేవం భజే' అడిగి మరీ పాడించుకున్నారు" అన్నారు దక్షిణామూర్తిగారు.

ఈ సంగీత కార్యక్రమాలు పూర్తయ్యేటప్పటికి సాయంత్రం నాలుగున్నర దాటింది, వంటావిడ కాఫీ, టీలు తయారు చేసి తీసుకొచ్చారు.

అవి త్రాగుతూ వుండగా వైదేహి "ఒరేయ్ మోహన్ ఒకసారి ఇలా రా" అని పిలిచింది. సుబ్బలక్ష్మిగారిని కూడా బయట లాన్స్‌కి తీసుకెళ్ళి "పిన్నీ మా పిన్నత్తగారు, పిన మావగారు వస్తారనుకుని పంచల చాపు, చీర కొన్నాము కదా, ఇప్పుడు అనూ వచ్చింది తనకి పెట్టడానికి చీర కొన్లేదు ఏం చేద్దాము" అని అడిగింది.

"అబ్బా దానికింత కంగారెందుకే, మీ పిన్నత్తగారికి కొన్న చీర రాధకి పెట్టెయ్యి" అని చాలా తేలికగా సమస్యని పరిష్కరించాడు కృష్ణమోహన్. అది విని వాళ్ళిద్దరూ నవ్వుకున్నారు ఏం పొరపాటు మాట్లాడేడో అర్థం గాక "ఎందుకు నవ్వుతున్నారు" అని అమాయకంగా అడిగాడు.

"ఒరేయ్! అది పెద్ద వాళ్ళు కట్టుకొనే చేనేత చీర, పిల్లలికి బాగుండదు" అన్నారు సుబ్బలక్ష్మిగారు.

"ఓహ్! అలాగా"

"ఒక పని చేద్దాము, ఆ అమ్మాయిని మోహన్ బజారుకి తీసుకెళ్ళి నచ్చిన చీర కొంటాడు. ఆ పంచల చాపు, చీర దక్షిణామూర్తి దంపతులకి పెట్టేద్దాము, ఆది దంపతుల లాగ వాళ్ళిద్దరూ వచ్చారు" అన్నారు సుబ్బలక్ష్మిగారు.

"అయ్యబాబోయ్!మార్కటింగ్కా? అందులో చీరకొనడానికా, నావల్ల కాదు చంద్రంగాడిని పంపించు" అన్నాడు కృష్ణమోహన్.

"నీకంటే అనూతో పరిచయం వుంది, చనువుంది, వాడికి కొత్త కదరా, అసలే వాడు కొంచెం ముభావి" అంది వైదేహి.

"తప్పదా"

ఈ లోపల సుబ్బలక్ష్మిగారికి లోపలనుండి కబురు వచ్చి వెళుతూ వుంటే "పిన్నీ అనూని ఇక్కడికి రమ్మను" అంది వైదేహి. అనూరాధ వచ్చాక "అనూ వీడితో బజారు కెళ్ళి నీకు నచ్చిన చీర ఒకటి కొనుక్కో" అంది వైదేహి.

"ఎందుకు వదినా ఈ ఫార్మాలిటీస్" అని మొహమాట పడింది అనూరాధ.

"ఫార్మాలిటీస్ ఏమిటి, నువ్వు నా ఆడపడుచివి, మేము పెట్టాలి నువ్వు తీసుకోవాలి, నువ్వు ఇంకేమీ మాట్లాడకుండా వాడితో వెళ్ళు".

"బావా ఇన్నాళ్ళూ మార్కటింగ్ అంటే నాకు తలనొప్పి అని తప్పించుకున్నావు, పద నీ సంగతి చెబుతాను" అంది అనూరాధ.

"రాక్షసీ! మొత్తానికి ఇవాళ నీకు దొరికాను" అన్నాడు కృష్ణమోహన్. మార్కటింగ్కి వెళ్ళక తప్పడం లేదని ఆముదము త్రాగినట్లు మొహం పెట్టాడు. వారిద్దరి సంభాషణ విని వైదేహి నవ్వుకుంది. "వీడిని బావా అని పిలుస్తున్నాది, వాడేమో రాక్షసీ అంటున్నాడు వీళ్ళిద్దరూ బాగా చనువుగా వుంటునట్లున్నారు" అని మనసులో అనుకొంది వైదేహి.

"రాధా పెద్దనాన్నగారు పెళ్ళివారింటికి వెళ్ళడానికి తొందరపడుతున్నారు, అందుచేత తొందరగా తెమిలి రా, వాళ్ళిద్దరిని ద్వారకానగర్లో పెళ్ళివారింట్లో దిగబెట్టి మనం బజారుకి వెళదాము"

"సరే పది నిముషాలలో తయారవుతాను"

పెళ్ళివారింటికి బయలుదేరే ముందు దక్షిణామూర్తి దంపతులతో "రాత్రికి ఫలహారానికి ఇక్కడికే వచ్చేయండి" అన్నారు నరసింహారావు దంపతులు.

"వద్దండి అక్కడ చేస్తాము, రాత్రి పది కల్లా తిరిగి వస్తాము, సుసర్ల కామేశ్వరరావు గారికి కూడా పది గంటలకి వస్తామని చెప్పాను..."మాకేమి ఇబ్బంది లేదు నేను వృత్తి రీత్యా పన్నెండు వరకు నిద్ర పోను" అన్నారు ఆయన. చెప్పడం మరిచాను ఆ సుసర్ల వారి మేనమామ భమిడిమర్రి వీరభద్రంగారు నేను కాకినాడలో హైస్కూల్లో కలిసి చదువుకున్నాము" అన్నారు దక్షిణామూర్తిగారు.

దక్షిణామూర్తి దంపతులని పెళ్ళివారింట్లో దించి బట్టల షాపుకి వెళ్ళారు. రెండు మూడు షాపులలో అనూరాధకి చీరలు

నచ్చలేదు. ఇదేమిటిరా బాబూ ఇన్ని షాపులు తిప్పుతున్నాది అనుకుంటున్నాడు కృష్ణమోహన్...అతని మొహములో కనబడుతున్న విసుగుని చూసి "అబ్బే అప్పుడే ఏమైంది బావా, ఇంకా ఒక నాలుగైదు షాపులైనా తిరగకుండా వ్యవహారం సెటిల్ అవదు" అని ఇంకా ఏడిపించింది అనూరాధ.

"కానియ్యి ఈ రోజు నీది, నీకు అడ్డంగా దొరికాను"

తరువాత ఉంకొక షాపులో ఒక చీర కృష్ణమోహన్కి బాగా నచ్చింది. "రాధా చూడు ఈ చీర చాలా బాగుంది, నీకు బాగా నప్పుతుంది" ...రాధకి కూడా ఆ చీర నచ్చింది... కృష్ణమోహన్కి నచ్చిన చీర, అతను మొదటిసారిగా తనకోసం ఎంపిక చేసిన చీర అవడంవలన వెంటనే "తీసుకో" అంది.

ఇంటికి వచ్చాక ఆ చీరని అందరూ మెచ్చుకున్నారు. "ఒరేయ్ ఇది ఎవరి ఎంపిక రా" అని నర్మగర్భంగా అడిగింది వైదేహి. తనదని చెబితే అక్కడ అందరూ ఏమనుకుంటారో అని...రాధ 'కృష్ణే ఎంపిక చేసాడు' అని ఎక్కడ చెబుతుందో అని..."రాధే ఎంపిక చేసింది" అని కంగారు పడుతూ చెప్పాడు కృష్ణమోహన్. అతను అలా చెప్పడం చూసి అనూరాధ అతని వంక చూసి ఒక చిరునవ్వు నవ్వింది... కృష్ణమోహన్ కంగారు, అనూరాధ చిరునవ్వు చూసి "వీడే ఎంపిక చేసి వుంటాడు" అనుకుంది వైదేహి.

మర్నాడు తెల్లవరుఝామునే ఇంటిల్లిపాది లేచి చక చకా తెమిలి, బారసాలకి కావలసిన ఏర్పాట్లన్నీ చేసారు. ఉదయం ఆరు గంటలకల్లా దక్షిణామూర్తి దంపతులు తయారయి వచ్చారు. శేషాద్రిశర్మగారు బాలసారె కార్యక్రమానికి వచ్చారు. మిత్రులిద్దరూ చాలాకాలం తరువాత కలవడం వలన తనివితీరా కబుర్లు చెప్పుకున్నారు, మర్నాడు వారింటికి భోజనానికి రమ్మని ఆహ్వానించారు శర్మగారు.

బారసాల కార్యక్రమం తదుపరి భోజనాలయిన తరువాత భందువులంతా తిరుగు ప్రయాణమయ్యారు.

కృష్ణమోహన్ అనూరాధని తీసుకొని బయలుదేరే ముందు తల్లితో "అమ్మా రాధ తన చిన్ననాటి స్నేహితురాలు ఇంటికి తీసుకెళ్ళమంది, మేము గాజువాక వెళ్ళొస్తాము" అన్నాడు.

ఇంతలో రాధ అక్కడికి వచ్చింది. ఆమె వంక చూసి నిన్న కొన్న చీరే కట్టుకుందని గమనించాడు. మామూలుగానే రాధ చాలా అందంగా వుంటుంది. ఆ చీర కట్టుకున్నాక ఇంకా అందంగా వున్నట్లనిపించింది..."రాధ వల్ల చీరకి అందం వచ్చిందా? చీర వల్ల రాధకి అందం వచ్చిందా?" అని మనసులో అనుకున్నాడు... అలా రెప్ప వేయకుండా చూస్తూ వుంటే "ఏమిటీ" అని కళ్ళతోటే అడిగింది అనూరాధ. ఇదంతా దూరము నుండి గమనిస్తున్న వైదేహి బాబయ్యగాని, పిన్నిగాని చూస్తే బాగుండదని "ఒరేయ్ మోహన్ కాఫీ తాగుతావా?" అని అడిగి ఈ లోకంలోకి తీసుకు వచ్చింది.

కృష్ణమోహన్ మొదట అనూరాధని భీమిలి తీసుకునివెళ్ళి అక్కడ లైట్ హౌస్, సముద్రం, దగ్గరలో వున్న డచ్ బంగళా చూపించి కొద్దిసేపు సముద్రపు ఒడ్డున కూర్చుని తిరుగు ప్రయాణంలో దారిలో ఎర్రమట్టి దిబ్బలు చూపించాడు. చివరిగా రామకృష్ణా బీచ్ చేరుకుని అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు.

"బావా ఇందాక ఇంటి దగ్గర బయలుదేరే ముందు ఎందుకంత రెప్ప వేయకుండా నన్ను చూసావు?"

"ఈ చీర చాలా బాగుంది, కట్టుకున్న తరువాత ఇంకా బాగుంది"

"ఎవరు? చీరా? నేనా?" అని అతనిని ఇరకాటంలో పెట్టింది.

"ఏయ్ టింగరి, నేను చీర గురించి మాట్లాడుతున్నాను" అని తప్పించుకుందికి ప్రయత్నించాడు.

"ఎంత పల్లెటూరి వాళ్ళమయినా మాకూ కొన్ని అర్ధమవుతాయి బాబూ"

"సరేలే ఇంక ఆపు"

"అదిసరేగాని బావా అడుగుదామని మరచాను నిన్న అత్తయ్యగారిని 'దేవ దేవం భజే' పాడమని అడిగినపుడు 'సీతమ్మా' అని మామయ్యగారు సంభోదించారు ఎందుకు?" అని అడిగింది అనూరాధ. దాని నేపధ్యాన్ని వివరించాడు కృష్ణమోహన్. అది విన్న అనూరాధ "మామయ్యగారు చాలా చమత్కారంగా మాట్లాడతారు, ఆయన పోలికే నీకూ వచ్చింది" అంది.

ఆ తరువాత వాళ్ళ, వాళ్ళ

చిన్నతనంలో ముచ్చట్లు, అవి ఇవి కాస్సేపు కబుర్లు చెప్పుకున్నారు.
"ఏడయింది, ఇక బయలుదేరు దాము" అన్నాడు కృష్ణమోహన్.
"బావా నేను నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడుదాము అనుకుంటున్నాను" అంది అనూరాధ.
"ఏమిటది?"...అనూరాధ చెప్ప బోతూవుంటే "ఒక్క నిముషం, ఆ దుకాణంలో కాఫీ తీసుకు వస్తాను త్రాగుతూ చెబుదుగాని" అన్నాడు.
"ఒక కప్పే తీసుకురా" అంది.
కృష్ణమోహన్ కాఫీ సగం త్రాగిన తరువాత "బావా నాకు కొంచెం కాఫీ వుంచు, నేను త్రాగుతాను" అంది.
అది విని ఒక్కసారి ఉలిక్కి పడి "ఏయ్!ఏమిటిమాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?" అని కాస్త గంభీరంగానే అన్నాడు కృష్ణమోహన్.
"ఎందుకు బావా సీరియస్ అవు తావు, మా నాన్నగారి ఎంగిలి, అమ్మ ఎంగిలి, అన్నయ్యల ఎంగిలి, వాణీ, సతీష్ల ఎంగిలి నేను తినడం లేదా?" అని అడిగింది.
"మీ వాళ్ళ ఎంగిలి తినడానికి నా ఎంగిలి కాఫీ త్రాగడానికి తేడా లేదా?"
"అంటే నువ్వు నన్ను పరాయిదా నిగా భావిస్తున్నావన్నమాట"
"రాధా అర్థం లేకుండా మాట్లా డకు, నేను గతంలో ఒకసారి అనవసరమైన ఆలోచనలు చెయ్యొద్దు, నీ దృష్టి అంతా చదువు మీద పెట్టమని చెప్పా ను. నువ్వు ఇలా ప్రవర్తిస్తే ఇంక నేను మీ ఇంటికి రాను" అన్నాడు కోపంగా.
ఇంతలో అతను సగం త్రాగి ప్రక్కన పెట్టిన కాఫీ కప్పు తీసుకొని అనూరాధ ఆ మిగిలిన కాఫీని త్రాగేసింది.
కృష్ణమోహన్కి కోపం కట్టలు తెంచుకొని వచ్చింది, కానీ నిగ్రహించుకొని "నేను ఇంకెప్పుడూ మీ ఇంటికి రాను" అని అక్కడినుండి వెళ్ళడానికి లేచాడు. వెంటనే అనూరాధ అతని చెయ్యి పట్టుకొని ఆపి "నీకు కోపం తెప్పించినందుకు నన్ను క్షమించు బావా, ఐదు నిముషాలు నేను చెప్పేది విను, నేను అలా ఎందుకు చేసానో నీకు అర్థమయింది, అందుకే నామీద నీకు అంత కోపం వచ్చింది. కానీ నా మనసులో మాట ఈ రోజు నీతో చెప్పుకోనీ... మనిద్దరమూ ఏ ముహూర్తాన కలిసామో తెలియదు కాని మొదటిసారి సత్యం అన్నయ్యతో నువ్వు మా ఇంటికి వచ్చిన రోజే నీలో ఏదో ప్రత్యేకత వుందని అనిపించింది. తరువాత మనం ప్రేమ్నగర్ సినిమాకి వెళ్ళిన రోజు, క్రికెట్ మ్యాచ్ రోజు కలిసినపుడు, అమ్మకి వంట్లో బాగులేనపుడు నువ్వు వచ్చిన రోజు, నిన్ను చాలా నిశితంగా పరిశీలించాను, గమనించాను నీ గురించి విశ్లేషించాను. వాణి పరీక్షల ముందు నువ్వు వాణికి ఇచ్చిన ధైర్యం, మార్గదర్శకత్వం, పరీక్షల సమయంలో నువ్వు మాకు చేసిన సహాయం, నాకు జ్వరం వచ్చినపుడు నువ్వు చూపిన వాత్సల్యము, తీసుకున్న జాగ్రత్త, ఎదటవారికి సహాయం చేయడానికి నువ్వు చూపే ఉత్సాహం, నన్ను ఎంతో ప్రభావితం చేసాయి. నీలోని ఆమోల్పాలేకర్ లాంటి అ మా య క త్వ ం , మొ హ మాటం, ఆడవాళ్ళ పట్ల నీకున్న గౌరవభావం, నీ నిరాడంబరత, నిష్కాపట్యం నాకు నచ్చాయి. క్రికెట్ మ్యాచ్ రోజున అమ్మాయిలు నిన్ను ఆట పట్టిస్తున్నా, నిన్ను రెచ్చగొట్టినట్లు, కవ్విస్తునట్లు ప్రవర్తిస్తున్నా నువ్వు నీ నిగ్రహాన్ని కోల్పోకుండా హుందాగా ప్రవర్తించిన తీరు, ఏ విషయానికి తొందరపడకుండా ప్రశాంతంగా ఆలోచించి సమస్యకి పరిష్కారం కనుగొనే నీ తెలివితేటలు చూసి నువ్వంటే నాకు గౌరవం పెరిగింది, నీ పట్ల ఆకర్షితురాలిని అయ్యాను. ఆడపిల్లనైనా మొహమాటం లేకుండా మనసులోని మాట చెబుతున్నాను, నీ స్నేహాన్ని, సహచర్యాన్ని, సాంగత్యాన్ని కోరు కుంటున్నాను బావా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను, అందుకే నీ ఎంగిలి కాఫీ త్రాగి పరోక్షంగా నా అభిప్రాయాన్ని వెలిబుచ్చాను" అని తన ప్రేమ గురించి విపులంగా చెప్పింది అనూరాధ.
"రాధా ఏమిటి మాట్లాడు తున్నావు, ప్రేమ అంటే నీకు అర్థం తెలుసా? అసలు ప్రేమ అంటే ఏమిటో అర్థమవడానికి మన వయసు ఎంత? ప్రేమ వేరు, ఆకర్షణ వేరు. ఆకర్షణ తాత్కాలికం, ప్రేమ శాశ్వతం.
( ఇంకా వుంది)

# గడిలో దాగిన వైజ్ఞానిక నుడి

డా. చాగంటి కృష్ణకుమారి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | ■ | 4 | | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| 6 | | | ■ | | ■ | 7 | | |
| ■ | ■ | ■ | 8 | | 9 | ■ | ■ | ■ |
| 10 | | | | | | | | |
| ■ | ■ | ■ | 11 | | | ■ | ■ | ■ |
| 12 | | 13 | ■ | | ■ | 14 | | 15 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| 16 | | | ■ | | ■ | 17 | | |

**అడ్డం**

1.అత్యం త సరళమైన అమైనో ఆమ్లము. రసాయన ఫార్ములా : NH2-CH2-COOH.(3)

4.నిజము దేముడెరుగు నీరు..... మెరుగు

6. నిలువు 2 లోని అణు ఫార్ములాలో ఒక హైడ్రోజన్ పరమాణువును తీసివేస్తే లభించే ఆల్కైల్ సమూహము పేరు (3) (వెనకనుండి ముందుకి)

7.కన్నములు కలది

8.కణాలు ఏకవచనంలో (3)

10. కంటికి కనిపించే విద్యుదయస్కంత వికిరణ ప్రాంతములో పొందగలిగే వర్ణపటము (9)

11. నిలువు 9 లో దే! (వెనకనుండి ముందుకి)

12.మన్ను (3)

14. స్థంబము (3)

16 రాడిష్ Raphanus sativus (3)

17. శుద్ధి చేయనిది (3)

**నిలువు**

1. రెండు హైడ్రాక్సిల్ సమూహాలు రెండు వేరు వేరు కార్బన్ పరమాణువులతో కూడి వున్న ఆల్కహాల్ కుటుంబానికి చెందిన ఏదైని ఆల్కహాల్. (3)

2. అత్యంత సరళమైన హైడ్రో కార్బన్. ఈ వాయువును ఇంధనంగా వాడుతారు. హరితగృహవాయువుగా దీని ప్రభావము అధికము. ( 3) (కిందనుండి పైకి)

3. విద్యుదయస్కాంత వికిరణపు పరారుణ ప్రాంతములో పొందగల వర్ణ పటము (9)

4. ఆగ్లంలో జాగ్ ఫ్రూట్ అంటారు (3)

5.సొమ్ము, పైకము (3) (కిందనుండి పైకి)

8.హస్తము (3)

9.పొడి (3) (కిందనుండి పైకి)

12.మెకము (3)

13.బావి నుండి నీటిని సులువుగా తోడుకోవాడానికి అమర్చిన సాధనము (3) (కిందనుండి పైకి)

14. బృహత్తైన, సూక్ష్మము కాని. (3)

15. లంబకోణ త్రిభుజంలో లంబకోణానికి ఎదురుగానున్న చెవి

# తెలుగు పద్య రత్నాలు - 10


## ఆర్. శర్మ దంతుర్తి




రాజసూయం చేసినప్పుడు కృష్ణుడొచ్చి అడుగుతాడు, 'ధర్మజా, ఈ పని చేయొచ్చు, ఇది చేయకూడదు అనే విషయాలు ఆలోచించకుండా ఈ యజ్ఞం సమయంలో నీ ఇష్టం వచ్చినట్టూ, నన్నేం పని చేయమంటావో చెప్పు,' అని. అప్పుడు ఆయన్ని అతిథులకి స్వాగతం పలకడానికి వినియోగించి, ధర్మజుడు మనసులో అనుకుంటాడు, "భగవంతుడు నేను చేసేపనికి మెచ్చాడు, అంతకన్నా ఇంకేమిటి నాకు కావాల్సింది?" అని. యజ్ఞం పూర్తి చేసాక వచ్చిన వాళ్లలో ఒకరికి ముఖ్య అతిథిగా అర్ఘ్యం ఇవ్వాలి. ఈ అర్ఘ్యం తీసుకోవడానికి అర్హుడు తనని రాజసూయం చేయమని చెప్పి, తనకూడా పక్కనే ఉన్న సాక్షాత్తూ భగవంతుడైన శ్రీకృష్ణుడు. అయితే మొదటి అర్ఘ్యం కృష్ణుడికి ఇస్తే వచ్చిన అతిరథ మహారథులలో ఎవరికైనా కోపం రావచ్చు కనక – ధర్మం ప్రకారం యుధిష్ఠురుడు భీష్ముణ్ణి అడుగుతాడు, "తాతా నువ్వు చెప్పు ఈ అర్ఘ్యం ఎవరికి ఇవ్వమంటావు?" అని.

అప్పుడు భీష్ముడు చెప్తాడు, "ధర్మం ప్రకారం, స్నాతకుడు, సద్గురుడు, ఋత్విజుడు, ఇష్టుడు, భూపాలుడు, జ్ఞాన సంపన్నుడు, ఈ ఆరుగురు పూజింపదగినవారు. ఈ లక్షణాలన్నీ ఉన్నవారిని ఒకర్ని పూజించు," అని. ఆ గుణాలున్నవారెవరో నువ్వే చెప్పు అంటే, కృష్ణుణ్ణే చూపిస్తాడు భీష్ముడు. అయితే కృష్ణుడికి అర్ఘ్యం ఇచ్చాక ధర్మరాజు అనుకున్నట్టే శిశుపాలుడికి కోపం వస్తుంది. "ఈ గోపికల కూడా తిరిగే గొల్లవాణ్ణా నువ్వు గౌరవించినది? ఈ భీష్ముడికి వయసు వచ్చి బుర్రపనిచేయకపోతే నీకూ నీ తమ్ముళ్ళకీ ఏమైంది? ఇంతమంది వీరులం మేముండగా అందరికన్నా చిన్నవాడై, గోకులంలో వెన్న, పాలూ దొంగిలిస్తూ అల్లరి చిల్లరగా తిరిగే ఈ కృష్ణుడా నీకు కనిపించినది?" అని గేలి చేసినప్పుడు ధర్మరాజు శిశుపాలుణ్ణి పక్కకి తీసుకెళ్ళి మంచిగా మాట్లాడి సర్ది చెప్పడానికి ప్రయత్నం చేస్తాడు, రాజుల్లో కలహాల వల్ల వచ్చే యుద్ధాలూ, చావులూ గుర్తు తెచ్చుకుని.

అయితే అక్కడే ఉన్న సహదేవుడికి భర్రున కోపం వస్తుంది శిశుపాలుడు అన్నది విని. రాజసూయం చేసేది ధర్మరాజు, అర్ఘ్యం ఎవరికివ్వాలనేది ఆయనిష్టం. ఈ శిశుపాలెడెవరు మధ్యలో? ఆ కోపంలో సహదేవుడు అన్నదే ఈ నెల ఆంధ్ర మహాభారతం సభాపర్వంలో నన్నయ రాసిన పద్యం.

మా అన్న భీష్మాచార్యులని అడిగాక ఎడపక – వెనుకా-

ఉ. **ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి; మిచ్చిన దీని కిం దొడం**
**బడ మని దుర్జనత్వమున బల్కెడు వీరుల మస్తకంబుపై**
**నిడియెద నంచు దా జరణమెత్తె సభన్ సహదేవు డట్టిచో**
**నుడిగి సభాసదుల్ పలకకుండిరి తద్దయు భీతచిత్తులై**

(సభా పర్వం ద్వితీయాశ్వాసం 30)

డక, మేము అర్ఘ్యం అచ్యుతుడికి ఇచ్చాం. అలా ఇచ్చిన దానికి ఒడంబడము (ఒప్పుకోమని), దుర్జనత్వంతో పలికే వీరుడు ఇక్కడెవరైనా ఉంటే, వాళ్ల తలమీద (మస్తకంబుపై) పెట్టడానికి (నిడియెదనంచు) ఇదిగో నా పాదం (దాజరణమెత్తె) – అంటూ కాలు (చరణం) ఎత్తాడు. సహదేవుడలా అనే సరికి సభాసదుల వెన్నులో వణుకు పుట్టి ఎవరికీ మాట రాలేదు (పలకకుండిరి తద్దయు భీతచిత్తులై).

ఈ భయం ధర్మరాజుకి కూడా కలుగుతుంది, కానీ మరో కారణానికి – యజ్ఞం పూర్తవదేమోనని. కానీ అక్కడే ఉన్న భీష్ముడు మాత్రం నిర్విచారంగా కూర్చుని నవ్వుతూ చెప్తాడు యుధిష్ఠిరుడితో, "ఏమీ కంగారు లేదు, అన్నీ భగవంతుడైన కృష్ణుడే చూసుకుంటాడు," అని. ఇదే శ్రీరామకృష్ణులు చెప్పిన శరణాగతి అంటే. "ఒక చేత్తో భగవంతుణ్ణి పట్టుకుని రెండో చేత్తో ఈ ప్రపంచంలో పనులు చేస్తూ ఉండు. ఆ పని చేయడం అయిపోయాక, రెండు చేతులూ ఆయనకే జోడించు." మనం చేయవల్సినది చేసాక ఆయన చేయవల్సిన మిగతాది ఆయనే చూసుకుంటాడు.

అర్ఘ్యం ఎవరికివ్వాలని అడిగినప్పుడు భీష్ముడేం చెప్పేడు? కృష్ణుడికన్నా జ్ఞానసంపన్నుడూ, ఋత్విజుడూ, ఇష్టుడూ, సద్గురుడూ ఎవరున్నారు? ఇంత జరిగినా శిశుపాలుడు ఒప్పుకోడు. చివరకి వాడి తలపోయాక వాడిలోంచి ఒక వెలుగు బయల్దేరి కృష్ణుడిలో కలిసిపోతుంది. అది చూసిన ధర్మరాజుకి ఆశ్చర్యం వేసి అక్కడే ఉన్న నారదుణ్ణి అడుగుతాడు – "వీడు పుట్టినప్పటినుండి, పొద్దున్న నుంచి సాయంత్రందాకా కృష్ణుణ్ణి అదేపనిగా తిట్టడం, అసహ్యించుకోవడమూను, అయినా వీడు పోయాక వీడు కృష్ణుడిలో కలిసిపోవడం ఏమిటి?" అని. అప్పుడు నారదుడు చెప్తాడు, "భగవంతుణ్ణి ఎలా గుర్తుంచుకున్నాం అనేది ముఖ్యం కాదు. కామంతో గోపికలూ, భయంతో కంసుడూ, వైరంతో రగిలిపోతూ జరాసంధుడివంటి రాజులూ, బంధుత్వంతో యాదవులూ (వృష్ణులూ) కృష్ణుణ్ణి అనుక్షణం గుర్తుపెట్టుకుని ఆయన అనుగ్రహం సంపాదించారు కదా. అలాగే ఏదో విధంగా ఆయన్ని మనసులో నిరంతరం గుర్తుపెట్టుకుంటే శ్రీహరిని చేరుకోవచ్చు," అని. దీనికి ఉదాహరణగా నారదుడు హిరణ్యాకశిపుడి కథ కూడా చెప్తాడు. ఏ శత్రువు పేరైతే తాను వినకూడదనుకున్నాడో అదే పేరు – నారాయణ, హరి అంటూ ప్రహ్లాదుడు అనుక్షణం వేధించుకు తింటాడు తండ్రిని.

ఈ పద్యంలో ఉన్న మరో ముఖ్యమైన విషయం – భగవంతుణ్ణి సహదేవుడు ఎలా సంభోధించాడనేది. సహదేవుడేమంటున్నాడంటే, "ఎవరికి ఇచ్చాం అర్ఘ్యం? అచ్యుతునకి." అచ్యుతుడంటే చ్యుతి, క్షయము, నాశనము లేనివాడు. పద్యం రాసేటపుడు నన్నయ ఎంత జాగ్రత్తగా కృష్ణుడికి అచ్యుతుడనే పేరు తీసి ఎందుకు వాడాడో గమనించారా? అంటే పద్యం రాసేటపుడు విష్ణుసహస్రనామాల్లో ఉన్న ఏదో ఒక పేరు తీసి పాదంలో ప్రాస సరిపోయినట్టూ రాసేయడం కాదు. అది రాసిన పరిస్థితులకి సరిగ్గా అతికే పదం అయ్యుండాలి. అందుకే అంటారు పంచమ వేదమైన మహాభారతం గురించి – 'యదిహస్తి తదన్యత్ర యన్నే హస్తి నతద్ క్వచిత్' అని. ఇందులో ఉన్నది ప్రపంచంలో ఎక్కడో ఒకచోట ఉన్నదే. ఇందులో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు.

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంపబడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వబడును.

- సంపాదకురాలు

# బ్రహ్మవరం

**ఆదూరి హైమవతి**



అనగనగా అవంతీ రాజ్యాన్ని అయోధుడనే రాజు పాలించేవాడు. ఆయన మహాయోధుడు.ఆయన కత్తికి ఎదురేలేదు. ప్రతిరోజూ కత్తివిద్య, కర్రసామూ, విలువిద్యనూ, గదాయుద్ధాన్నీ తన ఉద్యాన వనంలో అభ్యసిస్తూ ఉండేవాడు .

ఉన్నట్లుండి అతడికి ఒక ఆలోచన వచ్చింది.'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవాని' వెంటనే మంత్రిమండలి సమావేశాన్ని ఏర్పర చాడు. తన రాజ్యంలోని సర్వజనులూ అన్ని యుద్ధ, వీరవిద్యల్లో ప్రావీణ్యులుకావాలనీ , రైతులనుంచీ మహిళలవరకూ చిన్నపెద్దా తేడాలేక అంతా ప్రతిరోజూ నగర శివార్లలోని మైదానంలో అన్ని విద్యలూ అభ్యసించాలనీ ఒక ప్రకటన చేయ మని మహామంత్రికి ఆదేశించాడు.

మహామంత్రి రాజుకు కలిగిన ఆ సంకల్పానికి కాస్త చింతిస్తూ' ప్రతి ఒక్కరూ సర్వ విద్యలూ నేర్వను సమ యాన్ని వెచ్చిస్తే ఇహ వ్యవ సాయం చేసే దెవరు, నగర కాపలాకాసేది ఎవరు , ఇతర పనులన్నీ చేసేదెవరు' అని ఆలోచించి , మహా రాజుకు ఎదురుచెప్పక 'సరేని' "మహారాజా! మన ఆస్థాన పండితులవారితో కలసి చర్చించి ఇంతమంచి కార్యానికి ఒకమంచి రోజు చూసి ప్రారంభిస్తే మంచిదని నా ఆలోచన. మీసెలవైతే పండితుల వారితో చర్చించి మీకు మనవి చేస్తాను." అన్నాడు. కాస్తంత సమయం ఆలోచించుకోను తీసుకోడం మంచిదని ఆయన భావన.

ఇదీమంచిదే అనిపించింది మహారాజుకు. " మంచిది.అలాగే చేయండి, మంచి రోజు నిర్ణయంకాగానే రాజ్యమంతా ఈ విషయం ప్రకటించి, 'ప్రతి ఒక్కరూ ఈ విద్యాభ్యాసంలో పాల్గొనాలనీ, ఇది రాజాజ్ఞ 'అనీ దండోరా వేయించండి." అని చెప్పాక మహామంత్రీ ఊపిరి పీల్చుకుని , 'ఈలోగా భగవంతుడు తనకేదైనా మార్గం చూపి, సకల రాజ్య ప్రజలను ఈ వింత విద్యా భ్యాసం నుంచీ కాపాడక పోతాడా!" అని భావించాడు.

వాడుకప్రకారం ఆరోజు సాయంకాలం మహామంత్రి, మహారాజు అయోధు నితోకలసి రాజ్యవ్యవహారాలూ, చతురోక్తులూ , తన చిన్న నాడు తన అవ్వచెప్పి న కథలూ చెప్తూ మహారాజమందిరంలోని ఉద్యానవనంలో వాహ్యాళి చేయ సాగాడు.

ఉద్యానవనంలోని రకరకాల ఫలవృక్షాలూ, పూలమొక్కలూ,- పెద్దపెద్ద చెట్లూ వాటిమీద తమ గూళ్ళుకట్టుకుని స్థిరనివాసం ఏర్పర్చుకున్న పక్షులూ ,ఉద్యాన వనంలోని పెద్ద చెఱువంత సరస్సులోని నీటిపక్షులూ అన్నీ కలివిడిగా ఉంటూ రకరకాల తమ స్వరాలతో సాయంకాలం వీనులవిందుచేస్తున్న కిలకిలారావాల మధ్య నడుస్తున్న మహారాజు " మహామంత్రీ!ఈ పక్షులన్నీ ఒకే స్వరంతో కలసి పాటలు పాడితే ఎంత అందంగా ఉంటుందోకదా! ఇలా ఈ పక్షులన్నీ వివిధ అరుపులు అరుస్తుంటే ఏమీ బాగాలేదు.అన్నీ చిలుకలాగానో, కోయిల లాగానో అరిస్తే ఆమనోహర శబ్దం ముందు ఏసంగీతమూ పనికిరాదుకదా!" అన్నాడు.

వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకునే స్వభావమ లేని మహామంత్రి , మహా తెలివిగా " మహా రాజా! మీరీ మాట అంటుంటే , చాలాచాలా కాలా నికి పూర్వం , అంటే ఈ జీవ జాతులన్నీ పుట్టే-

నాటికి జరిగిన ఒక కథ మా ముత్త-వ్వ వాళ్ళ ముత్త వ్వ నుంచీ విన్నదనీ నాకు చెప్పిన కథ గుర్తు వస్తున్నది. తమ సేలవైతే మనవి చేసుకుం-టాను." అన్నాడు. దానికి మహారాజు "అన్నట్లు మీనుంచీ కథ విని చాలా కాలమైంది , వేగి రం చెప్పండి." అన్నాడు మహోత్సాహంగా.

" మహారాజా ! ముత్తవ్వ చెప్పిన-కథ ఆలకించండి.పూర్వం ఒకానొక అరణ్యంలో మామిడి, జామ, వంటి అనేక పెద్ద పెద్ద ఫలవృక్షాల-తో పాటుగా వేప, రావి, మఱ్ఱి వంటి మహా వృక్షాలుకూడా కుండేవిట. ఒకమారు వసంత ప్రాతః కాల సమయాన పక్షులన్నీ లేచి రెక్కలు దులుపుకుంటూ ఒకరినొకరు పలుకరించుకుంటూ తమ తమ స్వరాలతో , కిలకిలారావాలు చే-స్తుండగా , గరుడ పక్షి తన స్థావరం నుంచీ వినిందిట.ఆస్వరాల ధ్వని దానికేమీ నచ్చులేదుట. 'అహో! బ్రహ్మదేవా! ఏమ య్యా నీ భావన! మేమంతా ఒకే రకం పక్షులం, మా రెక్కల రంగూ, చిన్నా పెద్ద తేడా , తిండి భేదం వంటివి వేరుకావచ్చు. మమ్ములనంతా పక్షులనే పిలుస్తా-రు . నీవలాగే మమ్మల్ని సృష్టించా-వు.ఐతే నీబిడ్డలమైన మాకంద-రికీ ఒకే స్వరం ప్రసా దించి ఉంటే మేమంతా కలసి, కమ్మని గానాల హరులతో లోకాన్నే మరపించే వారం కదా!జనావళిని మురిపించే-వారంకదా!

ఎందుకు భగవాన్ బ్రహ్మదేవా! మా-జాతికిలా ఒక్కోరకం కంఠధ్వను-లను ప్రసా దించావు?"అని వగచి వగచి , తన పక్షి జాతినంతా పిలిచి , ఆహారం, నీళ్ళూమా నేసి అంతా బ్రహ్మ దేవుని మెప్పించేలా తపస్సు చేయాలని నిర్ణయించి, అంద రినీ ఆమహా వట వృక్షపు కొమ్మలమీద చేరి బ్రహ్మ దేవుని జపించి తపస్సు మొద లు పెట్టమని ఆజ్ఞాపించిం-ది.

అన్ని పక్షులూ తమ మహారాజు మాటప్రకారం ఆవృక్షపు కొమ్మల-మీద అంతా చేరాయి.చూట్టానికి అది ఆకులున్న వృక్షంలాకాక , పక్షులు ఆవృక్షానికి ఆకుల్లా మొ-లిచినట్లూ పక్షులతో నిండిపో-యింది . అన్నీ తమతమ స్వరాలతో బ్రహ్మ నామాన్ని జపించసాగాయి. అలా కొంత సమయమయ్యేసరికి ఆస్వరాల జోరు పెద్దదై బ్రహ్మలో-కం చేరింది. తన సృష్టికార్యంలో నిమగ్నమై ఉన్న బ్రహ్మకు ఆపక్షుల అరుపులతో పనికి ఆటంకమై, తన పని కాస్తంత చేపు ఆపి' ఇదేంటో చూద్దా'మని భూలోకానికి వచ్చాడు.

అక్కడి దృశ్యంచూసి, బ్రహ్మ ,మహదాశ్చ్యంతో "ఈపక్షుల-కెంత ఐక మత్యం! వీటికోరికేంటో చూద్దాం " అని భావించి, పెద్ద కొ-మ్మమీద ఎదురుగా ఉన్న హరుని వాహనమైన గరుడ పక్షికేసి చూసి " ఓ గరుడా! ఏమి మీకోరిక? ఎందుకిలా ప్రాతః కాలం నుండీ ఆహార, జలాలు సైతం మానేసి అంతా నా నామం జపిస్తున్నారు?" అని అడిగాట్ట.

దానికా గరుడ పక్షి కళ్ళు తెరచి " ఆహా! బ్రహ్మ భగవాన్ ! మా అరు పులు మీకు కర్ణ కఠోరంగా వు-న్నందున మా అరుపులు ఆపను వచ్చారా దేవా!హే భగవాన్ ! మేమంతా ఒకే పేరుతో ఉన్న తమరిచే సృష్టింపబడినపక్షులం కదా! మాకంతా వేరు వేరు స్వరాలి-చ్చి ఎందుకు భగవాన్ భేద భావం చూపారు?

మాస్వరాల వలన మమ్ము మానవు-లేకాక జీవజాలాలన్నీ గుర్తించడం జరిగి మాకు ఆపదలు కలుగుతు-న్నాయి. మాలో మాకు విభేదాలు వస్తున్నాయి.ఓ భగవాన్ మా కంతా ఒకే విధమైన స్వరాలను ప్రసాదించి కరుణించండి.మాలో ఏకత్వమూ , ఐక మత్యమూ, నిర్భయమూ కలుగుతాయి.ఇదేమా అందరికో-రికానూ, అందుకే మీ నామ జపం చేస్తున్నాము."అని మొరపెట్టు-కుంది.

బ్రహ్మ భగవానునికి ,ఆగరుడప-క్షి చెప్పిన మాటలు, పక్షులకోరికా నిజమని పించాయి.వెంటనే " ఓ గరుడా! మీరు ఏకోరికతో తపస్సూ, నా నామ జపం చేస్తు న్నారో నాకు అవగతమైంది. మీకోరిక నాకు సమ్మతంగానే అనిపిస్తున్నాయి. కనుక మీలో మీరు చర్చించు-కుని, అందరి ఆమోదంతో ఒక పక్షి స్వరాన్ని ఎంచుకోండి.ఆపక్షి మీఎదుట నిలిచి తన స్వరా-న్ని మీకు విని పిస్తుంది.మీరంతా ఏకాగ్రతతో ఆస్వర శబ్దాన్ని అనుస-రించి పలకండి ఇలా ఒక ఘడియ కాలం చేయగానే మీకు అందరికీ ఆపక్షి స్వరం వచ్చేస్తుది. ఘడియ లోగా మీరు ఏ స్వరం అందరికీ కావాలో నిర్ణయించుకోలేకపోతే నా వరకాలం ముగుస్తుంది. మరలా మీరు పిలిచినా నేను రాలేను. "అని బ్రహ్మ వరం ఇచ్చాడు.

"హేభగవాన్ ! మీకృపకు సంతోషం. ఐతే మేము విచక్షణాజ్ఞానం లేని పక్షులం కదా!మాకు ఏదిమంచి-దో ఏదికాదో తెలీదు. అందువల్ల ఒకేఒక మారుకాక మాకు మూడు అవకాశాలు ఇవ్వండి.మాలో మూడు పక్షుల స్వరాలను మేము ఎంపిక చేసుకునే అవకాశం కల్పిం-చండి .మరలామరలా మిమ్ము మా జపతపాలతో విసిగించకుండా మీ పనికి భంగం కలిగించకుండా ఆశీ-ర్వదించండి." అని ప్రార్ధించింది గరుడ పక్షి.

దానికి బ్రహ్మ భగవాన్ అంగీకరించి తనలోకానికి వెళ్ళిపోయాడు.

వెంటనే గరుడ పక్షి అందరినీ నేలమీద సమావేశపరచి " ప్రియ పిట్టలారా! మన జపతపాదులు ఫలించాయి. మీరంతా నామాట విని జపం చేయడం మన ఐకమ త్యానికి చిహ్నం.అదే బ్రహ్మ భగ-వానుని మన దగ్గరకు తెచ్చింది. మీరంతా ఐక్యం గా బ్రహ్మ దేవుని వరాన్ని ఫలింపజేసుకోను ఏపక్షి స్వరాన్ని కోరుకుంటారో చెప్పండి." అని చెప్పింది.

పక్షులన్నీ ఒకరినొకరు చూసుకుంటూ కూర్చున్నాయి.

గరుడపక్షి "ప్రియ పులుగులారా!-మనకు బ్రహ్మ ఇచ్చిన వరం కాలం ముగియక ముందే మనం వరాన్ని సఫలం చేసుకోవాల్సి ఉంది.కనుక వెంటనే మీమీ అభి ప్రాయాలు చెప్పండి" అంది.

కొన్ని పక్షులు , "కమ్మని కోయిలస్వ-రం" అనగానే , కోయిలలు గర్వంగా తలలెత్తి పైకిలేచి ఎగిరాయి. అది చూడగానే మరికొన్ని పక్షులు " చిలక పలుకులు మా కిష్టం " అన్నాయి. వెంటనే చిలుకలు 'కలకల ' లాడుతూ పైకి ఎగిరాయి. నైటింగేల్,భరద్వాజపక్షి, పాడే-పక్షులు [ హమ్మింగ్ బర్డ్స్ ] ఇలా ఒకదాని తర్వాత ఒక పక్షులపేర్లు, మిగతా పక్షులు చెప్పగానే అవి పైకి లేచి గర్వంగా ఎగరడం ప్రారం-భించాయి. సభ అంతా అయో-మయంగా మారింది. ఒక్కో పక్షి-జాతీ మా స్వరం బావుంటుందంటే మాస్వరం బావుంటుంది.'

' అంతా మా స్వరాన్నే కోరుకుంటా-రు, '

' మాపాటే బావుంటుంది '

'మాస్వరమే సులువుగా అందరికీ వస్తుంది" అంటూ గోలగోలగా అర-వసాగారు.

సభ కకావికలైంది. ఇంతలో బ్రహ్మ ఇచ్చిన సమయం పూర్తైనట్లు ఒక స్వరం వినిపించింది.

"మీకిచ్చిన సమయం ఐపోయింది. భగవతుడు ఒక్కో పిట్టకేకాదు, ఒక్కోమనిషికీ, ఒక్కో జంతువుకూ వేరు వేరు రూపాలూ, స్వరాలూ,పా-టవము ఇస్తాడు. అన్నీ ఒకే స్వరంతో ఉంటే మీరు ఎవరో ఎవ్వరూ తెల్సు-కోలేరు. మీ మీ జాతుల గుర్తింపు పోతుంది.మానవులు కూడా అంతే. ఎవరు చేసే పని వారు చేయాలి. ఒక్కొరూ ఒక్కోపని చేయడంలో నైపుణ్యం కలిగి ఉంటారు. అంతా ఒకేలాగా ఒకేపని చేస్తే సృష్టిలో మిగతా కార్యాలన్నీ ఎవరు చేస్తారు? అందుకే భగవంతుడు బాగా ఆలో చించి ఒక్కొరికీ ఒక్కో కళ ఇచ్చాడు. దానిలో నైపుణ్యం సం-పాదించాలి కానీ అంతా ఒకేపని చేయడం, ఒకేలా అరవడం వల్ల సృష్టిలో వైవిధ్యం పోతుంది. అందం చెడుతుంది.ఐనా మీలో మీకు ఐకమత్యం లేదు. మీ వర సమయం ఐపోయింది" అంటూ ఆస్వరం ఆగిపోయింది.

గరుడ పక్షి సభచాలించి "వెళ్లండి. ఎవరి స్వరం వారిదే. వెళ్ళి ఇహ ఆహారాదులు తినండి" అని చెప్పి ఎగిరిపోయింది.

"మహారాజా! మా ముత్తవ్వ చె-ప్పినకథ ఇది.అందుకే ప్రాతః కాలంలోనూ , ఇప్పు డు మనం వినే పక్షుల కిలకిలారావాలు ఒక్కో-విధమగా ఉండటం జరిగిందట. అనిచెప్పాడు.

మహారాజు "నిజం మహా మంత్రీ! నేను నా మనసు మార్చుకుంటు-న్నాను. మన ప్రజలెవ్వరూ అన్ని రకాల యుద్ధవిద్యలూ నేర్చుకో-నక్కరలేదు. ఎవరైతే మన సేనలో చేరాలని కోరుకుంటున్నారో , అలాంటి యువకులను మాత్రమే ఎంపిక చేసి వారికి మాత్రమే మనం శిక్షణ నిద్దాం "అంటూ విహారం చాలించి అంతః పురంకేసి నడిచాడు. మహామంత్రి కూడా సెలవు తీసుకుని ' తన బామ్మ చెప్పి నకథ 'తన వ్యధ పోగొట్టినం-దుకు సంతసిస్తూ తన గృహాని కేసి సాగాడు.

ఇదర్రా పిల్లలూ! జీవన వైవిధ్యాన్నీ, ఒకరితో ఒకరు పోల్చుకోక ఎవరి రూప, స్వర, సామర్ధ్యాలను వారి పాటవాలనూ వారు మెరుగుప-రుచుకుంటూ జీవిం చడంలోనే ఆనందాన్నీ, విజయాలనూ పొందా లి. సరేనా మరి!

# మా ఊరి నందుల ఆత్మీయ కథ

## నందుల ప్రభాకర శాస్త్రి



(గత సంచిక తరువాయి)

### సంగీతం

భారతదేశంలో సంగీత విద్వాంసులు, ఆయుర్వేద భిషగ్వరులు అనేకమంది తమ జీవితకాలం వెచ్చించి, సాధించిన పాండిత్యం అంతా తమతోనే పోవాల్సిందేగానీ ఇతరులకు పంచరు. అలా పంచితే.... అది కేవలం రక్త సంబంధీకులకు మాత్రమే ఉంటుంది. సర్వసాధారణంగా పండితపుత్రులు 'శుంఠలు' గానే మిగిలిపోతారు. తమ జీవితకాలపు శోధన, సాధన తమతో అంతమైనా పరవాలేదు గానీ అది ఇతరులకు అందకూడదు.

అందుకే అనేక పరిశోధనలు ఆయుర్వేదంలో, సంగీతంలో జరిగినా అవి తదుపరి వారికి చాలా భాగం అందకుండానే అంతరించిపోయాయి.

భాకరాపేట సంగీతానికి నిలయం. ఇరవైకి పైననే నాయీ బ్రాహ్మణుల ఇళ్ళు. అందరూ కేశవ నారాయణస్వామి భక్తులు. ఇందులో సగానికి పైనే 'లోడుగు' కుటుంబాలు. అది వారి ఇంటిపేరు. పది కుటుంబాల్లో ఇంటికి ఎనిమిది పదిమందికి తక్కువ లేకుండా పిల్లలు. ఆడపిల్లలు అయితే కేశమ్మ, మగపిల్లలు అయితే కేశన్న.

మరి ఇంతమంది కేశన్నలను గుర్తుపెట్టుకోవటం ఎలా? అందరికీ ఏదో ఒక విశేషణం తగిలిస్తారు. పెద్దవాడైతే పెద్ద కేశన్న, చిన్నవాడైతే ..చిన్న కేశన్న, లావుగా ఉండే దుబ్బా కేశన్న, పొట్టిగా వుండే పొట్టి కేశన్న..... ఇవి కాకుండా పడిగె కేసి, మున్నోడు, కుంతోడు, ఊసన్న, సంతోడు ఇలాంటి పేర్లతో కూడా పిలిచేవారు. ఇప్పుడు పద్ధతి మార్చి 'కేశవ' కు పర్యాయపదాలైన విష్ణు సహస్రనామము లోని పేర్లు పెట్టుకుంటున్నారు.

ఈ నాయీబ్రాహ్మణుల ఇండ్లలో చాలా భాగం వరకు, మరీ ముఖ్యంగా 'లోడుగు' కుటుంబ సభ్యులంతా నాదస్వరం లేదా క్లారినెట్ వాయించేవాళ్ళు. పురందరదాసు, అన్నమాచార్యులు, భక్త రామదాసు, శ్యామశాస్త్రి, త్యాగరాజు, నారాయణతీర్థులు, క్షేత్రయ్య లాంటి సంగీత వైతాళికులు ఈ కుటుంబాల్లో నిత్యం వెలసిల్లుతుంటారు.

గీతాలు, స్వర పల్లవులు, స్వరజతులు, వర్ణాలు, కీర్తనలు, కృతులు, అష్టపదులు, తిల్లానాలు స్వరప్రవాహాలై ప్రవహించి మంగళంతో శాంతిస్తూ ఉంటాయి ప్రతిదినం.

వేంకటేశ్వర సుప్రభాతంలో వచ్చే రాగమాలికలన్నిటినీ ప్రతిదినం సాధన చేస్తూనే వుంటారు.

మిగతా కుటుంబాలు, డోలు వాయిద్యం నేర్చుకుంటారు. అన్ని



తాళాలు లయబద్ధంగా పలుకుతూనే ఉంటాయి.

పిల్లలు, పెద్దలు ఎప్పుడూ నోటితో కూడా అదే సాధనలో నిమగ్నమై వుండేవాళ్ళు. కొంత వ్యవసాయం, కొంత నేతపని కూడా చేసేవారు. చీరలు, పంచెలు నేయటం కూడా వారి ద్వితీయ వృత్తిగా వుండేది. ఏ సంగీతం అబ్బకుండా వుంటే శృతి వాయించేవాళ్ళు (సుతి).

అన్ని విద్యలూ సక్రమంగా వున్నా సరైన ఆదరణ, పెద్ద మనసులు లేక అందరూ ఉదర పోషణార్ధం బద్వేలుకు, కలసపాడుకు, పోరుమామిళ్ళకు పొట్ట చేత పట్టుకుని తరలిపోయారు. సరైన ఆదరణ వుంటే భాకరాపేటలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంగీత విశ్వవిద్యాలయం వెలసి వుండేది.

## భజన మండలి

రాముని దేవళంలో ప్రతిరోజూ సాయంకాలం ఒక గంట సేపు 'భజన' జరుగుతుంది. ఈ భజన మండలికి పెద్దదిక్కు పెద్ద కేశన్న (తరువాత ఈయన్ను అద్దాలకేశి అని పిలిచేవారు). కంటి చూపు సన్నగిల్లటంవల్ల కంటి అద్దాలు మొట్టమొదటిసారిగా భాకరాపేటలో వాడింది ఈయనే.

ఈయన సంగీత భాండాగారం. తెలియని విషయం లేదు. పరిశోధించని అంశం లేదు. ఎంత కఠినమైనా దానినైనా సాధించగల సత్తా వుండేది. ఆరోజుల్లోనే తెనాలి నుండి వచ్చేవారు నాదస్వరం నేర్చుకోవటానికి. ఈయన కుమారులు, కుమార్తెలు కూడా సంగీతాన్ని బాగా వంటపట్టించుకున్నారు. ఈయన ఒకరోజు ఉదయాన్నే రాత్రి వండిన సంకటి కుండను కడుగుతూ వుంటే తెనాలినుండి వచ్చిన ఓ వ్యక్తి కేశవయ్య ఇల్లు ఎక్కడ అని అడిగితే ...నేనే అన్న సమాధానం విని నివ్వెరపోయారట.

గండపెండేరం తొడిగించుకుని ఏనుగుపై ఊరేగవలసినంత పాండిత్యాన్ని నిత్యం మోస్తూ మారుమూల గ్రామంలో ఇంత సౌమ్యంగా వున్న మనిషిని చూచి నివ్వెరపోరా మరి? కీ ఇస్తే తిరిగే గడియారంలా డబ్బు ఆశ చూపి ఈయన్ను ఎవరూ పాడించలేరు. రసాస్వాదన కొరకు బ్రతికిన మనిషి. నాదస్వరం కోసం సర్వస్వం అర్పించిన మనిషి.

నాదస్వర మర్మాలు ఇతరులకు తెలియజేప్పలేక విద్యార్థులకు పుత్ర వాత్సల్యంతో విద్య చెప్పలేక, పుత్రులకు చెప్పినా సర్వస్వం అందుకోలేక... అందుకే అన్నారు...'అన్నీ సరిగా వుండివుంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సంగీత విశ్వవిద్యాలయం వెలసివుండేది భాకరాపేటలో' అని.

ఈ కేశన్న భజనమండలికి సారథి. స్వచ్ఛ మైన ఉచ్చారణ, నిబద్ధమైన సంగీతం, లయ తప్పని తాళం, భజన 'భజించటం కోసమే ... భుజించటం కోసం కాదు' అన్న సత్యం తెలిసిన మనిషి. పారవశ్యంతో త్యాగరాజు కీర్తనలు, రామదాసు కీర్తనలు పాడుతూ వుంటే ... మిగతా సంగీత విద్వాంసులు, సంగీత ప్రియులు కూడా గొంతు కలిపేవారు.

సంగీతం రాణి 'మన్నెం సీతన్న' లాంటి వాళ్ళు 'చంద్రమ్మ గారి సుబ్బన్న' లాంటి వాళ్ళు కూడా ఇందులో భాగస్తులే.

(ఇంకా ఉంది)



## తెలుగులో దక్షకవి,దేశవిదేశీయ అనువాదకవి



# నాగరాజు రామస్వామి

తుమ్మూరి రాంమోహన్ రావు

“అనుభూతి మాంత్రికతలో
తలమునకలవడం అలవడితే
చీకాకు లోకం చిద్విలాస రసనాక
మౌతుంది” రసయోగం అనే ఒక కవితను ఇలాముగిస్తాడు కవినాగరాజు రామస్వామి.

“నీవు ఈ వైవిధ్య వైరుధ్య జీవనపర్యావరణంలో
విలక్షణ జీవనసౌగంధ్యమై సురభిళీకరించే
ఓ విశిష్ట ప్రణ పంకజానివి
దర్శించు
నాలోనే ఉన్న ఆ పరిమళాల ప్రపంచాన్ని”

అంటారు తన తొలి స్వీయకవితా సంపుటి ‘ఓనమాలు’ లోని మరో కవితలో.

2012 లో వెలువడ్డ ఈ పుస్తకానికి తిలకం దిద్దుతూ అక్షరాలు-అమృతత్వం పొందే అక్షయాకృతులు
పదాలు-పరమార్థాలై పరచుకునే
పరమపదాలు
శబ్దాలు-భావసింధువులై పొంగే వాగ్బిందువులు రసఝురులు
ఓనమాలు-ఓం నమః లయ్యే శ్రీకారాలు అంటాడు.

విచిత్రం ఏమిటంటే నాగరాజురామస్వామి తన డెబ్బైమూడవ ఏట తన తొలిపుస్తకం అచ్చువేయటం.అంటే వీరు చాలా ఆలస్యంగా కవిత్వం రాయటం మొదలుపెట్టారనుకుంటే పప్పులో కాలువేసినట్టే. దరిదాపు అరవై ఏళ్ల క్రితమే ఆయన కలం పట్టారు. అప్పట్లోనే ప్రౌఢమైన కవిత్వం రాసేవారు.నాకు బాగా గుర్తు వారి కవిత మా బడివార్షికసంచిక ‘వాసంతి’ లో ప్రచురితమైంది.నాగరాజు రామస్వామిగారి జన్మస్థలంఎలగందుల.మా ఊరి వారే.కనుక నాకు చిన్నప్పటినుంచే తెలుసు.నేను ఐదులోనోఆరులోనో ఉన్నప్పుడు ఆయన మా బడిలో



ఓ ఏడాది పాటు ఉపాధ్యాయులుగా చేశారు.అది ఆయన తొలి ఉద్యోగం.విశ్వనాథ సత్యనారాయణగారుకరీంనగర్ రాజరాజేశ్వర కళాశాల ప్రిన్సిపాలుగా ఉన్న సమయంలో వారు బి.ఎస్సీ. చదివారు.కనుకవారిపై విశ్వనాథ ప్రభావం ఉంది. మలి ఉద్యోగం సమితి స్థాయి సంఘిక సంక్షేమశాఖలోవిద్యాధికారిగా పనిచేస్తూ వృత్తిపరంగా ఆరునెలల పాటు శాంతినికేతన్ లో శిక్షణపొందటం వారి కళాభిజ్ఞతకు
మరింత పుష్టి దొరికింది.కానీ ఆయన తనదీవితం మరలా విద్యవైపుకు మళ్లించుకునిఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివి ఎలక్ట్రికల్ ఇంజనీయరుగా కొత్త ఉద్యోగంలో చేరారు.

అక్కడినుండి ఆదిలాబాదు జిల్లా కాగజ్ నగర్ సర్సిల్కు మిల్లులో చేరారు.అక్కడ ఆయనపనిచేసే కాలంలోనే డిగ్రీ పాసయిన నేను వారి ద్వారా అదే కంపెనీలో కెమిస్టుగాచేరాను.కాని కొన్ని నెలలకే ఆయన అక్కడనుండి నైజీరియా వెళ్లడంతో మళ్లీ చాలా కాలంపాటు వారిని కలుసుకునే అవకాశం కలుగలేదు.అలా. 1976 లో వెళ్లినవారు 2002 వరకు నైజారియా,ఘనా,ఓమాన్,సౌదీఅరేబియాలలలో పనిచేశారు.అలా పని చేస్తున్న సమయంలోనే ఉద్యోగరీత్యా మరియుపర్యాటకునిగా జర్మనీ,ఇటలీ,-స్విట్జర్లాండ్,ఫ్రాన్స్,అమెరికా వంటి దేశాలు సందర్శించారు.ఒకవైపు ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తూనే తనకత్యంత ప్రీతి దాయకమైన

సాహిత్య రంగంలో కూడావిశేష-మైన కృషిచేయడమే గాక పలుదే-శాల సంస్కృతి,సాహిత్య అధ్యయ-నాలుచేశారు.తెలుగు సాహిత్యం పై మంచి పట్టు కలిగిన ఆయన ఆంగ్ల సాహిత్యం పై పట్టుసాధించి అనువాద ప్రక్రియ చేపట్టారు.అలా పాతిక సంవత్సరాలు ఆయన మా-తృభూమికిదూరంగా ఉండటంతో చాలా ఆలస్యం తన పుస్తక ప్రచు-రణ చేసుకనే అవకాశం చిక్కింది.

1939 సెప్టెంబరు 9 న కరీంన-గర్ జిల్లాలోని చారిత్రక గ్రామం లో జన్మించిన నాగరాజురామస్వామి గారికి ఇప్పుడు అశీతి నడుస్తు-న్నది.ఓనమాలుతో మొదలయిన వారికి పుస్తక ప్రచురణాప్రస్థానం ఇప్పటివరకు పదిహేను సంఖ్యకు చేరుకున్నది.ఇందులో నాలుగు స్వీయకవితాసంపుటులు ఓనమా-లు,గూటికి చేరిన పాట, ఎదపద-నిసలు,విచ్చుకున్న అక్షరం,అను-వాద సంపుటులు ఎనిమిది.అవి అనుధ్వని,అనుస్వరం, ఈ పుడమి-కవిత్వంఆగదు (జాన్ కీట్స్ కవితల అనువాదం),రవీంద్రగీత(గీతాంజ-లి),సూర్యశిల(ఆక్టేవియోపాజ్),క-ల్యాణగోద,అనుస్వనం,పురివిప్పిన పొరుగు స్వరం.ఇవి కాక ఆంగ్లంలో ఒకస్వీయకవితా సంపుటి ది వింగ్స్ అఫ్ మ్యూజింగ్స్,ఒక అనువాదం ద వాయిడ్ ,తెలుగులో అనువాద అనుభవాలు (వచనం) రాశారు.
అపారమైన భాషాపరిజ్ఞానం కలిగిన వీరి స్వీయకవితలలోగాని,అను-వాద కవితలలోగానివిశిష్టపదాలు ఆభరణంలో మెరిసే రత్నాల్లా మె-రుస్తూ,పాఠకుడిని మురిపిస్తాయి.
ప్రపంచ సాహిత్యంపై పట్టు ఉండటమే గాక,అద్వితీయమైన భావనాగరిమ గల వీరిఅనువాదా-లు స్వీయకవితలే అన్నంతగా భ్ర-మింపజేస్తాయి.మెక్సికన్ నోబెల్ పురస్కార గ్రహీత ఆక్టేవియోపాజ్ ఆంగ్లానువాదం సన్ స్టోన్ ను తె-లుగులోసమర్థవంతంగా 'సూ-ర్యశిల'గాఅనువదించిన వీరి ఆత్మబలం ఒక్కటి చాలు వీరికి ఆంధ్రాంగ్లాల్లో ఎంత సాధికార-తఉన్నదో తెలియజేయడానికి. మూలకవి హృదయగత భావాన్ని ఆకళింపుచేసుకుని,మూలకావ్య సాంస్కృతిక,సామాజిక నేపథ్యాలను కూలంకషంగా అర్థంచేసుకుని,క-వితారీతుల్ని కరతలామలకం చే-సుకుని,తూగు చెడకుండా,రసర-మ్యంగాఅనువదించటం అందరికీ సాధ్యమయ్యే పనికాదు.అదీ ఉద్యో-గానికీ,సద్యోగానికీసంబంధం ఎం-తమాత్రం లేని వ్యక్తి చేయడమంటే కత్తి మీది సామే.రామస్వామి గారికి ఆకత్తి మీది సాము అంటేనే ఇష్టం. అలాగే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జాన్ కీట్స్ కవిత్వాన్ని ఈపుడమి కవిత్వం ఆగదు అన్న పేరుతో అనువదిం-చడం కూడా అలాంటిదే.ఇక భార-తీయకవిత్వంలో 'గీతాంజలి' ఒక విశిష్ట గ్రంథం.ఇప్పటివరకు సా-హిత్యంలో నోబెల్ పురస్కారంపొం-దిన ఏకైక కవి రవీంద్రనాథ్ ఠాగోర్ విశ్వకవి బిరుదాంచితుడు.ఆయన గీతాంజలి అనేక భాషల్లోఅనేక-మంది చేత అనూదితమైంది.ఒక్క మన తెలుగులోనే దాదాపు వంద-మందిఅనువదించారు.అయినా 'మరలనిదేల రామాయణంబన్న' చందాన,ఆరు నెలలపాటుశాం-తినికేతన్ లో గడిపిన స్వానుభవ సహజానుభూతితో గీతాంజలి-ని రవీంద్రగీతగాఅనువదించారు నాగరాజు రామస్వామి.అనువాదం చదువుతుంటే రామస్వామిలోర-వీంద్రు కవీంద్రుడు ఆవేశించినట్లు తోస్తుంది.లలిత లావణ్య సుందర పదబంధాలుగీతాంజలి ఔన్నత్యా-నికి అద్దం పడతాయి.వీరి ఇతర అనువాద సంకలనాలు అనుధ్వని, అనుస్వరం,అనుస్వనం,పురివి-ప్పిన పొరుగు స్వరం ప్రపంచ ప్రసిద్ధ కవితల అనునాదాలుగా చెప్పవ-చ్చు.

చిన్ననాటనే పలుకావ్యాలు పఠించిన నేపథ్యం,పొందిన కావ్య-నందం వీరిలోనిభావుకుణ్ని తట్టి-లేపి స్వీయకవితలను వెలువరింప జేసాయి.వీరి ఓనమాలు గాని,-గూటికిచేరిన పాట గాని,ఎదపద-నిసలు,విచ్చుకున్న అక్షరంగానీ చదువుతుంటే వీరి ఎనభైసంవ-త్సరాల సాహిత్యైకజీవనం ద్యోత-కమవుతుంది.జీవితం లోని అన్ని దశల,అన్నిఅనుభవాలను కవితా-త్మకంగా అక్షరీరించటం గమనించ వచ్చు.

దురదృష్టమేమంటే చాలాకాలం వీరు మాతృభూమికి దూరంగా ఉండి ఉద్యోగవ్యగ్రతలోఉండ-టం వల్ల వీరి రచనలు సకాలంలో తెలుగు పత్రికలలో చోటు చేసుకో-లేకపోయాయి.తన జీవిత వజ్రోత్స-వం తర్వాతగానీ వీరి సాహిత్యకృషి వెలుగులోకిరాలేకపోయింది.కానీ అచిర కాలంలోనే అంతర్జాలం పుణ్యమా అని ఇప్పుడు నాగరాజు-రామస్వామి గారు లబ్ధప్రతిష్ఠుల సరసకు చేరుకున్నారు.

# కారణజన్ముడు



ఎలెక్ట్రాన్

మనిషి జీవితంలో మూడు రోజులు ముఖ్యమట. పుట్టిన రోజు మొదటిది. అది మనిషి చేతుల్లో ఉండదు. ఎవరింట్లో ఏ రోజున ఏ తల్లి కడుపునుంచి పుట్టాడో తెలియదు. అలాగే ఆఖరి రోజుకూడా. మరణం ఎప్పుడు, ఎక్కడ, ఎలా సంభవిస్తుందో తెలియదు. అది మూడో రోజు. మరి ఆ రెండో రోజు? అది జననమరణాల మధ్యనున్న రెండో రోజు! మనిషి తను ఎందుకు పుట్టాడో తెలుసుకొన్నరోజు! ఇది విజ్ఞుల, తత్త్వవేత్తల వాక్కు. ఈ విషయమై గౌతమ బుద్ధుడొక చారిత్రక నిదర్శనం.

అయితే ప్రతిమనిషి జీవితంలోనూ ఈ రెండో రోజు ఏదో ఒక రోజున సంభవిస్తుంది. అక్కణ్ణించే మనిషి అసలైన జీవితం ప్రారంభమౌతుంది. రాజారావు ఓ దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. తండ్రి కౌలు వ్యవసాయం చేస్తూ నలుగురు సంతులోనూ పెద్దవాడైన రాజారావుని మడివనుల్లోకి కాకుండా బడిచదువులకి పంపాడు. రాజారావు చిన్నప్పట్నుంచి మితభాషి. స్నేహబృందం తక్కువ. వైరబృందమనేది లేదు. బి.ఏ. బి.యిడి చేసినా, ఉపాధ్యాయ అర్హత పరీక్షలో అర్హత సాధించినా ఉద్యోగం రాలేదు. తన లేదా తమ ఉన్నతికి అవరోధం కలిగించేది ఇతరులే అన్న భావన మనసులో నాటుకుపోయినప్పుడు మనిషి ప్రవర్తన పరివర్తన చెందుతుంది. నిరాశా, నిస్పృహలతో సన్యాసం వైపు దారి తీయడమో, జీవితానికి స్వస్తి పలికేయడమో జరుగుతుంది. లేదా ద్వేషం రగులుకొని సమాజం మీద విరుచుకు పడడం జరుగుతుంది. సమాజంలోని సమూహాల తీరు కూడా ఈ భావనలకి అతీతం కాదు.

అర్హత సాధించిన ఇద్దరు పాతికేసి వేలు లంచం ఇచ్చి టీచరు ఉద్యోగం సాధించినప్పుడు రాజారావుకి వారిమీద విపరీతమైన కోపం వచ్చేసింది. అప్పుడు రాజారావుకి తానెందుకుపుట్టిందీ, అందుకు తానేం చేయాలన్న జ్ఞానం కలిగింది. సమాజంలో పాపం పండిపోయినప్పుడల్లా ధర్మసంరక్షణార్థం దేముడు అవతరిస్తాడని గీత చెబుతుంది. ఆ అవతారాపురుషుడు తానే ఎందుకు కాకూడదని రాజారావు ప్రశ్నించుకొన్నాడు. అది అతని రెండో రోజు.

ఆ యిద్దర్నీ కలుసుకొని,. 'అందరూ కలిసి ఆందోళన చేస్తే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. రాష్ట్రాల విభజన జరిగింది. అర్హత సాధించిన ఘటాలకి ఉద్యోగాల ఉత్తర్వులు ఎంతకాలమని ఆపగలుగుతారు? యిప్పుడు మీరిచ్చిన లంచాలతో అదే అలవాటైపోతుంది!" అంటూ ఘర్షణకి దిగాడు.

"లంచాలే యిచ్చే ఆర్థిక స్తోమత కనక ఉంటే ఈ బోడి చదువులెందుకు చదివేవాళ్లం? ఒళ్ళు కొవ్వెక్కి ఆ లంచాలివ్వలేదు. మా మీద తల్లిదండ్రులెంతో ఆశలు పెట్టుకొన్నారు. ఇల్లు గడవడం కష్టమైపోతోంది. అప్పుచేసి లంచాలిచ్చాం. బాకీ తీరేవరకూ ప్రతి నెలా సగం జీతం అప్పిచిన వారికివ్వాలి. ఏం చెయ్యమంటారో చెప్పండి? అయినా అర్హతల జాబితాలో మీ కన్నా పైనే ఉన్నాం. అందుకని మీకు మేము చేసిన అన్యాయం ఏమీ లేదు!"

"లేకపోవచ్చు. లంచాలకి నీరు పోస్తూ సమాజానికి అన్యాయం చేస్తున్నారు! సమాజ స్వరూప స్వభావాలు మారిపోతే చట్టవిరుద్ధమైనా వరకట్నసమస్య కొనసాగుతున్నట్టుగానే, కరకట్నం కూడా కొనసాగుతుంది!"

"అర్హత జాబితాలో మా పైన అరుగురున్నారు. మీరు మా కన్నాదిగువగా నాలుగో స్థానంలో ఉన్నారు! ఉత్తర్వులు రాకపోయినా మా పై అరుగురికీ రాని కోపం మీకు రావడంలో అర్థం లేదు!

మా బ్రతుకుతెరువు మార్గం మేం ఎన్నుకొన్నాం. కోపాలు తెచ్చుకొని, రభస చేసి మా కడుపులు కొట్టకండి. మా కిప్పుడు ఉద్యోగాలు వచ్చాయి కాబట్టి విద్యార్థులకి సదాశయాల్ని గురించి ఎన్నయినా చెప్పి, ఆదర్శ గురువులని పేరు పొందడానికి ప్రయత్నిస్తాం. అవి అలవి కాని ఆశయాలేనని విద్యార్థులు భావిలో తెలుసుకొంటే దానికి బాధ్యత....?"

రాజారావుకి తిరుగు సమాధానం చెప్పడానికి వెంటనే సమాధానం దొరకలేదు. తనుమట్టుకు రెండుసార్లు తిరుపతి ప్రయాణంలో టికెట్ కలక్టర్లకి చేతులు తడిపి బెర్త్ సంపాదించలేదూ? దేవస్థానం వాళ్లే అధికారపూర్వకంగా అమ్ముతున్న శీఘ్రదర్శనం టికెట్లు మూడేసి వందలు పెట్టి ఓపికలేని నాయనమ్మకీ, తనకీ కొనలేదూ? రెండేసి వేలు తీసుకొని ఓట్లు వేసే జనం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయటల్లేదూ? గోడలు దూకి కండువాల రంగుని మార్చుకొనేవాళ్లు పదవులు సాధించటల్లేదూ? నిస్సహాయతతోకూడిన కోపం దేహంలోని నరనరాల్లోనూ ప్రవహిస్తోండగా అక్కణ్ణుంచి కదిలాడు.

తండ్రి కౌలు వ్యవసాయంచేసే భూముల యజమాని రామచంద్రం వద్దకు వెళ్ళి, సంగతి క్లుప్తంగా చెప్పి,"మీకు పలుకుబడి ఉంది. మండలాఫీసులో ఓ మాట పడేస్తే నాకు ఉత్తర్వులొచ్చే అవకాశముంటుంది." అని రాజారావు అర్థించాడు.

"జాబితా మధ్యలో ఉన్న ఇద్దరికి ఉత్తర్వులు వచ్చాయంటున్నావ్. పైవాళ్ళకి ఎందుకు రాలేదో కనుక్కోవాలికదా? ముందుగా వాళ్లే మండలవాసులో తెలుసుకొని, ఆ మండలంలోని పెద్దమనుషులచేత ముల్లు కర్రతో పొడిపించాలి. ఏదో మీ అందరి మధ్యా కాస్త మంచి పేరున్నా, నాకు రాజకీయమైన పలుకుబడిలేదు. అయినా మండలాఫీసులో పనిచేసే ఒక గుమాస్తా నాకు తెలుసు. వివరాలు తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను. ఎల్లుండి రా," అన్నాడాయన.

అన్నట్టుగానే రామచంద్రం ఆరాలు తీయించాడు. పై అరుగురిమీద ఏవో కొర్రీలు పెట్టి వాళ్ళ ఉత్తర్వులు ఓ పక్కన పెట్టారని తెలిసింది. మొత్తం అనుమతించిన ఖాళీలు యిరవై అయినా పదిమందికే ఉత్తర్వులిమ్మని ఆదేశాలొచ్చాయట! పైనున్న ఆరుగురి విషయం తేలేదాకా, ఓ యిద్దరికి మట్టుకే ఉత్తర్వులిమ్మని ఆదేశాలొచ్చాయట! ఈ వివరాలు రాజారావుకి చెప్పాడు.

వారం రోజుల తర్వాత జిల్లా విద్యాశాఖలో స్థాయి చిన్నదైనా కీలకమైన కుర్చీలో పనిచేస్తున్న శ్యామలరావుకి ఓ బెదిరింపు లేఖ వచ్చింది. రెండు రోజుల్లోగా శ్మశానవాటికపక్కనున్న చింత తోపులో ఉన్న రేకుల షెడ్ లో ఏభైవేల రూపాయలతో ఉన్న సంచి వదిలి వెళ్ళమని. పోలీసులకి చెప్పినా, డబ్బుసంచి చెప్పినచోట ఉంచకపోయినా తల తెగిపోతుందని సారాంశం. శ్యామలరావు శతవిధాల ఆలోచనలో పడ్డాడు. చివరికి ఉత్తరంలోని అంశాన్ని తూచ తప్పకుండా అమలులో పెట్టాడు. పైనున్న ఆరుగురికీ, రాజారావు పైనున్న మరో యిద్దరికి ఉత్తర్వులొచ్చినా రాజారావు ఎక్కడున్నవాడు అక్కడే ఉండిపోయాడు. రాజారావుకిప్పుడు ప్రభుత్వం మీద రోషం పెరిగింది. జిల్లాలో అరవైకి పైగా ఖాళీలుంటే ఇరవైకే అనుమతి వచ్చింది. తర్వాత మళ్ళీ పదికి దించేశారు. అజ్ఞాతంగా తను చేసిన బెదిరింపువల్ల కనీసం ఆ పదిమందికి ఉద్యోగాలు వచ్చాయి. లంచాలిచ్చిన ఆ యిద్దరి సొమ్ములూ కవర్లలో పెట్టి, కిటికీల్లోంచి లోపలికి పడవేశాడు.

రామచంద్రం కబురు పంపగా రాజారావు వెంటనే వచ్చాడు. "ఒక పని చెయ్యి. నా కొడుకూ, కోడలూ ఓ బస్సు ప్రమాదంలో మరణించారన్న సంగతి నీకు తెలుసుననుకొంటాను. మనవణ్ణీ, మనవరాల్నీ మేమే పెంచుతున్నాం. వాళ్ళిద్దరూ మునిసిపల్ స్కూల్లో పదో తరగతిలోకి వచ్చారు. బుద్ధిమంతులైనా మార్కులు పెద్దగా వచ్చే విద్యార్థులు కాదు. బట్టీలు పట్టలేరు. తార్కికంగా ఆలోచించే అలవాటు కాలేదు. తల్లిదండ్రులు లేరన్న జాలితో చదువు విషయంలో వారిని మందలించే సాహసం చెయ్యలేకపోతున్నాం. వారిద్దరికీ ప్రైవేట్లు చెప్పు. నెలకి

రెండువేలిస్తాను," అన్నాడు రామశాస్త్రి.

నట్టేట్లో కొట్టుకుపోయేవాడికి ఓ ఎండుకొమ్మ దొరికినట్టుగా రాజారావు వెంటనే తలూపేశాడు. రాజారావు ప్రైవేటుపాఠాలు చెప్పడం పదిమంది దాకా పాకింది. వాళ్ళెవరూ జీతాలిచ్చుకొనే పరిస్థితిలో లేరు. రామచంద్రం మరో వెయ్యి రూపాయలిచ్చి, "నువ్వే చిన్న బడి పంతులువనుకొని వారందరికీ మా యింటి వెనక వసారాలో ప్రైవేట్లు చెప్పు. నేనిచ్చే మూడు వేలూ నీ జీతమనుకో," అన్నాడు. రాజారావు అర్థవంతంగా పాఠాలు చెప్పడం వల్ల అంతవరకూ అత్తెసరు మార్కులతో ప్యాసయ్యే వాళ్ళు అర్ధసంవత్సరం పరీక్షల్లో అరవైలు అందుకొన్నారు. ఒంటి పాదంతో నడిచే కలియుగధర్మం రాజ్యమేలుతున్న లోకాన్ని అర్థం చేసుకొంటున్న రాజారావు, నెమ్మది నెమ్మదిగా తీవ్రవాదపు ఆలోచనలకి తావిచ్చి, దానికి లొంగి అజ్ఞాత వీరుడిగా మారిపోను ఉద్యమించాడు.

ఓ రోజు సాయంకాలం రామచంద్రం మనవరాలు స్కూలు నుంచి రావాల్సిన సమయానికి ఇంటికి రాలేదు. రామశాస్త్రి కబురందుకొని రాజారావు ఓ అరడజను తన ప్రైవేటు విద్యార్థుల్ని వెంటబెట్టుకొని వెదుకులాట ప్రారంభించాడు. రాత్రి పదింటికి స్కూలికి కాస్త దూరంలో ఉన్న రాళ్ళక్వారి వద్ద అచేతనంగా కనబడింది. కట్టిన బట్టలు చిరిగిపోయి ఉన్నాయి. రాజారావు రామచంద్రంకి ఫోన్ చేశాడు. రామచంద్రం పోలీసులకి కబురుచేసి, మనవరాల్ని ఆస్పత్రికి తరలించాడు. స్పృహలోకి వచ్చిన తర్వాత, మొహాలకి రుమాళ్ళు అడ్డంగా కట్టుకొన్న ఎవరో ముగ్గురు దుర్మార్గులు తనని బలవంతంగా కారులోకి ఎక్కించి రాళ్ళ క్వారీ వద్దకు తీసుకుపోయి బలాత్కరించిన విషయం చెప్పింది. వాళ్ళని ఆనవాలుపట్టే వీలు లేకుండా, తన కళ్ళకి గంతలు కూడా కట్టేశారనీ చెప్పింది. రెండురోజుల తర్వాత ఆస్పత్రినుంచి విడుదలై ఇంటికి వచ్చింది. తర్వాత రాజారావుకి రహస్యంగా చెప్పింది. స్కూలు ప్రిన్సిపాల్ తమ్ముడు ఆ గుంపుకి నాయకుడని చెప్పింది. రాజారావు వాణ్ణి దారికాచి అడ్డగించి చితకబాదాడు. వాడు ఆస్పత్రిలో ఆఖరిశ్వాస పీల్చాడు.

రాజారావులోని లోపలి మనిషి విజృంభించాడు. ఉపన్యాసకుల చేత ఇరవైవేలుకి సంతకం పెట్టించుకొని, పదివేలు చేతిలోపెట్టే ఓ ప్రైవేటుకాలేజీ వ్యవస్థాపకుడి బుర్ర బద్దలుకొట్టాడు. ప్రభుత్వకాలేజీలో పనిచేస్తూ పాఠాలు సరిగా చెప్పక, స్వంత వ్యాపారం చేసుకొనే కొంతమంది ఉపన్యాసకులని వీపులు వాతలు తేరేటట్లు బెల్ట్ తో బాది, హెచ్చరించి పంపించేశాడు. వేసినరోడ్డు మొదటి వర్షంతోనే కొట్టుకుపోవడంతో ఆకాంట్రాక్టార్నీ, వార్డు కౌన్సిలర్నీ వంటిమీద మరిగిన తారు పోసి బొబ్బలు లేపేశాడు. కొన్నవస్తువులన్నింటిలో ఒకటి రెండు బిల్లులో రాయక, గేటుదగ్గరి సెక్యూరిటీ చెక్ లో దొంగతనం ఆపాదించి, డబ్బులు గుంజే ఒక మాల్ యజమాని చావుదెబ్బలు తిని, కాలవగట్టునున్న పార్కులో పోలీసులకి కనబడ్డాడు. వాడూ ఆస్పత్రిలో వెంటిలేటర్ ద్వారా అనంతవాయువుల్లో కలిసిపోయాడు.

రాజారావు అపరిచితుడిలోని విక్రమ్ లాగా, భారతీయుడిలోని కమలహాసన్ గా, హాలీవుడ్ సినిమా ఈక్వలైజర్ లోని డెనిజల్ వాషింగ్టన్లా భావించుకొంటూ తన గుర్తింపు తెలియకుండా చాలామందికి బుద్ధిచెప్పాడు. కొన్ని సందర్భాలలో హోటళ్లవారినీ, ధనికవ్యాపారస్తుల్నీ, ప్రజాప్రతినిథుల్నీ కుహనా అడవిఅన్నల పేరుతో బెదిరించి సొమ్ములు సంపాదించాడు. నలభైమంది విద్యార్థులతో ప్రాథమిక పాఠశాల నెలకొల్పాడు. పెట్టుబడి తాలూకు లోగుట్టు తెలియకుండా విరాళాలు సేకరించాడు. రామచంద్రం యిచ్చిన ఓ అరెకరం మెరకభూమి మీద రెండు పూరిపాకలతో స్కూలు రూపొందింది. రామశాస్త్రి తనకున్న కొద్దిపాటి పలుకుబడితో ప్రయత్నాలు చేసి ప్రభుత్వ సహాయం అందని పాఠశాలగా అనుమతి సంపాదించాడు. రాజారావు పిల్లలకి కావల్సిన పుస్తకాలన్నీ తానే కొని, వాటిని

స్కూలులోనే ఉంచుకొనే ఏర్పాట్లు చేసి, వీపు బరువు మోతలకి స్వస్తి పలికించేశాడు.
ప్రభుత్వ పాఠశాలల్లాగే, విద్యాలయాల్లాగే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య స్థావరాలూ, ఆస్పత్రులూ కుంటి నడకలు నడుస్తూనే ఉన్నాయి. స్థాయిపెంచే పథకాలు ఇలా వచ్చి అలా ఆవిరైపోతున్నాయి. అప్పుడప్పుడు అటు డాక్టర్లూ, ఇటు రోగులూ ఆందోళనలు జరుపుతోనే ఉన్నారు. కొన్ని సకారణ సహితం. మరికొన్ని అకారణ దౌర్జన్య వాదం. ఓ ప్రభుత్వ ఆస్పత్రిలోని ఓ డాక్టరు నిర్లక్ష్యం వల్ల రోగి ప్రాణం పోయిందని, ఆస్పత్రి ప్రాంగణంలో ఓ పల్లె జనమంతా తిష్టవేసి వంతుల వారీగా నిరాహార దీక్ష కొనసాగించారు. 'చాలా ఆలస్యంగా రోగిని తీసుకువచ్చారు. చేయవలసినదంతా చేసి రోగిని నగరంలోని పెద్దాసుపత్రికి అంబులెన్స్ లో తరలిస్తోంటే, డ్రైవరు మస్తుగా తాగి, అదుపుతప్పి ఓ చెట్టుని గుద్దేశాడు, డ్రైవరూ, రోగీ, ఇద్దరు రోగి బంధువులూ మరణించారు! ఏం చేసేది చెప్పండి?'ఇది డాక్టరు వాదన.

'అసలు ఆ డాక్టరు వారం రోజులుగా ఆస్పత్రికి రావటంలేదు. ఆయన ఆస్పత్రిలో ఉండి ఉంటే రోగి బతికే వాడే! ఇంటికి ఫోన్ చేస్తే పెద్దాసుపత్రికి పంపమని సలహా యిచ్చారు. అందుకనే పెద్దాసుపత్రికి పంపే ఏర్పాటు జరిగింది. డ్రైవరు ప్రమాదం చెయ్యడం దురదృష్టకరం!' ఇది ఆస్పత్రి కర్మచారుల వాఙ్మూలం. పత్రికా విలేకరులూ, ప్రజలూ అదే నిజమని నమ్మారు. నాలుగో రోజున డాక్టరు తన పొలంలోని బంగాళాపెంకుల చావిడిలో నవారుమంచం మీద శవమై తేలాడు. పదునైన బాకు గుండెల్లో దిగబడి ఉంది. పోలీసులకి ఆచూకీ ఏమీ తెలియలేదు.
రాజారావు తండ్రి రామచంద్రంతో అంటున్నాడు. "ఆ డాక్టరుగారిని అన్యాయంగా చంపేశారు. ధర్మాత్ముడు. మా ఆవిడ పురిటి రోజుల్లో నేను మా అత్తారి ఊరెళ్లాను. అక్కడ సక్రమమైన వైద్య సదుపాయాలు లేవు. పట్నం తీసుకొని పోయి ఆస్పత్రిలో చేర్పించండి అని అయినవారు సలహా యివ్వడంతో, రెండెడ్ల బండిలో, ఒక ఎరుకలసాని కూడా రాగా నేనూ, నా మామగారూ, అత్తగారూ, మా ఆవిణ్ణి తీసుకొని బయలు దేరాం. దారిలో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఎదురుగా నెమ్మదిగా వస్తున్న ఓ కారుని ఆపాం. ఆ కారులో ఉన్న ఆసామీ కారు ఆపి సంగతి విన్నాడు. అక్కడే ఓ పొలంలో రోడ్డువారనే ఉన్న బంగాళాపెంకుల చావడిలోకి మా ఆవిణ్ణి తీసుకువెళ్లి ఓ పట్టిమంచం మీద పడుకోబెట్టించాడు.
'కడుపులో బిడ్డ అడ్డం తిరిగింది. పెద్దాసుపత్రికి ఇలాంటి గతుకుల రోడ్డమ్మట తీసుకు వెళ్ళడం మంచిది కాదు. ఆలశ్యమైతే తల్లీ, బిడ్డలిద్దరికీ ఇద్దరికీ ప్రమాదం కలిగేటట్లుగా ఉంది. నేను డాక్టర్ని. ఇక్కడే నేను చేయగలిగింది చేస్తాను,' అని మమ్మల్ని దూరంగా పంపి, తన మెడికల్ బ్యాగ్ తెరిచి, ఎరుకలసాని సహాయంతో మా ఆవిడకి పురుడు పోశాడు! తల్లీ బిడ్డల్ని కాపాడాడు. సొమ్ములివ్వబోతే సున్నితంగా తిరస్కరించాడు. రాజా ఈ రోజున బడి నడుపుతున్నాడంటే అంతా ఆయన చలవే! ఇది ఖచ్చితంగా ఆయన మంచిని చూసి ఓర్వలేని కిరాతకులు చేసిన కుట్రే!'

ఈ మాటలు యాదృచ్ఛికంగా విన్న రాజారావు నిలుచున్న చోటనే కూలబడ్డాడు. 'ఏ మంచమీద తన జన్మ జరిగిందో, తల్లి ప్రాణం నిలబడిందో అదే మంచం మీద తమకు ప్రాణదానం చేసిన డాక్టరు తన చేతుల్లోనే చావడం.......? తనుపుట్టింది అందుకేనా?తను కారణజన్ముడా?'
'నాన్నా! నా జన్మవృత్తాంతాన్ని కనీసం ఎప్పుడైనా కథగా ఎందుకు చెప్పలేదు? ఆస్పత్రిలో గలభా జరుగుతోందని తెలిసీ డాక్టరుగారిని సమర్థించడానికి ఎందుకు వెళ్లలేదు? నిన్నుపిరికితనం ఆవహిస్తే, నన్ను ఆలోచనారహితమైన, అర్థరహితమైన ఆవేశం ముంచేసింది!' రాజారావు ఆత్మ ఘోషిస్తోంది. తండ్రిని నిలదీసి అడిగే నైతికబలం తనకి లేదు! బలం తెచ్చుకొని, సైకిలు తొక్కుకుంటూ పోలీసు స్టేషన్

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) ప = అసలు అక్షరం 'న'; 2) బ = అసలు అక్షరం 'క'**

**శోయుబు అబ్బదాశైపా**
**డీలో డీశు డాహ్తోముబోంమి**
**తేబనోలే అబ ఒష్ఘులడైప ష్జబ్లిలో**
**డాహ్తోమే ఒషబారాప్పి బోత్నోలాశు**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**


దిగులు వగలు తెలిసే వయసున కలుగును ఊహలెవో
అవి తెలగి మదిలో ఆశలు రేగ ఆపద మూడునుగా
ఏల కలుగునో ఎరిగే మునుపే కాలము తీరునుగా
లోకమేరుగని బాలా దీని పోకడ చిత్రముగాదా

జనవరి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:

శ్రీ కె మురళీమోహన్,
బాచుపల్లి,హైదరాబాద్


పద్మ విభూషణులు

**RNI No. TELTEL/2011/39497 FEBRUARY 2020 Postal No. HSE/1043/2017-19**
Date of Publishing 1st February Date of Posting 8th February




Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001